

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 282

మంగళవారం 2-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వన్డేలకు వార్నర్ గుడ్‌బై

రిటైర్మెంట్ ప్రకటించిన ఆసీస్ ఓపెనర్.. ఇక టీ20లకే పరిమితం - 14లో



సరికొత్త రికార్డులు


జీవితకాల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్, నిఫ్టీ.. ఆ తర్వాత మళ్లీ వెనక్కి.. - 15లో



జపాన్‌లో సునామీ హెచ్చరికలు

జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదవ్వగా.. సునామీ హెచ్చరికలు జారీ చేశారు.

వివరాలు 6లో ▸



సూర్య నమస్కారాలతో రికార్డు

గుజరాత్‌లో 50 వేల మందికి పైగా ప్రజలు ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేయడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పారు.


వివరాలు 6లో ▸



మసూద్ అజార్ హతం?

కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి మసూద్ అజార్ హతమయ్యాడంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

వివరాలు 6లో ▸



నోబెల్ గ్రహీతకు 6 నెలల జైలు

కార్మిక సంక్షేమ నిధిని నెలకొల్పడంలో విఫలమయ్యారంటూ బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త మహ్మద్ యూనస్‌కు కోర్టు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

వీసాతో పనిలేకుండానే విదేశాలకు రయ్.. రయ్!



'భారతీయులూ.. వీసా లేకుండా మా దేశాన్ని సందర్శించండి' అంటూ వివిధ దేశాలు ఇస్తున్న వరుస ప్రకటనలతో.. ఇంటర్నేషనల్ ట్రిప్స్ కోసం ఎదురుచూస్తున్న వారంతా విమానయానాలకు సిద్ధమవుతున్నారు. దీనికి అనుగుణంగా విశాఖ నుంచి విమానయాన సర్వీసులు పెరుగుతున్నాయి.

వివరాలు 16లో ▸

ఒకే జిల్లాలో 61 వేల కొత్త ఓట్లు



బాపట్ల జిల్లాలో భారీ సంఖ్యలో కొత్త ఓటర్ల నమోదు జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో ఓటేయడానికి నవతరం ఉత్సాహంగా ముందుకు వస్తోంది. ఈ జిల్లాలో ఇప్పటివరకు 61,193 ఓట్లను కొత్తగా చేర్చారు. వీటిలో యువతవే 80 శాతం ఉన్నట్లు సమాచారం.

వివరాలు 10లో ▸

మణిపూర్‌లో కాల్పులు.. ముగ్గురు మృతి



మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తౌబల్ జిల్లా లిలాంగ్ చింగ్ జావో ప్రాంతంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని దుండగులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

■ ముఖ్యమంత్రి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. సీఎంకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. టీటీడీ సహా పలు దేవాలయాల అర్చకులు ఆశీర్వచనాలు ఇచ్చారు. - 2లో

నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



పండుగలా పింఛన్ల పంపిణీ

■ కొత్త ఏడాదిలోనూ రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ పండుగలా మొదలైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.3,000 చొప్పున ఈనెల పింఛన్ డబ్బులు అందుకున్న అవ్వాతాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. - 16లో

అల్లూరి సీతారామరాజు జిల్లా చావిడిమామిడిలో లబ్ధిదారులకు పింఛన్ రూ.3,000ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

ఆరోగ్య సురక్ష రెండోదశ

నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు ప్రారంభం

- రేపటి నుంచి నగరాలు, పట్టణాల్లో కార్యక్రమానికి శ్రీకారం
- ఆరు నెలల్లో 13,954 శిబిరాల నిర్వహణకు వైద్య శాఖ ప్రణాళిక
- ప్రతి శిబిరంలో ముగ్గురు వైద్యులతో సేవలు
- తొలి దశ సురక్షలో 60 లక్షల మందికి సొంత ఊళ్లలోనే వైద్యం
- రాష్ట్రంలో ప్రతి కుటుంబం, ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా సీఎం జగన్ అడుగులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న ఆరోగ్య సురక్ష '(జేఏఎస్) రెండో దశ అమలుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. నేటి నుంచి గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుండగా వారానికి రెండు రోజుల చొప్పున మంగళ, శుక్రవారాల్లో జేఏఎస్‌ను నిర్వహిస్తారు. ఇక పట్టణాలు, నగరాల్లో రెండో దశ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. తొలిదశలో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో 50 రోజులపాటు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. సొంత ఊళ్లలోనే 60 లక్షల మంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలందించింది. నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించడంలో భాగంగా రెండో దశను చేపట్టారు.

ఆరు నెలల్లో 13,954 శిబిరాలు

జేఏఎస్ రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల్లో 13,954 సురక్ష శిబిరాలు నిర్వహించేలా వైద్య శాఖ ప్రణాళిక రూపొందించింది. గ్రామాల్లో 10,032, పట్టణాలు, నగరాల్లో 3,922 చొప్పున శిబిరాలు

మిగతా 2వ పేజీలో ▶

జగనన్న ఆరోగ్య సురక్ష తొలిదశ సేవలు ఇలా..

ఆరోగ్య సిబ్బంది సందర్శించిన గృహాలు 1,45,35,705	మొత్తం సురక్ష శిబిరాలు 12,423 (రూరల్: 10,033 అర్బన్: 2,390)
నిర్వహించిన వైద్య పరీక్షలు 6,45,06,018	
శిబిరాల్లో నమోదైన ఓపీలు 60,27,843	తదుపరి వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫరల్ 1,64,982



నింగిలోకి ఎక్స్‌పోశాట్


నూతన సంవత్సరంలో తొలి రోజే ఇస్రో ధమాకా

పీఎస్‌ఎల్‌వీ 60వ ప్రయోగం దిగ్విజయం 6 లో

ఫ్యూయల్ సెల్ సహా 10 పరికరాలు భూ కక్ష్యలోకి..

- భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో కీలకం
- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు
- ఇది గగన్‌యాన్ ఏడాది: ఇస్రో చైర్మన్

ఇదండీ సంగతి



నాకెందుకో కూటమి లేనప్పుడే బాగా కలిసి ఉన్నామనిపిస్తుంది!

పేట్రేగిన టీడీపీ-జనసేన మూకలు..

మంత్రి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి



ఆదివారం అర్ధరాత్రి గుంటూరులోని చంద్రమౌళినగర్‌లో టీడీపీ, జనసేన గూండాల రాళ్ల దాడిలో ధ్వంసమైన మంత్రి విడదల రజిని కార్యాలయం

గుంటూరులో అర్ధరాత్రి అరాచకం..

- న్యూఇయర్ వేడుకల ముసుగులో టీడీపీ, జనసేన మూకల ర్యాలీ.. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు
- మంత్రి రజిని నూతన కార్యాలయంపై రాళ్లతో దాడి
- అడ్డుకున్న పోలీసులపైనా దౌర్జన్యం.. సెక్యూరిటీ గార్డుపై దాడి..పోలీసుల అదుపులో 30 మంది
- వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు
- ఈ దాడిలో 100మందికి పైగా పాల్గొన్నట్లు పోలీసుల నిర్ధారణ
- ఓటమి భయంతోనే దాడులు : మంత్రి రజిని

3 లో

పట్టణ పేదల సొంతింటి కల సాకారం

4న అనకాపల్లి జిల్లా నుంచి ప్రారంభం



- మొదటి దశలో 1,51,298 టిడ్కో ఇళ్లు పూర్తి
- ఇప్పటికే 82,080 ఇళ్లను పంపిణీ చేసిన ప్రభుత్వం
- వచ్చే నెల చివరి నాటికి మరో 73,580 ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు షెడ్యూల్
- 88 పట్టణాల్లో 2.62 లక్షల ఇళ్ల నిర్మాణం
- 1,43,600 మందికి ఉచితంగానే కేటాయింపు
- మరో 1,18,616 మంది లబ్ధిదారుల వాటా సగానికి తగ్గింపు.. రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.4,368 కోట్లు ప్రజాధనం ఆదా చేసిన ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ తదితరాల మినహాయింపుతో పేదలకు రూ.5,487.32 కోట్ల మేలు
- టిడ్కో ఇళ్లు కాకుండా ఇప్పటికే సుమారు 31 లక్షల మంది మహిళలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు

11 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సర్కారు దయతో పునర్జన్మ



మాది రెక్కాడితే గాని డొక్కాడని బతుకు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. గుంటూరు రాజీవ్ గాంధీనగర్‌లో నివసిస్తున్న నాకు నలుగురు పిల్లలు. పెద్దమ్మాయి పెళ్లి చేశాను. నా భార్య చాలాకాలం క్రితమే కన్ను మూసింది. ఇద్దరు కొడుకులు చిన్న చిన్న పనులు చేస్తున్నారు. వారి ఆదాయం అంతంతమాత్రమే. చిన్నమ్మాయి చదువు పూర్తయి ఇంటి దగ్గరే ఉంటోంది. దీంతో కుటుంబ పోషణ భారమంతా నా పైనే పడింది. రెండేళ్ల క్రితం ఆటో నడుపుతుండగా అకస్మాత్తుగా గుండెల్లో నొప్పి వచ్చింది. మా అబ్బాయి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ పరీక్షలు నిర్వహించి అత్యవసరంగా బైపాస్ సర్జరీ చేయాలని, లేకుంటే ప్రాణాలకే ముప్పని గుండె పగిలిపోయే వార్త చెప్పారు. సుమారు 3 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అసలే అంతంత మాత్రం బతుకులు. ఆ సమయంలో అంత డబ్బు ఎలా అని ఆందోళన చెందా. మాకు తెల్ల రేషన్ కార్డు ఉండడంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిసింది. వెంటనే ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రను కలిశాను. వారి సహకారం అందించడంతో ఆపరేషన్ చేసి నాకు పునర్జన్మ ప్రసాదించారు. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తర్వాత యధావిధిగా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రస్తుతం నేను అద్దె ఇంట్లో ఉంటున్నా. జగనన్న కాలనీలో మాకు స్థలం కూడా కేటాయించారు. అంతేకాకుండా వైఎస్సార్ వాహనమిత్ర కింద రూ. 10 వేలు చొప్పున ఐదు విడతల్లో 50 వేల వరకు లబ్ధి పొందాను. పేదలకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది. నాలాంటి వారికి ఎందరికో ప్రాణభిక్ష పెట్టింది.

– రావెల ప్రభాకర్, రాజీవ్‌గాంధీ నగర్, గుంటూరు

(ధూపాటి ప్రకాష్, విలేకరి, నెహ్రూనగర్ (గుంటూరు))

అప్పు చేయకుండా వ్యవసాయం చేస్తున్నా



ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం జగన్నాథపురంలో నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఏటా మిరప పంట సాగు చేస్తాను. ఆ పంట ద్వారా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తాను. ప్రతి ఏడాది పెట్టుబడులు పెట్టలేక తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనేవాడిని. ఎరువులు, పురుగుల మందుల కోసం ఊళ్లో అందరి దగ్గర అప్పు చేసేవాడిని. పంట పండిన తర్వాత వాటిని అమ్మి అప్పులు చెల్లించేవాడిని. పంట ద్వారా వచ్చిన డబ్బు దానికే సరిపోయేది. బతకడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రతి సంవత్సరం రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500లు నేరుగా నా బ్యాంకు ఖాతాలో జమవుతోంది. ఈ ఏడాది కూడా రైతు భరోసా నిధులు పడ్డాయి. ఆ డబ్బులు నాకు చాలా ఉపయోగపడుతున్నాయి. పంట వేసే సమయంలో ఎరువులు, దుక్కి, నారు కోసం ఇప్పుడు అప్పు చేయాల్సిన అవసరం రాలేదు. ఆర్బీకే ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ధరలకు అందాయి. అంతేకాదు నా కుమారుడికి అమ్మ ఒడిలో భాగంగా ప్రతి ఏటా రూ. 15 వేలు అందుతోంది. మా జీవనం సాఫీగా సాగిపోతోంది.

– తంగిరాల ఏసురత్నం, జగన్నాథపురం, తర్లుపాడు మండలం

(రామ యోగయ్య విలేకరి, తర్లుపాడు)

ఉన్నత విద్యకు గొప్ప ప్రోత్సాహం



సాధారణ కుటుంబంలో పుట్టిన నేను ఇంజినీరింగ్ చదువుతానని కలలో కూడా ఊహించలేదు. నేను ఉన్నత విద్య చదువుతున్నానంటే దానికి ఈ ప్రభుత్వమే కారణం. ప్రస్తుతం నేను అవంతి ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాను. విశాఖపట్నం నగరం కూర్మన్నపాలెం భరత్‌నగర్‌లో ఉంటున్న మా నాన్న తుమ్మపాల లక్ష్మణ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. కాలేజీ ఫీజు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతగానో ఉపయోగపడింది. ఒక్కో సంవత్సరానికి రూ. 49,500లు చొప్పున రెండు సంవత్సరాలకు 99 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఇది కాకుండా రెండేళ్లుగా జగనన్న వసతిదీవెన పథకం ద్వారా రూ.10 వేల చొప్పున మొత్తం 20 వేలు అందింది. దీంతో ఫీజులు కట్టడానికి అవస్థలు తీరాయి. మా తమ్ముడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పోయిన ఏడాది వరకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. మరిన్ని ఉన్నత చదువులు చదువుకునే వీలు కల్పిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కష్టపడి చదివే మాలాంటి పేద విద్యార్థులకు ప్రభుత్వం చేస్తున్న సాయం ఎంతో గొప్పది. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాల వల్ల హాయిగా బతుకుతున్నాం.

– తుమ్మపాల హేమ, భరత్‌నగర్, కూర్మన్నపాలెం

(పట్నాన కోటిరెడ్డి, విలేకరి, కూర్మన్నపాలెం)



సీఎం వైఎస్ జగన్‌కు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనం అందజేస్తున్న టీటీడీ వేదపండితులు

సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

సాక్షి, అమరావతి/తిరుమల: ముఖ్యమంత్రి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తాడేపల్లిలోని సీఎం నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు సీఎం జగన్‌కు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను, టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వల్లవన్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.



గవర్నర్‌కు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేస్తున్న అమరేశ్వరాలయ వేదపండితులు, అధికారులు

గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వేదాశీర్వచనం

అమరావతి/సాక్షి, అమరావతి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థాన అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. దేవదాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కరికాల వల్లవన్ నేతృత్వంలో ఆలయ ఈవో వేమూరి గోపినాథశర్మ, వేదపండితులు విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన

పీఎస్ఎల్‌వీ–సీ58 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. అంతరిక్షంలో బ్లాక్ హోల్స్‌ను అధ్యయనం చేసేందుకు ఉపగ్రహాన్ని పంపిన రెండో దేశంగా భారత్ కీర్తి పతాకాన్ని ఎగురవేశారని ప్రశంసించారు. ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించినట్టు రాజ్‌భవన్ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

ఆరోగ్య సురక్ష రెండో దశ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించనున్నారు. ఈ నెలలో 3,583 శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామం చొప్పున, మునిసిపాలిటీల్లో వారానికి ఒక వార్డు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను ఆర్నెలలో కవర్ చేసేలా శిబిరాలను నిర్వహిస్తారు. శిబిరాల నిర్వహణకు 15 రోజుల ముందు ఒకసారి, మూడు రోజుల ముందు మరోసారి వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి జేఏఎస్–2పై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శిబిరంలో స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉంటారు. ప్రజలకు సొంత ఊళ్లలో స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 జనరల్ మెడిసిన్, 645 గైనకాలజిస్ట్, 349 జనరల్ సర్జన్, 345 ఆర్థోపెడిక్స్, 378 మంది చొప్పున ఇతర స్పెషలిస్ట్ వైద్యులను, కంటి సమస్యల స్క్రీనింగ్ కోసం 562 మంది పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లను నియమించారు. వైద్య శిబిరాల్లో అవసరమైన అన్ని మందులను అత్యవసర ఔషధాలతో సహా అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు ఏడు రకాల కిట్లు శిబిరాల్లో అందుబాటులో ఉంటాయి.

చేయి పట్టి నడిపిస్తూ..

వైద్య శిబిరాల ద్వారా సొంతూళ్లలో వైద్య సేవలు అందించడమే కాకుండా అనారోగ్య బాధితులను వైద్య పరంగా ప్రభుత్వం చేయి పట్టుకుని నడిపిస్తోంది. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తారు. వీరు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రయాణ చార్జీల కింద రూ.500 చొప్పున అందచేస్తోంది. రిఫరల్ రోగులను ఆస్పత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు. జీజీహెచ్‌లు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఉంటాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం వైద్య పరంగా అండగా నిలుస్తోంది. వీరికి ఉచిత కన్సల్టేషన్‌లతో పాటు కాలానుగుణంగా ఉచితంగా మందులు అందజేస్తోంది.

జేఏఎస్–2 పర్యవేక్షణ అధికారులు

అధికారి	జిల్లాలు
వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	కృష్ణా, ఎన్టీఆర్
వైద్య శాఖ కార్యదర్శి	గుంటూరు, పల్నాడు
ఎండీ, ఏపీఎంఎస్ఐడీసీ	కర్నూలు, నంద్యాల
కమిషనర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ	బాపట్ల, ప్రకాశం
సెక్రటరీ, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్	అనంతపురం, శ్రీసత్యసాయి
డీఎంఈ	కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి
డైరెక్టర్, పబ్లిక్ హెల్త్	నెల్లూరు, తిరుపతి
డైరెక్టర్, సెకండరీ హెల్త్	ఏఎస్ఆర్, మన్యం
డైరెక్టర్ జనరల్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్	విశాఖపట్నం, అనకాపల్లి
మెంబర్ సెక్రటరీ, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్	వైఎస్సార్ కడప
డీఎంఈ (అకడమిక్)	ఏలూరు, పశ్చిమగోదావరి
కమిషనర్, ఆయుష్	శ్రీకాకుళం, విజయనగరం

జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులు

జేఏఎస్–2 కార్యక్రమం అమలు పర్యవేక్షణకు వైద్య, ఆరోగ్య శాఖ జిల్లాలవారీగా ప్రత్యేకంగా అధికారులను నియమించింది. వీరు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో కార్యక్రమం అమలును పర్యవేక్షిస్తారు. లోటుపాట్లు ఉంటే సంబంధిత విభాగాధిపతుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారు.

ప్రజల వద్దకే వైద్యం

జేఏఎస్–2 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. మందులు, వైద్య పరీక్షల కిట్‌లు సరఫరా చేశాం. శిబిరాల నిర్వహణపై జిల్లా యంత్రాంగాలు షెడ్యూల్‌లు రూపొందించాయి. ఆ మేరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల వద్దకు చేరుస్తూ జేఏఎస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలి.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

టెన్త్, ఇంటర్‌లో భారీగా 'రీ అడ్మిషన్లు'

- పరీక్ష తప్పినా 'రెగ్యులర్' విద్యార్థులుగా పరీక్ష రాసే అవకాశం
- పదో తరగతిలో 1.03 లక్షల మంది ఎన్‌రోల్
- ఇంటర్మీడియెట్‌లో 90,251 మంది విద్యార్థులు
- గత, ప్రస్తుత విద్యా సంవత్సరాల్లో ఎక్కువ వచ్చిన మార్కులే పరిగణనలోకి..

సాక్షి, అమరావతి: గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన 'రీ అడ్మిషన్' అవకాశాన్ని భారీ సంఖ్యలో వినియోగించుకున్నారు. సుమారు 1,93,251 మంది తిరిగి ఆయా తరగతుల్లో ప్రవేశాలు పొందారు. వీరికి ఈ విద్యా సంవత్సరంలో చేరిన రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా అన్ని అవకాశాలు కల్పించనున్నారు. రాష్ట్రంలో నూరు శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సాధనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్ తప్పినవారికి రాష్ట్ర ప్రభుత్వం పునర్ ప్రవేశ అవకాశం కల్పించింది. గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా సర్వే చేసి, ఆయా విద్యార్థులను తిరిగి ఎన్‌రోల్ చేశారు. దాంతో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి తప్పిన 1,23,680 మందిలో 1,03,000 మంది, ఇంటర్‌లో 90,251 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. సాధారణంగా పరీక్ష తప్పినవారు తిరిగి ఫీజు కట్టి పరీక్షలు రాస్తే (సప్లిమెంటరీ) వారిని 'ప్రైవేటు' విద్యార్థులుగా పరిగణిస్తారు. కానీ.. రీ అడ్మిషన్ తీసున్న వారిని 'రెగ్యులర్' విద్యార్థులుగానే పరిగణిస్తారు.

ఎక్కువ మార్కులే పరిగణనలోకి..

ఆయా తరగతుల్లో రీ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులు మాత్రమే కాకుండా రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా పబ్లిక్ పరీక్షల్లో అన్ని పేపర్లు రాయాల్సి ఉంటుంది. అయితే, విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో సాధించిన మార్కులు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో మార్కులను పరిశీలించి, ఆయా సబ్జెక్టుల్లో ఏ విద్యా సంవత్సరంలో ఎక్కువ మార్కులు వస్తే వాటినే అంతిమంగా లెక్కలోనికి తీసుకుంటారు. ఉదాహరణకు ఓ విద్యార్థి 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫెయిలై, ఇప్పుడు రీ అడ్మిషన్ తీసుకుంటే.. గతేడాది మ్యాథ్స్ పేపర్‌లో 70 మార్కులు వచ్చాయనుకుంటే.. ఈ ఏడాది పరీక్షల్లో అదే పేపర్ 30 మార్కులే వస్తే.. గత ఏడాది వచ్చిన 70 మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే.. అన్ని సబ్జెక్టులు పాసైన రీ అడ్మిషన్ విద్యార్థుల సర్టిఫికెట్లపై ప్రైవేట్/కంపార్ట్‌మెంటల్/స్టార్ గుర్తు వంటివి లేకుండా 'రెగ్యులర్' అని గుర్తింపు ఇస్తారు. వీరికి కూడా ప్రభుత్వం నుంచి వచ్చే జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వంటి అన్ని పథకాలు వర్తింపజేశారు.

ఒక్కసారే అవకాశం

ఓ విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిలైన వారికి మరుసటి సంవత్సరం మాత్రమే రీ అడ్మిషన్‌తో పాటు అన్ని రెగ్యులర్ ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం కల్పిస్తారు. ఈ విద్యార్థులు రెండో ఏడాదీ ఫెయిలైతే వారికి మరో అవకాశం ఉండదు. వారు ప్రైవేటుగానే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. 2022–23లో ఇంటర్మీడియెట్, పదో తరగతి ఫెయిలై తిరిగి రెగ్యులర్ గుర్తింపు పొందిన 1,93,251 మంది విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరానికి గాను వచ్చే మార్చిలో పరీక్షలు రాయనున్నారు. వీరు ఈ విద్యా సంత్సరంలో అన్ని సబ్జెక్టులు పాసైతే 'రెగ్యులర్' సర్టిఫికెట్ అందుకుంటారు. ఫెయిలైతే తిరిగి సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సిందే.

ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: పీఎస్ఎల్‌వీ–సీ58 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించినందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శాస్త్రవేత్తలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. ఈ నూతన సంవత్సరంలో ఉపగ్రహాన్ని అనుకున్న కక్ష్యలోకి ప్రవేశపెట్టడం చాలా సంతోషకరమైన క్షణమని అన్నారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

శాసన మండలిలో నూతన సంవత్సర వేడుకలు

సాక్షి, అమరావతి: నూతన సంవత్సర వేడుకలు రాష్ట్ర శాసన మండలిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు, డిప్యూటీ సెక్రటరీ విజయరామారావు పాల్గొన్నారు.

సీఎస్‌కు ఉన్నతాధికారుల శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతాధికారులు కె.విజయానంద్, ఎస్ఎస్ రావత్, గోపాలకృష్ణ ద్వివేది, బి.రాజశేఖర్, కె.సునీత, జి.జయలక్ష్మి, చిరంజీవి చౌదరి, ఎస్.బాగ్చి, డా.ఎస్.యువరాజ్, గిరిజా శంకర్, సత్య ప్రభాకర్, హరి జవహర్‌లాల్, పోలా భాస్కర్, గంధం చంద్రుడు, ఈఎన్సీ నారాయణరెడ్డి, పశ్చిమ గోదావరి కలెక్టర్ ప్రశాంతి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సంఘాల డైరీలు, కేలండర్లను సీఎస్ ఆవిష్కరించారు. అంతకుముందు సీఎస్‌కు టీటీడీ వేద పండితులు వేద ఆశీర్వచనంతో పాటు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం విజయవాడ మానసిక వికలాంగుల కేంద్రం చిన్నారులకు సీఎస్ జవహర్‌రెడ్డి స్వీట్లు అందజేశారు.

నమ్మకాన్ని కాపాడింది

జగనన్న 'పాల వెల్లువ'తో పాడిరైతుల్లో భరోసా

- మూడేళ్లలో ఏడుసార్లు సేకరణ ధరల పెంపుతో లబ్ధి
- రికార్డు స్థాయిలో రోజుకు 3.61 లక్షల లీటర్ల సేకరణ
- ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతాన్ని లెక్కగట్టి అణా పైసలతో చెల్లింపు
- ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట

సాక్షి, అమరావతి: 'జగనన్న పాల వెల్లువ' (జేపీవీ)కు ఆదరణ వెలువెత్తుతోంది. ప్రైవేట్ డెయిరీల దోపిడీకి చెక్ పెడుతూ 'అమూల్' దూసుకెళుతోంది. నిండా మూడేళ్లు కూడా నిండని అమూల్ పాడి రైతుల నమ్మకాన్ని చూరగొనడంతో పాలు పోసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రికార్డు స్థాయిలో పాల సేకరణ జరుగుతోంది. నిన్న మొన్నటి వరకు రోజుకు 1.74 లక్షల లీటర్ల పాలను సేకరించిన అమూల్ ప్రస్తుతం ఏకంగా 3.61 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోంది. అమూల్‌కు పాలు పోసే పాడిరైతుల సంఖ్య మూడింతలు పెరిగింది.

1,800 లీటర్ల నుంచి 3.61 లక్షల లీటర్లకు..

రాష్ట్రంలో జగనన్న పాల వెల్లువ ఓ ఉద్యమంలా సాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2020 డిసెంబర్‌లో జేపీవీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మూడు (వైఎస్సార్, చిత్తూరు, ప్రకాశం) జిల్లాల్లో 401 గ్రామాలతో మొదలైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 19 జిల్లాల్లో 4,127 గ్రామాలకు విస్తరించింది. తొలుత ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యేందుకు 24,277 మంది ముందుకు రాగా నేడు అది 3,78,567 మందికి చేరింది. రోజూ పాలుపోసే పాడి రైతులు ప్రారంభంలో 800 మంది ఉండగా నేడు ఏకంగా లక్ష మందికి చేరుకున్నారు. ప్రారంభంలో రోజుకు సగటున 1,800 లీటర్లు పాలు పోయగా ఇప్పుడు ఏకంగా 3.60,808 లీటర్ల సేకరణ జరుగుతోంది. దశాబ్దాల చరిత్ర, విస్తృత నెట్‌వర్క్ కలిగిన ప్రైవేట్ డెయిరీలు సైతం రోజుకు సగటున 6 లక్షల లీటర్లకు మించి పాలు సేకరించలేని పరిస్థితి నెలకొనగా మూడేళ్ల వయసున్న అమూల్ నిత్యం రాష్ట్రంలో 3.61 లక్షల లీటర్లకు పైగా పాలు సేకరిస్తుండడం అరుదైన రికార్డుగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా గత ఆరు నెలల్లో ఈ ప్రాజెక్టు గణనీయమైన వృద్ధి నమోదు చేసింది. ఈ ఏడాది జూలై నాటికి 3,475 గ్రామాల పరిధిలో 3.11 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా రోజుకు సగటున 68 వేల మంది 1.74 లక్షల లీటర్ల పాలు పోసేవారు. అలాంటిది డిసెంబర్ 25 నాటికి 4,127 గ్రామాలకు విస్తరించగా ప్రాజెక్టులో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య ఏకంగా 3.78 లక్షల మందికి చేరుకుంది. రోజుకు సగటున 3.61 లక్షల లీటర్ల పాలు పోయడంతో ఆర్నెల్లలో సేకరణ రెట్టింపు దాటింది. వృద్ధి రేటు ఏకంగా 197.99 శాతంగా నమోదు కావడం గమనార్హం.

నమ్మకం పెరిగిందిలా...

అమూల్ ప్రారంభంలో 11 శాతం వెన్న, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో గేదె పాలకు రూ.71.74 చొప్పున చెల్లించింది. 5.4 శాతం వెన్న, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో ఆవు పాలకు రూ.34.20 చొప్పున చెల్లించగా మూడేళ్లలో ఏడు సార్లు పాల సేకరణ ధరలను పెంచింది. ప్రస్తుతం గేదె పాలకు లీటర్‌కు రూ.89.76, ఆవు పాలకు రూ.43.69 చొప్పున చెల్లిస్తోంది. పాల ఉత్పత్తి అధికంగా ఉన్నప్పుడు సేకరణ ధరలు తగ్గించడం, ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు ధరలు పెంచినట్లుగా గిమ్మిక్కులు చేస్తూ పాడి రైతులను ప్రైవేటు డెయిరీలు దోచుకునేవి. అమూల్ మాత్రం ఉత్పత్తి తగ్గినా, పెరిగినా ఒకే రీతిలో ప్రకటించిన ప్రకారం పాల సేకరణ ధరలను చెల్లిస్తోంది. పైగా ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతాన్ని బట్టి లెక్కగట్టి అణాపైసలతో సహా పాలు పోసిన 10 రోజుల్లో నేరుగా పాడిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ శాతాన్ని బట్టి గేదె పాలకు లీటర్‌కు రూ.100, ఆవు పాలకు రూ.50కు పైగా ధర పక్కాగా లభిస్తుండడంతో పాడిరైతుల్లో అమూల్ పట్ల భరోసా ఏర్పడింది.



ఎన్టీఆర్ జిల్లా బరుజుపల్లిలో జగనన్న పాలవెల్లువ కేంద్రంలో పాలు పోస్తున్న మహిళా పాడి రైతులు

రూ.4.93 కోట్ల బోనస్.. భారీగా రుణాలు

ఏడాదిలో కనీసం 180 రోజుల పాటు క్రమం తప్పకుండా పాలుపోసే వారికి లీటర్‌కు రూ.0.50 చొప్పున అమూల్ బోనస్ చెల్లిస్తుండడం పాడిదారులకు భరోసానిస్తోంది. మూడేళ్లలో రాయల్టీ ఇన్సెంటివ్ (బోనస్) కింద రూ.4.93 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం గమనార్హం. లాభాపేక్ష లేకుండా 2,300 టన్నులకుపైగా నాణ్యమైన ఫీడ్‌ను పంపిణీ చేసింది. అంతేకాకుండా వర్కింగ్ క్యాపిటల్ రూపంలో గేదెలకు రూ.30 వేలు, ఆవులకు రూ.25 వేల చొప్పున ఆర్థిక చేయూతనివ్వడమే కాకుండా కొత్తగా పాడి కొనుగోలుకు ముందుకొచ్చే రైతులకు గేదెకు రూ.93 వేలు, ఆవులకు రూ.76 వేల చొప్పున స్వయంగా రుణాలందిస్తోంది. ఇప్పటివరకు 12,728 మంది మహిళా పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.60.29 కోట్లు అందించారు. 3,090 మంది రైతులకు పాడి కొనుగోలుకు రూ.30.01 కోట్లు రుణాలిచ్చారు. జేపీవీ ప్రాజెక్టులో భాగంగా 9,899 గ్రామాల్లో పాలసేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. తొలిదశలో రూ.680 కోట్లతో 3,156 గ్రామాల్లో ఏఎంసీయూ, బీఎంసీయూల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. జేపీవీ ప్రారంభ మైనప్పటి నుంచి నేటి వరకు 12.70 కోట్ల లీటర్ల పాలను సేకరించగా రూ.575.42 కోట్లు పాడి రైతుల ఖాతాల్లో జమ చేసింది.

అరుదైన రికార్డు..



జేపీవీ ప్రాజెక్టుకు గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తోంది. మూడేళ్లలో అనూహ్య పురోగతి సాధించింది. రోజుకు 3.61 లక్షల లీటర్ల పాలను సేకరించడం ఓ అరుదైన రికార్డుగానే చెప్పవచ్చు. ప్రైవేట్ డెయిరీలు ఏ స్థాయిలో దోపిడీ చేస్తున్నాయో, ఎలా నష్టపోతున్నారో పాడి రైతులకు అర్థమయ్యే రీతిలో చెప్పడంలో అమూల్ విజయవంతం కావడం వల్లే ఇది సాధ్యమైంది. నాలుగు లక్షల లీటర్ల సేకరణను అధిగమించే రోజు దగ్గర్లోనే ఉంది. – అహ్మద్ బాబు, ఎండీ, ఏపీడీడీసీఎఫ్

అణా పైసలతో సహా చెల్లిస్తున్నారు..



జగనన్న పాల వెల్లువ కేంద్రంలో రోజూ 4–5 లీటర్ల గేదె పాలు పోస్తుంటాం. నాణ్యమైన మేత వల్ల పాల నాణ్యత పెరిగింది. ఫ్యాట్ 13, ఎస్ఎన్ఎఫ్ 9 శాతంతో మంగళవారం 4.4 లీటర్ల పాలు పోయగా లీటర్‌కు రూ.102.50 చొప్పున రూ.451 సేకరణ ధర లభించింది. ప్రకటించిన ధర కంటే రూ.56 అదనంగా వచ్చింది. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే లీటర్‌కు రూ.50 రావడం కూడా గగనంగా ఉండేది. ఫ్యాట్ 11, ఎస్ఎన్ఎఫ్ 9 శాతానికి మించి ఇచ్చేవారు కాదు. పాల ఉత్పత్తి అధికంగా ఉన్న సమయంలో ఏదో ఒక సాకుతో కోతలు పెట్టేవారు. ఇప్పుడు ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ ఎంత శాతం ఉంటే ఆ మేరకు లెక్కగట్టి నగదు మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. – చిరుమామిళ్ల రాణి, కొంజెర్ల, గంపలగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా

విశాఖ లైంగిక దాడి ఘటనపై సుమోటోగా కేసు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

సాక్షి, అమరావతి: విశాఖలో సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనపై మహిళా కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించినట్లు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని, పూర్తి వివరాలు తెలియజేయాలని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. లైంగికదాడికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు.

యువతిని వేధించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

పెదగంట్యాడ (గాజువాక): ఓ యువతిని వేధించిన కేసులో న్యూపోర్టు క్రైం కానిస్టేబుల్‌పై విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ సోమవారం సస్పెన్షన్ వేటు వేశారు. న్యూపోర్టు క్రైం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. యన్నంశెట్టి రాము న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో క్రైం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 2023 ఏప్రిల్‌లో ఫేస్‌బుక్ ద్వారా కాపుజగ్గరాజుపేటకు చెందిన ఓ యువతి పరిచయమైంది. కొద్ది రోజుల పాటు ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె కుటుంబ సభ్యులకు సైతం దగ్గరయ్యాడు. ఇదిలా ఉంటే రాముకు పెళ్లయినట్లు తెలుసుకున్న సదరు యువతి అతడ్ని దూరం పెట్టింది. అయినప్పటికీ తనతో మాట్లాడాలని, పెళ్లి చేసుకుంటానని ఆమెను వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గత నెల 12న రాత్రి సమయంలో ఆమె ఇంటికి వెళ్లాడు. దీంతో ఆమె 100కు డయల్ చేసి కానిస్టేబుల్ తనను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. దువ్వాడ పోలీసులు విచారణ జరిపి సీపీకి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా కానిస్టేబుల్‌ను సీపీ సోమవారం సస్పెండ్ చేశారు.

బాలికపై మేనమామ లైంగికదాడి

పీఎంపాలెం (భీమిలి): కన్నూ మిన్నూ కానని ఓ మానవమృగం అభంశుభం తెలియని తన సొంత మేనకోడలు (14)పైనే లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు జీవీఎంసీ 7వ వార్డు పరిధి వాంబే కాలనీలోని 14వ బ్లాకు జీఎఫ్‌5లో ఓ మహిళ కుటుంబంతో సహా నివసిస్తోంది. ఆమె కుమార్తె (14) స్థానిక హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నది. కొద్ది నెలలుగా రుతుక్రమం రాకపోవడంతో పాటు శరీరంలో మార్పులు చోటుచేసుకోవడంతో అనుమానం వచ్చిన మహిళ తన కుమార్తెను డిసెంబరు 28వ తేదీన ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా గర్భవతి అని నిర్ధారణ అయింది. అందుకు కారకుడు ఎవరని కుమార్తెను నిలదీయగా .. మేనమామ రామకృష్ణ అలియాస్ కిషోర్ (33) అని చెప్పడంతో నిర్ఘాంతపోయింది. అప్పటికే కిషోర్‌కు భార్య పిల్లలున్నారు. కాగా, బాలిక స్నానం చేస్తుండగా వీడియో తీసిన కిశోర్.. ఆ వీడియోను చూపించి తాను చెప్పినట్లు చేయకపోతే ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తానని బెదిరించి లొంగదీసుకున్నాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ రామకృష్ణ తెలిపారు.

పేట్రేగిన టీడీపీ-జనసేన మూకలు..

మంత్రి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి

గుంటూరులో అర్ధరాత్రి అరాచకం..

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి/సత్తెనపల్లి : టీడీపీ, జనసేన మూకలు గుంటూరులో విధ్వంసానికి తెరలేపాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని కొత్త కార్యాలయంపై ఆ మూకలు రాళ్ల దాడిచేశాయి. దీంతో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు చంద్రమౌళినగర్ మెయిన్‌రోడ్డులో మంత్రి రజిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. సోమవారం ఉదయం ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా, ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత టీడీపీ, జనసేన కార్యకర్తల ముసుగులో కొందరు గూండాలు పెద్ద సంఖ్యలో బైక్‌లపై ర్యాలీగా వచ్చారు. ముందుగా పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 12 గంటల తర్వాత కేక్ కటింగ్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా.. తెలుగు దేశం, జనసేన జిందాబాద్.. అంటూ నినాదాలు చేస్తూ మంత్రి కార్యాలయంపై రాళ్లు రువ్వారు. దీంతో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. కార్యాలయం మొత్తం టీడీపీ రౌడీమూకలు విసిరిన రాళ్లతో నిండిపోయింది. అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఆఫీసు సెక్యూరిటీ మాసారపు చిరంజీవి అడ్డుకోబోతే అతనిపైనా దాడిచేశారు. కార్యాలయం ప్రారంభానికి సంబంధించిన ఫ్లెక్సీలను టీడీపీ మూకలు చించివేశాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్తలు మేడా ప్రకాష్, సాధు రఘు, మద్దులూరి రామబ్రహ్మం, పుల్లా రేవంత్, కోనేటి సాయిమణికంఠ, పాములపాటి రాంబాబుతోపాటు మరో 24 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సుమారు వంద మంది పాల్గొన్నట్లు పట్టాభిపురం పోలీసులు నిర్ధారించారు. మిగిలిన వారిపైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.



టీడీపీ, జనసేన శ్రేణుల దాడిలో ధ్వంసమైన గుంటూరు చంద్రమౌళినగర్‌లోని మంత్రి విడదల రజిని కార్యాలయం అద్దాల ముక్కలు

పథకం ప్రకారమే దాడి..

ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఎందుకంటే.. మంత్రి రజినిని ఇటీవలే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో చంద్రమౌళినగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆమె ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, పశ్చిమ నియోజకవర్గం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆమెకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రత్యర్థులు దాడికి దిగినట్లు తెలిసింది. మరోవైపు.. జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కూడా రజినిపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సామాజికవర్గం ఎక్కువగా ఉండే ప్రాంతంలో పార్టీ కార్యాలయం ప్రారంభించడాన్ని సహించలేని తెలుగుదేశం నేతలు ఈ దాడిని ప్రేరేపించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

బీసీ మహిళపై టీడీపీ రౌడీయిజం : మంత్రి రజిని



దాడికి ఉపయోగించిన రాయిని చూపుతున్న మంత్రి విడదల రజిని

ఈ ఘటనపై మంత్రి రజిని స్పందిస్తూ.. తన పార్టీ కార్యాలయంపై దాడి టీడీపీ గూండాల అధికార దాహానికి పరాకాష్ట అని మండిపడ్డారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఒక బీసీ మహిళ పోటీచేయడాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. వారికి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని.. అందుకే ధ్వంస రచనకు తెరతీశారని ఆమె ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందన్నారు. వాహనాల ద్వారా బస్తాల్లో రాళ్లు తీసుకొచ్చి పార్టీ కార్యాలయంపై విసిరారని.. ఈ దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. మంత్రి కార్యాలయం పైనే టీడీపీ రౌడీమూకలు దాడులకు పాల్పడ్డాయంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణే ఉండదన్నారు. ఇలాంటి వారి చేతుల్లో అధికారం పెడితే.. రాష్ట్రం సర్వనాశనమవుతుందని మంత్రి చెప్పారు. భౌతిక దాడులతో నైతికంగా తమను దెబ్బతీయాలని చూస్తున్నారని.. తమ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయడం ఎవరి తరం కాదని రజిని హెచ్చరించారు. టీడీపీ దౌర్జన్యాలు, వారి ఆలోచనలు ఎలా ఉన్నాయో గుంటూరు ప్రజలు ఒకసారి ఆలోచించాలని కోరారు.



గుంటూరు చంద్రమౌళినగర్‌లోని మంత్రి విడదల రజిని కార్యాలయంపై దాడి చేసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు మద్దులూరి రామబ్రహ్మం, కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

దాడి దుర్మార్గం : ఎమ్మెల్యే మద్దాళి గిరి



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి బీసీ మహిళ పోటీచేయడాన్ని టీడీపీ గూండాలు సహించలేకపోతున్నారని స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరి తెలిపారు. బీసీలను అందలం ఎక్కిస్తామంటూ ఓ పక్క మాయమాటలు చెబుతూ మరోవైపు బీసీలపై ఇలా దాడులకు తెగబడటం టీడీపీకే చెల్లిందని ఆయన మండిపడ్డారు. ఇలాంటి దాడులు చేసిన వారికి ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

బలహీనవర్గాలపై టీడీపీ, జనసేన దాడులు : మంత్రి జోగి



ఈ ఘటనపై మంత్రి జోగి రమేష్ కూడా స్పందిస్తూ.. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల వారు సంఘ విద్రోహశక్తులుగా, గూండాలుగా మారి బలహీనవర్గాలపై దాడులకు తెగబడుతున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌లు తమ శ్రేణులను రెచ్చగొడుతూ.. ఇతర పార్టీలపై దాడులు చేయిస్తున్నారని.. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో స్థిర నివాసం కూడా లేని వీరు సీఎం జగన్‌పై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న వీరికి రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెబుతారన్నారు.

టీడీపీ, జనసేన కలిశాకే అరాచకాలు : మంత్రి అంబటి



ఇక టీడీపీ, జనసేన పార్టీల కలయిక ప్రజాప్రయోజనాల కోసం కాదని, అరాచకం సృష్టించేందుకేనని.. గుంటూరులో బీసీ మహిళ మంత్రి విడదల రజిని కార్యాలయంపై దాడి ఇందులో భాగమేనని మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి రజినీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటం టీడీపీ దాష్టీకమని, దీనిని చట్టం వదిలిపెట్టదని హెచ్చరించారు. టీడీపీ, జనసేన పార్టీలు కలిసిన తర్వాతే అరాచకాలు పెరిగాయన్నారు. చంద్రబాబునాయుడు నిరాశా నిస్పృహల్లో ఉన్నాడని, పవన్‌కల్యాణ్ ఒక అరాచక శక్తి అని ఆయన నిప్పులు చెరిగారు. 'ఎర్ర'బుక్కులో పేర్లు రాసుకుని అధికారంలోకి వస్తే అధికారుల తాటతీస్తానని లోకేశ్ హెచ్చరిస్తున్నాడని, టీడీపీ అధికారంలోకి రావడం కల్ల అని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కుప్పంను కనీసం మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్‌గా కూడా చేసుకోలేని చంద్రబాబుకి ఇప్పుడు ఎన్నికల ముందు అక్కడి ప్రజలు గుర్తుకొచ్చారని అంబటి విమర్శించారు. అంతకుముందు.. ఆయన రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ.. ఈ ఏడాదంతా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

యనమల సాక్షిగా.. తెలుగు తమ్ముళ్ల తన్నులాట!

తుని రూరల్: నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా జరుపుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన వేదికపై తెలుగు తమ్ముళ్లు ఒకరిపై మరొకరు పిడిగుద్దులు గుద్దుకుని బాహాబాహీకి దిగిన ఘటన సోమవారం కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు వద్ద చోటు చేసుకుంది. తుని నియోజకవర్గ స్థాయిలో 2024 నూతన సంవత్సర వేడుకలను టీడీపీ నాయకులు సాయి వేదికలో ఏర్పాటు చేశారు. వేదికపై యనమల రామకృష్ణుడు, యనమల కృష్ణుడు, యనమల దివ్య (రామకృష్ణుడి కుమార్తె) ఉండడంతో నాయకులు, కార్యకర్తలు వరుస క్రమంలో వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొంత సమయం తర్వాత దివ్య అక్కడి నుంచి వెళ్లిపోయారు. తొండంగి మండలం నుంచి అనుచరులతో తరలివచ్చిన యనమల రాజేష్.. రామకృష్ణుడిని కలుసుకుని శుభాకాంక్షలు చెప్పేందుకు క్యూలైన్ తప్పించుకుని వేదిక పైకి వెళుతుండగా.. వరుసగా రావాలంటూ కృష్ణుడి వర్గీయులు అడ్డుకున్నారు. దీనిపై ఆగ్రహం చెందిన రాజేష్ వర్గీయులు ఒక్కసారిగా చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రాజేష్, కృష్ణుడి వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. ఇరువర్గాల వారు పరస్పరం ఘర్షణ పడుతూ కొట్టుకున్నారు. పరిస్థితి విషమిస్తుండటంతో యనమల రామకృష్ణుడు, యనమల కృష్ణుడు ఇరు వర్గీయులను మందలించి, శాంతింపజేశారు.



తన్నుకుంటున్న రాజేష్, కృష్ణుడు వర్గీయులు

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: తిరుమలలో గతేడాది డిసెంబర్ 23వ తేదీన ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి పర్వదినాలు సోమవారం అర్ధ రాత్రితో ముగిశాయి. తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ఆదివారం అర్ధ రాత్రి వరకు 64,665 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.34 కోట్లు కానుకలుగా సమర్పించారు.

ఏఈఈ, టీఏ పోస్టుల భర్తీకి దరఖాస్తుల గడువు పెంపు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సివిల్, ఎలక్ట్రికల్ ఏఈఈలు, టెక్నికల్ అసిస్టెంట్స్ (సివిల్) పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పొడిగించారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పవర్ అండ్ ఎనర్జీ డివిజన్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) రిక్రూట్‌మెంట్ సర్వీసెస్ కన్వీనర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ యు.విద్యాసాగర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నూతన సంవత్సరంలో పెనువిషాదం

రెండు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

- మోటారు సైకిల్, బొలేరో వాహనం ఢీ
- పేలిన బైక్ పెట్రోల్ ట్యాంకు.. రెండు వాహనాలూ దగ్ధం
- ఒకరు సజీవ దహనం, మరో ఇద్దరు దుర్మరణం
- ప్రకాశం జిల్లాలో ఒంగోలు–నంద్యాల హైవేపై చెట్టిచర్ల వద్ద ఘటన
- ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో జరిగిన మరో ఘటనలో ఇద్దరు యువకులు మృతి

బేస్తవారిపేట/ఆగిరిపల్లి: నూతన సంవత్సరం వేళ ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు కుటుంబాల్లో పెను విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే... ప్రకాశంజిల్లా బేస్తవారిపేట మండలంలోని పాపాయిపల్లెకు చెందిన నల్లబోతుల పవన్‌కళ్యాణ్ (19), పిక్కిలి రాహుల్ (19), గుజ్జుల శ్రీనివాసులు (20) స్నేహితులు. వీరు సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై గిద్దలూరు వైపు వెళ్తున్నారు. అదే సమయంలో గిద్దలూరు నుంచి కంభం వైపు బొలేరో వాహనం (లగేజీ ట్రక్) వెళ్తోంది. బేస్తవారిపేట మండలంలోని చెట్టిచర్ల బస్టాండ్ సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై బొలేరో, మోటార్ సైకిల్ వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంక్ పేలి మంటలు వ్యాపించాయి. బైక్‌పై ప్రయాణిస్తున్న పవన్ కళ్యాణ్‌పై పెట్రోల్ పడటంతో అక్కడికక్కడే సజీవ దహనం అయ్యాడు. బైక్‌పై ఉన్న రాహుల్, శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మోటార్ సైకిల్, బొలేరో వాహనం రెండూ మంటల్లో దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతమంతా భయానకంగా మారింది. సమాచారం అందుకున్న బేస్తవారిపేట ఎస్సై బి.నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కంభం అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలను కంభం ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం కోసం తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పాపాయిపల్లె తీసుకెళ్లారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



ప్రకాశం జిల్లా చెట్టిచర్ల వద్ద ప్రమాదంలో మృతిచెందిన పిక్కిలి రాహుల్, గుజ్జుల శ్రీనివాసులు



మంటల్లో దగ్ధమైన పవన్ కళ్యాణ్ (ఫైల్)

ఏలూరు జిల్లాలో బైక్ నేలబావిలో పడి ఇద్దరు యువకులు మృతి

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లి గ్రామంలో బైక్ నేలబావిలో పడి ఇద్దరు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడిన ఘటన సోమవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే... విజయవాడకు చెందిన తలశిల కృష్ణ చైతన్య (24), నున్న గ్రామానికి చెందిన శెట్టి సాయికుమార్ (24), నున్న రాకేష్ (25), మరో ఇద్దరు స్నేహితులతో కలసి ఆదివారం కనసానపల్లిలోని రాకేష్ మామిడి తోటలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఉదయం కృష్ణచైతన్య, సాయికుమార్, రాకేష్ ఒకే బైక్‌పై తిరిగి ఇంటికి వెళుతుండగా, గేదె అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న నేలబావిలోకి దూసుకుపోయింది. వీరి వెనుకే మరో బైక్‌పై వస్తున్న ఇద్దరు స్నేహితులు గమనించి వెంటనే కనసానపల్లి సర్పంచ్ అమ్మిశెట్టి సంజీవరావు సాయంతో వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అప్పటికే నీటిలో మునిగిపోవడంతో కృష్ణ చైతన్య, సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. రాకేష్‌ను బయటకు తీసి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పంపించారు. ఈ ఘటనపై ఎస్ఐ చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







ప్రతి రోజునూ నీకు నువ్వు ఇలా చెప్పుకొని ప్రారంభించు: నేను ఇవ్వాళ జోక్యం, కృతఘ్నత, అహంకారం, అవిశ్వాసం, దురుద్దేశం, స్వార్థాలను కలవబోతున్నాను – దోషికి మంచి, చెడుల ఎరుక లేకపోవడమే దీనంతటికీ కారణం.

– మార్కస్ అరేలియస్

ఫోకస్

సాక్షి

మంగళవారం, 2 జనవరి 2024

సరికొత్త అధ్యాయం?!

మరో అడుగు ముందుకు పడింది. ఈశాన్య భారతంలో దీర్ఘకాలంగా సాగుతున్న సమస్యకు పరిష్కారం కనుక్కొనే ప్రయత్నంలో ఒక అభిలషణీయ పరిణామం గత వారం సంభవించింది. అస్సామ్‌లోని పేరుబడ్డ తీవ్రవాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సామ్' (అల్ఫా)లోని ఒక వర్గం హింసామార్గం విడిచిపెట్టి, ప్రజాస్వామ్య పంథాలోకి రానున్నట్టు డిసెంబర్ 29న ప్రకటించింది. అల్ఫా వర్గానికీ, కేంద్ర, అస్సామ్ సర్కార్లకూ మధ్య ఈ తాజా త్రైపాక్షిక పరిష్కార ఒప్పందం (ఎంఓఎస్) స్వాగతించాల్సిన విషయం. ఈశాన్యంలో శాంతి స్థాపన నిమిత్తం కుదుర్చుకుంటూ వచ్చిన ఒప్పందాల వరుసలో ఇది తాజాది. చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజనీ, దీంతో అస్సామ్‌లో హింసాకాండకు పూర్తిగా తెర పడుతుందనీ కేంద్ర హోమ్ మంత్రి అమితమైన ఆశాభావం ప్రకటించారు. అయితే, ఇప్పటి దాకా కుదుర్చుకున్న అనేక ఒప్పందాల ఫలితాలు మిశ్రమంగానే మిగిలాయి. అందుకే, ఈ కొత్త ఒప్పందం కూడా కేవలం మరో పత్రంగా మిగులుతుందా? లేక శాంతిసాధనలో చరిత్రాత్మకం కాగలుగుతుందా అన్నది పలువురి అనుమానం.

'సార్వభౌమాధికార' అస్సామ్‌ను కోరుతూ 1979లో 'అల్ఫా' సాయుధ పోరాటం ప్రారంభించింది. అలా 44 ఏళ్ళుగా రగులుతున్న కుంపటిని తాజా ఒప్పందం చల్లారుస్తుందని ఆశ. 1985లో అస్సామ్ ఒప్పందం తర్వాత కూడా అక్కడి గ్రామీణ ప్రజల్లో అసంతృప్తిని రగిలించడంలో అల్ఫా సఫలమైంది. కిడ్నాపింగ్‌లు, దోపిడీలు, హత్యలు, బాంబు పేలుళ్ళతో ఒక దశలో అల్ఫా అట్టుడికించింది. దాంతో, ప్రభుత్వం 1990లో అల్ఫాను నిషేధించింది. కర్కశమైన 'సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం' (ఏఎఫ్‌ఎస్‌పీఏ)ను తీసుకురావాల్సి వచ్చింది. 'అల్ఫా' ఉచ్ఛదశలో వెలిగిపోతున్న రోజుల్లో దాని చేతులు అస్సామ్ మొదలు దక్షిణాసియా దాకా విస్తరించాయి. మయన్మార్, భూటాన్‌లలో అల్ఫా శిబిరాలు, బంగ్లాదేశ్‌లో ఆ సంస్థ నేతలు, శ్రీలంక– పాకిస్తాన్‌లలో శిక్షకులున్న రోజులవి. అయితే, పరిస్థితులు మారాయి. శ్రీలంకలో ఎల్టీటీఈ పతనం, భూటాన్ గడ్డపై శిబిరాల్ని మూయించాల్సిందిగా ఆ దేశంపై ఒత్తిడి రావడం, అలాగే భారత్‌తో మైత్రి పాటించే షేక్ హసీనా ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక శక్తులను సహించక పోవడం, అల్ఫాలోని వర్గపోరు, భారత సర్కార్ ఉక్కుపాదం మోపడం... ఇవన్నీ కొన్నేళ్ళుగా అల్ఫాను బలహీనపరిచాయి.

వలస కార్మికులనూ, సామాన్య నిరుపేదలనూ లక్ష్యంగా చేసుకొని సాగించిన హింస సైతం రైతాంగంలో అల్ఫా పలుకుబడిని పలుచన చేసింది. నిజానికి, గతంలో పలు సందర్భాల్లో అల్ఫాతో శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఆ మాటకొస్తే శాంతిప్రక్రియ 2009లోనే మొదలైంది. చర్చల అనుకూల వర్గంతో 2011లోనే సంప్రతింపులు ఆరంభమయ్యాయి. సంస్థ బలహీనమయ్యేసరికి సార్వభౌమాధికార డిమాండ్‌ను అల్ఫా పక్కనబెట్టక తప్పలేదు. స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణ చాలనే విధంగా వ్యవహరించి, గౌరవప్రదంగా బయటపడేందుకు ప్రయత్నించింది. వెరసి, పుష్కర కాలం తర్వాత చర్చలు ఫలించాయి. పరిష్కార ఒప్పందం కుదిరింది. అయితే, అల్ఫా సంస్థాపకుల్లో ఒకరైన అప్పటి 'కమాండర్-ఇన్-ఛీఫ్' పరేశ్ బారువా శాంతి చర్చలను వ్యతిరేకిస్తూ 2012లోనే 'అల్ఫా ఇండిపెండెంట్' (అల్ఫా–ఐ)గా వేరుకుంపటి పెట్టుకున్నారు. అరబింద రాజ్‌ఖోవా సారథ్యంలోని వర్గమే తప్ప సైద్ధాంతికంగా కరడుగట్టిన ఈ 'అల్ఫా–ఐ' వర్గం ఒప్పందంలో భాగం కాలేదు.

అది ఒక లోటే. అలాగని, కుదిరిన ఒప్పందాన్ని తీసిపారేయలేం. వేర్పాటువాదం ప్రబలడంతో ఒకప్పుడు గణనీయంగా నష్టపోయిన రాష్ట్రం తాజా ఒప్పందంతో మళ్ళీ అభివృద్ధి పథంలో పయనించ గలుగుతుంది. కేంద్ర ఆర్థిక సహాయంతో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతమవుతాయి. ఈ ఒప్పందం పుణ్యమా అని ఈ ఈశాన్య రాష్ట్రంలో సాంఘిక – సాంస్కృతిక అశాంతికి కూడా తెరపడుతుందని మరో ఆశ. ఎందుకంటే, అక్రమ వలసల మొదలు స్థానిక తెగల వారికి భూ హక్కుల వరకు పలు అంశాల పరిష్కారం గురించి తాజా త్రైపాక్షిక ఒప్పందం ప్రస్తావిస్తోంది. ఆ ఆశ నెరవేరితే అంతకన్నా కావాల్సింది లేదు. నిజానికి, అస్సామ్‌లో చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలకై 'ఏఎఫ్‌ఎస్‌పీఏ' కింద సాయుధ బలగాలకు అపరిమితమైన అధికారాలను ప్రభుత్వం ఎన్నడో కట్టబెట్టింది. అల్ఫా దూకుడు మునుపటితో పోలిస్తే తగ్గడం, అలాగే అనేక విమర్శల అనంతరం గత రెండేళ్ళలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆ చట్టాన్ని ఉపసంహరించారు. ఇప్పుడిక మిగతా ప్రాంతాల్లో సైతం ఈ అమానవీయ చట్టాన్ని ఎత్తివేసే దిశగా అస్సామ్ సర్కార్ అడుగులు వేయాలి.

తాజా ఒప్పందంతో తీవ్రవాదానికి పూర్తిగా తెర పడిందని తొందరపడడానికి లేదు. అతివాద 'అల్ఫా–ఐ' వర్గం నేత బారువా ఇప్పటికీ చైనా–మయన్మార్ సరిహద్దులో గుర్తుతెలియని చోట దాగున్నారు. కొన్నేళ్ళుగా కొత్త చేరికలు లేక ఆయన వర్గం గణనీయంగా బలహీనపడినప్పటికీ, ఆ వర్గపు వ్యవహారం ఇంకా తేలనందున కేంద్ర, అస్సామ్ ప్రభుత్వాలు ఆచితూచి అడుగేయాల్సి ఉంది. కాకపోతే... ఒకపక్క రష్యా – ఉక్రెయిన్‌లు, మరోపక్క గాజాలో ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య యుద్ధాలతో రోజూ వార్తలను వేడెక్కించిన గడచిన 2023 ఎట్టకేలకు ఒక శాంతి ఒప్పందంతో ముగియడం ఒకింత ఊరట. ఒప్పందాన్ని సఫలం చేయడం ప్రభుత్వ, అల్ఫా వర్గాల ముందున్న సవాలు. అల్ఫా మాట అటుంచి, దీర్ఘకాల వేర్పాటువాదం అనంతరం ఈశాన్యంలో సుస్థిరంగా శాంతి వెల్లివిరియాలంటే ప్రభుత్వం ముందుగా అక్కడి ప్రతి పౌరుడూ జనజీవన స్రవంతిలో భాగమయ్యేలా చూడాలి. రైతాంగ జీవనప్రమాణాల్ని మెరుగుపరచాలి. వేర్పాటువాదం వైపు ఆకర్షితులు కాకుండా జాగ్రత్త పడాలి. అందుకే ఒప్పందం దోహదపడితేనే ఇన్నేళ్ళ సంప్రతింపుల శ్రమకు అర్థం, పరమార్థం!

సైన్సులో మన ఘన విజయాలు

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

చంద్రయాన్–3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య–ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటి. 'లిగో ఇండియా' ప్రాజెక్టుకు మన దేశం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా నిర్మాణం ప్రారంభమైంది. నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కూడా 2023లోనే శ్రీకారం పడింది. అయితే, సైన్స్ రంగంలో ఇచ్చే పలు అవార్డులను రద్దు చేయడం, జీవ పరిణామ క్రమాన్ని వివరించే పాఠాలను పుస్తకాల్లోంచి తొలగించడం ఆందోళన రేకెత్తించిన కొన్ని ప్రభుత్వ నిర్ణయాలు.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్‌లను జాబిల్లి పైకి మోసుకెళ్లిన అపోలో–11 లూనార్ మాడ్యూల్‌లో బ్లాక్ అండ్ వైట్ టీవీ కెమెరా ఉండేది. ఆ ఇద్దరు వ్యోమగాములు చందమామపై మొదటిసారి అడుగుపెట్టిన చారిత్రక ఘట్టపు లైవ్ ప్రసారం ఈ కెమెరా ద్వారానే జరిగింది. అప్పట్లో ఈ ప్రసారాన్ని 53 కోట్ల మంది వీక్షించారు. అంతరిక్ష పరిశోధనల్లో 1969 జూలై 20 నాటి ఈ ఘటన అత్యంత కీలకమైందనడంలో సందేహం లేదు. అలాగే టెలివిజన్ ప్రసారాల్లోనూ ఓ మైలురాయిగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత 2023 ఆగస్టు 23న కూడా దాదాపు ఇలాంటి చారిత్రక ఘటనే భారత్‌లోనూ నమోదైంది. చంద్రయాన్–3 జాబిల్లిపై అడుగుపెట్టిన ఘట్టాన్ని యూట్యూబ్‌లోనే 80.9 లక్షల మంది వీక్షించారు. యూట్యూబ్ లైవ్ స్ట్రీమ్‌కు సంబంధించి ఇదో రికార్డు.

చంద్రయాన్–3 విజయవంతం కావడం శాస్త్రరంగంలో భారత్ 2023లో సాధించిన అతిగొప్ప విజయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏళ్లపాటు శ్రమించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల విజయమిది. చంద్రయాన్ ప్రయోగం సక్సెస్ తరువాత కొంత కాలానికే భారతదేశపు ప్రతిష్ఠాత్మక ఆదిత్య–ఎల్1 ప్రయోగం కూడా విజయవంతంగా ముగియడం హైలైట్లలో మరొకటిగా చెప్పుకోవచ్చు. కొత్త సంవత్సరం తొలివారంలో ఈ అంతరిక్ష నౌక సూర్యుడిని పరిశీలించేందుకు అనువైన స్థానానికి చేరుకోనుంది. ఈ రెండు ప్రయోగాలు మాత్రమే కాకుండా 2023లో 'ఇస్రో' ఖాతాలో పలు కీలకమైన ప్రాజెక్టులను అమలు చేసిన ఖ్యాతి చేరింది. రీయూజబుల్ లాంచ్ వెహికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించడం, రెండోతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో తొలి ప్రయోగం, మానవ సహిత ప్రాజెక్టు 'గగన్‌యాన్'లో క్రూ ఎస్కేప్ మోడల్ పరీక్ష ఈ జాబితాలో కొన్ని మాత్రమే.

అంతరిక్ష ప్రయోగాలకు ఆవల...

దేశం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో అంతరిక్ష ప్రయోగాలకు ఆవల కూడా మన దేశం పలు విజయాలను నమోదు చేసింది. లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ (లిగో ఇండియా)కి ప్రభుత్వం అంగీకరించడం ఒక మేలి మలుపు. మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతంలో లిగో ఇండియా ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. ప్రపంచంలోనే అరుదైన గురుత్వ తరంగాల వేధశాలగా, అతి సున్నితమైన నాలుగు కిలోమీటర్ల పొడవైన ఇంటర్‌ఫెరోమీటర్ సారంగం ఉన్నదిగా ఇది రికార్డులకు ఎక్కింది. కృష్ణ బిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల వంటివి కలిసిపోయినప్పుడు పుట్టే గురుత్వ తరంగాలను గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అమెరికాలో ఇప్పటికే పని చేస్తున్న లిగో వేధశాలలతో కలిసి హింగోలి వేధశాల పనిచేస్తుంది.

నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కూడా 2023లోనే అడుగు పడింది. సూపర్ కండక్టింగ్, ఫొటోనిక్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతో మధ్యమ స్థాయి క్వాంటమ్ కంప్యూటర్లు తయారు చేయడం ఈ ప్రాజెక్టు



ఉద్దేశం. దీంతోపాటే కృత్రిమ మేధ ద్వారా దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను గుర్తించేందుకు కూడా జాతీయ స్థాయి కార్య క్రమం ఒకటి ఈ ఏడాది మొదలైంది. కృత్రిమ మేధను బాధ్యతాయుతమైన టెక్నాలజీగా అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

పరిశోధనల్లోనూ ఉన్నత స్థితిలో...

భారతదేశంలో ప్రచార ఆర్భాటాలకు చిక్కని, అత్యుత్తమ, అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు ఎన్నో నమోదయ్యాయి. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి హైదరాబాద్‌లోని లాకోన్స్‌లో ఒక పర్యావరణ వ్యవస్థలో జీవవైవిధ్యతను గుర్తించేందుకు అభివృద్ధి చేసిన పద్ధతి. సీసీఎంబీ అనుబంధ సంస్థ అయిన లాకోన్స్‌లో ఎస్. మను, జి.ఉమాపతి ఈ పరిశోధనకు నేతృత్వం వహించారు. నీరు, మట్టి, గాలుల్లోని డీఎన్ఏ పోగుల ఆధారంగా జీవవైవిధ్యతను కొలవడం ఈ పద్ధతి ప్రత్యేకత.

కర్నాల్(హరియాణా)లోని నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు దేశీ గిర్ జాతి ఆవును క్లోనింగ్ పద్ధతి ద్వారా సృష్టించడం 2023 విశేషాల్లో ఇంకోటి. బనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన జ్ఞానేశ్వర్ చౌబే నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం దక్షిణాసియా జన్యుక్రమాల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. సింహళీయులకు, శ్రీలంకలోని తమిళులకు మధ్య దగ్గరి జన్యు సంబంధాలు ఉన్నట్లు పరిశోధన పూర్వకంగా నిర్ధారించింది. ఆసక్తికరమైన ఇంకో విషయం ఏమిటంటే, ఈ రెండు వర్గాల ప్రజలకూ మరాఠా జనాభాకూ మధ్య సంబంధాలు ఉండటం! కోవిడ్ విషయానికి వస్తే, పుణె కేంద్రంగా పనిచేస్తున్న జెన్నోవా బయో ఫార్మాస్యూటికల్స్ దేశీయంగా తయారు చేసిన ఎంఆర్ఎన్ఏ టీకాను విడుదల చేసింది. ఒమిక్రాన్ వైరస్ నియంత్రణకు పనికొస్తుందీ టీకా.

విధాన నిర్ణయాలను పరిశీలిస్తే...

దేశం మొత్తమ్మీద శాస్త్ర పరిశోధనలకు అవసరమై నిధుల కేటాయింపును పర్యవేక్షించేందుకు 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' ఒకదాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. వివరాలు పూర్తిగా బహిరంగం కాలేదు. ఇదిలా ఉంటే దశాబ్దాలుగా పనిచేస్తున్న విజ్ఞాన్ ప్రసార్‌ను 2023లో మూసివేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఐఎస్‌సీఏ)కు నిధుల కేటాయింపులు తగ్గించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఏటా జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరుగుతాయి. సైన్స్ రంగంలో ఇచ్చే పలు అవార్డులను రద్దు చేయడం, జీవ పరిణామ క్రమాన్ని వివరించే పాఠాలను పుస్తకాల్లోంచి తొలగించడం ఆందోళన రేకెత్తించిన కొన్ని ప్రభుత్వ నిర్ణయాలు.

కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ తన మద్దతు ఉపసంహరించుకోవడంతో జనవరిలో సైన్స్ కాంగ్రెస్ జరిగే అవకాశాలు లేవు. డీఎస్‌టీ తమ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా వ్యవహరించిందని ఐఎస్‌సీఏ ఆరోపిస్తోంది. సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను లక్నోలో కాకుండా జలంధర్ సమీపంలోని పగ్వారాలో నిర్వహించాలన్న ఐఎస్‌సీఏ నిర్ణయం డీఎస్‌టీకి రుచించలేదు. 2023లో సైన్స్ కాంగ్రెస్‌ను నాగ్‌పూర్‌లో నిర్వహించారు. మరోవైపు పలు శాస్త్ర సంబంధిత విభాగాలు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ విజ్ఞాన్ భారతి ప్రాయోజకత్వం వహిస్తున్న వార్షిక్ సైన్స్ ఫెస్టివల్‌కు పెద్ద ఎత్తున ఆర్థిక సహకారం అందిస్తూండటం గమనార్హం.

దురదృష్టవశాత్తూ చాలా సంస్థలు రాజకీయ పెద్దల అడుగులకు మడుగులొత్తే స్థితికి చేరిపోయాయి. లక్నోలోని నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 108 రేకులున్న కమలాన్ని అభివృద్ధి చేసి దానికి 'నమో 108' అని నామకరణం చేసింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్ 'నమో 108'ను ఆవిష్కరిస్తూ 'మతపరంగా కమలానికి, 108 సంఖ్యకు ఉన్న ప్రాముఖ్యతలను దృష్టిలో ఉంచుకుంటే ఈ కొత్త రకం కమలం చాలా ప్రత్యేకమైన గుర్తింపుని ఇస్తుంది' అని వ్యాఖ్యానించారు. 'నిరంతర కృషీవలుడు నరేంద్ర మోదీ అంతః సౌందర్యానికి ఈ కమలం ఓ గొప్ప బహుమానం' అని కూడా అన్నారు.

ఇంకో సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థ నికోటిన్ మోతాదు తక్కువగా ఉన్న పొగాకు వంగడాన్ని అభివృద్ధి చేసింది. ఈ వంగడం అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి అని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎన్.కళైసెల్వి వ్యాఖ్యానించారు. ఇంకో పక్క ఎన్సీఈఆర్టీ చంద్రయాన్ ప్రయోగ కీర్తి ప్రధానికి దక్కుతుందని పొగడటం ప్రస్తావనార్హం.

ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ వంటి స్వతంత్ర సంస్థలు ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనూ నిశ్శబ్దంగా ఉండటం ఆశ్చర్య పరుస్తోంది. 2023లో భారతదేశం సాధించిన అతి గొప్ప విజయం చంద్రయాన్ అనుకుంటే... సైన్స్ సంస్థల రాజకీయాకరణ అత్యంత దురదృష్టకరమైనదిగా చెప్పాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రారంభ ప్రార్థన



ఎక్కుపెట్టిన ఆయుధాలు దించాలి. ద్వేషం నశించాలి. ఏ చిన్నారీ ఆకలితో నిద్రపోవద్దు. జ్ఞానాన్ని సంకెళ్లలో బంధించొద్దు. జైళ్లు ఖాళీగా ఉండాలి. చీకటి లోంచి న్యాయం, శాంతి, ఆశ, దయ, ప్రేమ దిశగా పయనించే తోవను ప్రపంచం ఈ కొత్త సంవత్సరం కనుక్కోవాలి.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

కొత్త ప్రపంచం



వాహనాన్ని ఢీకొట్టి పారిపోతే (హిట్ అండ్ రన్) పదేళ్ల జైలుశిక్ష, ఏడు లక్షల జరిమానా విధించే ఏర్పాటు కొత్త నేర న్యాయ చట్టంలో ఉండటం కమర్షియల్ డ్రైవర్లను భయపెడుతోంది. ఇలాగైతే ఎవరూ రిస్క్ తీసుకోరు. ఇంకోలా చూస్తే, కొన్నేళ్లలో డ్రైవర్‌లెస్ వాహనాలు ఈ ఖాళీని పూరించవచ్చు.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

అలాంటి రోజులు...

35 ఏళ్ల క్రితం, ఈ రోజున (1989 జనవరి 1) తన 'హల్లా బోల్' నాటక (గొంతు ఎత్తండి) ప్రదర్శన జరుగుతూ ఉండగా కమ్యూనిస్టు రచయిత, 34 ఏళ్ల సఫ్దర్ హష్మీ మీద కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు (హష్మీ తెల్లారి చనిపోయారు). నిందితుడు, కాంగ్రెస్ నేత హెచ్‌కెఎల్ భగత్ తొలి వరుసలో కూర్చున్నప్పుడు 'ఐఎఫ్ఎఫ్ఐ' (అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం) వేదిక మీద షబానా ఆజ్మీ తన నిరసన తెలియజేశారు. అప్పట్లో బాలీవుడ్‌కు వెన్నె ముక ఉండేది.

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

అంతా పాతే!



పోయినేడాది కొత్త సంవత్సరం కూడా అంతకు ముందు ఏడాదిలాగే ఉందని మీకు గుర్తుంటే, ఈ కొత్త సంవత్సరం కూడా పోయినేడాదిలాగే ఉంటుందని మీకు అర్థమవుతుంది. హేపీ ఓల్డ్ ఇయర్.

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

తొలి గర్వం



1804లో ఈ రోజున (జనవరి 1) ఫ్రాన్స్ నుంచి హైతీ స్వాతంత్ర్యాన్ని పొందింది. ప్రపంచంలో మొదటి ఆఫ్రికన్ రిపబ్లిక్‌గా అవతరించింది.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

ఆదర్శ విప్లవ చైతన్య మూర్తి

తాడిత పీడిత ప్రజల సంక్షేమం కోసం, సమాజ మార్పు కోసం వారిని చైతన్య పరచడానికి జీవితాంతం కృషిచేసిన ఆదర్శ విప్లవ చైతన్యమూర్తి, సామాజిక ఉద్యమ కారిణి సావిత్రీబాయి పూలే. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి భారతదేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా స్త్రీ విద్యను ప్రవేశపెట్టిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు. సావిత్రీ బాయి పూలే దక్షిణ మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని 'నయాగావ్' అనే ఓ చిన్న పల్లెటూరులో 1831 జనవరి 3న జన్మించారు. తొమ్మిదేళ్ల సావిత్రీబాయికీ, పదమూడేళ్ల జ్యోతిబా పూలేతో 1840లో వివాహం జరిగింది.



సావిత్రీబాయి పూలే


విద్యను అభ్యసించడానికి, తద్వారా నూతన జీవితాన్ని నిర్మించుకోవడానికి ప్రతి స్త్రీ పురుషులకు బాలలందరికీ హక్కు ఉన్నదనీ, ఆ హక్కు సహజమైనదనీ విశ్వసించిన తన భర్త జ్యోతిబాపూలేతో ఏకీభవించి ముందు భర్త దగ్గరే చదువుకొంది. ఆ తర్వాత ఆయనతో కలిసి స్త్రీవిద్యా వ్యాప్తి కోసం, ఇతర సాంఘిక సంస్కరణల కోసం తీవ్రంగా కృషి చేశారు. మొదటి బాలికా పాఠశాలను 1848 లో పూణేలో ఒక భవంతిలో ప్రారంభించారు ఈ దంపతులు. 1851 సెప్టెంబర్ 18న పూణేలోని రాస్తాపేటలో అమ్మాయిల కోసం మరొక పాఠశాలను ప్రారంభించారు. సావిత్రీబాయి పాఠాలు చెప్పేందుకు స్కూల్‌కి వెళుతున్న దారిలో సంప్రదాయవాదులు ఆమెపై పేడ, రాళ్లు విసరడం వంటి అవమానాలకు గురి చేయగా, 'ఇవి నాకు పూలతో సమానం, ఇలా ప్రోత్సాహం ఇస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంద'ని ప్రతిస్పందించారు. ఇలా అవమానాలు ఎదుర్కొంటున్న తరుణంలోనే పూలే దంపతులు ఇంటినుంచి బహిష్కృతులయ్యారు. అయినా తమ మార్గాన్ని వదులుకోలేదు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం, స్త్రీలకోసం ఆశ్రమాలను స్థాపించడం, విద్యాలయాలు స్థాపించడం మానలేదు. ఓ వితంతు కుమారుని దత్తత తీసుకొని పెంచుకొన్నారు.

1876–77లో మహారాష్ట్రలో అతి భయంకరమైన కరువు వచ్చినప్పుడు తమ 'సత్యశోధక్ సమాజ్' ద్వారా అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేసి అన్నార్తులను ఆదుకున్నారు. సావిత్రీబాయి సమకాలీన సమస్యలు, విద్య, సాంఘిక సంస్కరణ వంటివాటిపై ఆరు పుస్తకాలు రాశారు. వందలాది ఉపన్యాసాలు ఇచ్చారు. ప్లేగు వ్యాధి గ్రస్తులకు సేవ చేస్తూ అదే వ్యాధి సోకి 1897 మార్చి పదో తేదీన 66 ఏళ్ళ వయసులో తుది శ్వాస విడిచారామె. ఆమె సేవలు చిరస్మరణీయం.

– తండ సదానందం, ఉపాధ్యాయుడు

ప్రగతి పథంపై పచ్చ పడగ

అభిప్రాయం



గాజులపల్లి రామచంద్రారెడ్డి

గుడ్లగూబ వెలుగును చూడలేదు. రాక్షస మూకలు మంచిని మెచ్చుకోలేవు. అది వాటి నైజం. నేటి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపక్షాలు... ప్రత్యేకించి దుష్ట చతుష్టయంతో పాటు ఎల్లో జర్నలిజం కల్పిస్తున్న ఆటంకాలూ, అబద్ధాలూ చూస్తుంటే ఈ సంగతి మరింత స్పష్టమవుతోంది.

2020, 2021 సంవత్సరాలలో కరోనా మహ మ్మారి మూలాన ప్రపంచ ఆర్థిక పరిస్థితితో పాటు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితీ కుదేలయ్యింది. అంతేగాక చంద్రబాబు దిగిపోతూ ఖజానాను ఖాళీ చేశారు. అయినప్పటికీ జగన్ తన మేధాసంపత్తితో రాష్ట్ర ఆర్థిక నిర్వహణను అతి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ విజనరీని మెచ్చి పారిశ్రామిక వేత్తలు 13 లక్షల కోట్ల రూపాయలను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేదానికి ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. పరిశ్రమలకు లైసెన్సులను ఏకగవాక్షము ద్వారా అప్పటికప్పుడు మంజూరు చేస్తున్నందున పరి శ్రమలు స్థాపించేదానికి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు వరుస కడుతున్నాయి. అవుకు రెండో చానల్‌ను పూర్తి చేసి త్రాగునీరు, సాగునీటి ప్రాజెక్టును గత నవంబర్‌లో ప్రారంభించారు. పోలవరం పూర్తి చేసేదానికి పనులు చకచకా సాగుతున్నాయి.

4 అతి పెద్ద పోర్టుల నిర్మాణాలు పూర్తి అవుతున్నాయి. 10 షిప్పింగ్ హార్బర్లు, 17 కొత్త మెడికల్ కాలేజీలు, ప్రాణాంతక వ్యాధులైన కాన్సర్, కిడ్నీ వ్యాధులకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, చిన్న పిల్లల ఆసుపత్రులు నిర్మిస్తున్నారు. 10 వేలకు పైగా 'విలేజ్ క్లినిక్'లు, 10 వేల మెగా వాట్లతో కర్నూలులో గ్రీన్‌కో ప్రాజెక్టు, వెయ్యి మెగా వాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ పవర్ ప్రాజెక్టు, కాకినాడలో ఫార్మాసెజ్. జగన్ చేతుల మీదుగా ఉత్పత్తి ప్రారంభించాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 10,788 ఆర్బీకేలను నిర్మించారు. ఒక్కొక్క ఆర్బీకేకు సుమారు 21 లక్షల రూపాయలతో నిర్మాణాలు జరిగాయి. దీనితో రైతులు విత్తనం నుంచి విక్రయం వరకు ఈ ఆర్బీకేల ద్వారా చేసుకుంటు న్నారు. దీనివల్ల 70 లక్షల మంది రైతులకు లాభ సాటిగా ఉంది.

జగన్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో గణనీయ మైన అభివృద్ధి చెందుతూ ఉన్నదనీ, దానికి తార్కాణం భారీగా పెరిగిన 16 లక్షల ఉద్యోగాలనీ కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా శాఖ మంత్రివర్యులు గత డిసెంబర్ మాసంలో రాజ్యసభలో తెలిపారు. కొత్త ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ క్రింద జమ అయిన ఫండు ఈ



ఉద్యోగాల నియామకం నిజమేననడానికి నిదర్శన మన్నారు. అలాగే 32 లక్షల ఇళ్ళు మహిళల పేరుననే రిజిష్టర్ చేసి వారి సాధికారతకు కృషి జరుగుతోంది.

జగన్ ముఖ్యమంత్రియైన తర్వాత 2.14 లక్షల శాశ్వత ఉద్యోగాలు, 6.32 లక్షల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను ఇచ్చారు. ఇదంతా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల స్థాపనతో వీలయ్యింది. వైద్యరంగంలో దాదాపు 6000 వేల డాక్టర్లు, నర్సులను పారదర్శకంగా నియమించారు. మిగిలిన శాఖల్లోనూ ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. ఈ అన్ని చర్యల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. సకల జనుల ఆర్థికాభివృద్ధి పెరిగింది.

గత మూడేళ్ళలో ఆంధ్రప్రదేశ్ ప్రజల డిపాజిట్లు వివిధ బ్యాంకుల్లో రూ 87,877 కోట్లు పెరిగాయి. 2021 మార్చి 31 నాటికే డిపాజిట్లు 3,85,929 కోట్ల రూపాయలు కాగా, 2023 జూన్ 30వ తేదీ నాటికి బ్యాంకు డిపాజిట్లు 4,73,806 కోట్ల రూపాయలకు పెరిగాయని రిజర్వుబ్యాంక్ పేర్కొంది. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో గత మూడేళ్ళుగా మన జగనన్న ప్రభుత్వం ప్రథమ ర్యాంకులో ఉంది. 2019లో చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్‌ది తలసరి ఆదాయంలో 17వ ర్యాంకు కాగా, 2021–22లో అది 9వ ర్యాంకుకు చేరింది. 2019లో వ్యవసాయరంగంలో 27వ ర్యాంకులో ఉన్న ఏపీ, ఇప్పుడు 6వ ర్యాంకును సొంతం చేసుకొంది. 2019లో పారిశ్రామికాభివృద్ధిలో 22వ ర్యాంకులో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు 3వ ర్యాంకుకు చేరింది.

ఆంధ్రప్రదేశ్‌లో 1 కోటి 63 లక్షల కుటుంబాల వారు ఉన్నారు. వారిలో దాదాపు 85 శాతం కుటుంబాలకు 2.50 లక్షల కోట్ల రూపాయలు నేరుగా నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. 'అమ్మఒడి', 'విద్యా దీవెన' ద్వారా బ్రతుకుదెరువునూ, నైపుణ్యాలనూ మెరుగు పరచుకొంటున్నారు.

'వైఎస్సార్ ఆసరా', 'చేయూత' పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించారు. వారు తయారు చేస్తున్న ఉత్పత్తులకు హిందూస్థాన్ లీవర్స్, రిలయన్స్, మహీంద్ర వంటి పెద్ద కంపెనీలు మార్కెటింగ్ చేస్తున్నాయి. వీటన్నింటినీ పరిశీలిస్తే జగన్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో చంద్రబాబు కంటే ఎన్నోరెట్లు ముందుకు దూసుకుపోతోంది. అయినా పచ్చ మీడియా, పచ్చపార్టీ వక్రభాష్యాలు, అబద్ధపు కథనాలు చెప్తూ ప్రజలను వంచిస్తున్నాయి. ఈ పచ్చ మీడియా, పచ్చ పార్టీని చూస్తే తెలుగులో ఒక పద్యం గుర్తుకు వస్తుంది.

'తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరు త్రావవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు.'

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు

యశోధర తత్త్వం

జ్ఞానం పొందిన తర్వాత ఒక రోజు బుద్ధుడు తన ఇంటికి వెళ్లాడు. బుద్ధుడిని చూడగానే ఆయన భార్య యశోధర 'నన్ను విడిచిపెట్టి వెళ్ళారు. నేనేమీ అనుకోవడం లేదు. కానీ నాతో ఒక్క మాట చెప్పి వెళ్ళి ఉండొచ్చు కదా. నేను మిమ్మల్ని అడ్డుకునే దాన్ని కాదు. మీ ఇష్టం మీది. కానీ మీరు నన్ను నమ్మలేదు. అది తలచుకుంటుంటేనే నాకు బాధగా ఉంది. ఇంతకాలమూ ఆ తలంపే నన్ను ఇబ్బందిపెడుతోంది. నన్ను నమ్మక ఎందుకు గాయపరిచారో బోధ పడటం లేదని ఆమె వాపోయింది.



భార్య చెప్పిన మాటలన్నీ విన్న బుద్ధుడు తనను క్షమించమని అడిగి ఇలా అన్నాడు... 'నేను నీకోసం భయపడలేదు. నాకు నేనే భయపడ్డాను. భయమంతా నన్ను నేను చూసుకొనే! భార్య, కొడుకు ముఖాలు చూసి నేను నా నిర్ణయాన్ని మార్చుకుని ఇక్కడే ఉండిపోతానేమోనని భయపడ్డాను. ఏమీ చేయలేని స్థితికొస్తానేమోనని అనుకున్నాను' అన్నాడు బుద్ధుడు. అనంతరం ఆయన భార్య 'మీరు ఈ భవంతిని విడిచిపెట్టి వెళ్ళకుండా ఇక్కడే ఉండి ఉంటే మీరు జ్ఞానం పొంది ఉండే వారు కాదా?' అని ప్రశ్నించింది.

'ఇక్కడున్నా నాకు జ్ఞానోదయమయ్యేదే. కానీ ఇక్కడి నుంచి చడీచప్పుడు చేయకుండా పోతున్నప్పుడు అలా ఆలోచించలేదు. నిజానికి నేను ఎక్కడ ఉండి ఉన్నా జ్ఞానోదయం కలిగేదే. అందులో అనుమానం లేదు. చోటు అనేది ఒక ముఖ్యమైన అంశమే కాదు' అన్నాడు.

సిద్ధార్థుడు (బుద్ధుడు) ఇంటిని వదిలి వెళ్లిపోయిన తర్వాత యశోధర సర్వ సంపదలూ ఉన్నా సాధారణ జీవితమే గడిపేది. సాదాసీదా బట్టలు ధరించేది. ఒక్కగానొక్క బిడ్డ 'నాన్న ఎక్కడ' అని అడిగినప్పుడల్లా ఆమె ఆలోచనలో పడేది. తండ్రి లేడన్న విషయాన్ని పక్కన పెట్టి ఎంతో జాగ్రత్తగా పెంచుకుంటూ వచ్చింది. అన్నింటినీ విడిచిపెట్టి సాధువయ్యాడు బుద్ధుడు. కానీ యశోధర అన్ని భోగ భాగ్యాలు తన చుట్టూ ఊరిస్తున్నా ఓ సన్యాసిలా బతికింది. అందుకే యశోధర జీవితమే ఆదర్శవంతం అని కొందరంటారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.షష్ఠి ప.2.31 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.9.56 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** సా.5.56 నుండి 7.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.44 నుండి 9.32 వరకు తదుపరి రా.10.47 నుండి 11.35 వరకు, **అమృతఘడియలు:** తె.4.31 నుండి 6.18 వరకు (తెల్లవారితే బుధవారం); **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.33.

క్లుప్తంగా...

మోదీ పాలనలో ఏపీకి అన్యాయం

- ఎక్స్‌లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ అన్నారు. వివక్ష చూపే వారికి మద్దతు ఇవ్వవద్దని.. ఏపీ ప్రజలు నూతన సంవత్సరంలో తీర్మానం చేసుకోవాలని కోరారు. కొత్త ఏడాది తొలిరోజు సోమవారం ఎక్స్‌లో మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తొమ్మిదిన్నరేళ్ల మోదీ పాలనలో ఏపీపై పక్షపాత ధోరణి, మెట్రో రైలు ప్రాజెక్టులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో మెట్రో ప్రాజెక్టుల కోసం ఏపీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన తన ట్వీట్‌కు జత చేశారు. 'ఏపీ అభివృద్ధిని ప్రోత్సహించాలంటే 2024లో మోదీ భాగస్వామ్య అభ్యర్థులకు ఓటు వేయొద్దు. జగన్ పార్టీ, టీడీపీ, జనసేన అన్నీ మోదీతో జత కట్టాయి' అని పేర్కొన్నారు.

పెన్షన్‌లపై మాటమార్చిన సీఎం జగన్

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: అధికారంలోకి వస్తే రూ.3 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా పెంపు అంటూ సీఎం వైఎస్ జగన్ మాట మార్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తద్వారా ఒక్కొక్కరికీ రూ.30 వేలు ఎగనామం పెట్టారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పుడు పింఛనుదారులకు లేఖలు రాస్తూ అవే అబద్ధాలు చెబుతున్నారని, సీఎం జగన్ ఇప్పటివరకు పెంచింది రూ.750 మాత్రమేనని తెలిపారు. చంద్రబాబు హయాంలో పెన్షన్ ఎక్కడైనా తీసుకునే అవకాశముండేదని, ఇప్పుడు కేవలం 15 కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలని జీవోలు ఇచ్చారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో ఐదేళ్లలో రూ.7 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ 20 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చి, పెన్షన్ మొత్తాన్ని రూ.1,800 వరకు పెంచారని తెలిపారు. రూ.12 లక్షల కోట్లకు బడ్జెట్ ఖర్చు చేసిన సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లలో కొత్తగా 10 లక్షల పెన్షన్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. పెన్షన్లపై ముఖ్యమంత్రి జగన్ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆయన విమర్శించారు.

కరువుతీరా ఎరువులు



రబీ సీజన్‌కు 20.53 లక్షల టన్నుల ఎరువులు అవసరం

- ఇప్పటివరకు 9.65 లక్షల టన్నులు విక్రయం
- జనవరిలో మరో 4.71 లక్షల టన్నులు కేటాయింపు
- ప్రస్తుతం 8.96 లక్షల టన్నుల నిల్వలు
- ఎక్కడైనా ఎమ్మార్పీకి మించి అమ్మితే ఫిర్యాదు చేయండి

అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలిలా.. (టన్నుల్లో)

ఎరువు	జనవరి నెల డిమాండ్	అందుబాటులో ఉన్నవి	జనవరి నెలకు రావాల్సిన కేటాయింపులు
యూరియా	2,29,060	3,17,529	2,29,460
డీఏపీ	51,570	70,976	52,940
ఎంవోపీ	13,720	56,119	13,720
ఎస్ఎస్‌పీ	18,220	43,268	18,220
కాంప్లెక్స్	1,25,470	4,08,474	1,56,765
మొత్తం	4,38,040	8,96,366	4,71,105

సాక్షి, అమరావతి: రబీ సాగు ఊపందుకుంటోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల సీజన్ కాస్త ఆలశ్యంగా ప్రారంభం కాగా, మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో పలు జిల్లాల్లో నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నాయి. ముంపు నీరు దిగిన మరుక్షణం 80 శాతం సబ్సిడీపై విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో రైతులంతా మళ్లీ నారుమళ్లు పోసుకొంటున్నారు. ఇప్పటికే 40 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. సీజన్‌లో అవసరానికి సరిపడా ఎరువులను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచింది. సాధారణంగా ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో ఎరువుల వినియోగం ఎక్కువ. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా డిమాండ్‌కు మించి ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఆర్బీకేల ద్వారా పారదర్శకంగా పంపిణీ చేస్తోంది.

రబీలో 57.50 లక్షల ఎకరాలు సాగు లక్ష్యం కాగా, ఇప్పటికే 25 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ సీజన్‌కు 20.53 లక్షల టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ఖరీఫ్‌లో వినియోగించగా 6.59 లక్షల టన్నులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకు కేంద్రం కేటాయించిన 12.02 లక్షల టన్నులతో కలిపి రాష్ట్రంలో 18.61 లక్షల టన్నుల ఎరువులను జిల్లాలవారీగా డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం కేటాయించింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 9.65 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 8.96 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఈ సీజన్‌లో కేంద్రం రాష్ట్రానికి జరిపిన కేంటాయింపుల్లో భాగంగా ఈ నెలలో మరో 4.71 లక్షల టన్నులు రావాల్సి ఉంది. జనవరి నెలలో 4.38 లక్షల టన్నులు అవసరం కాగా డిసెంబర్ 31 నాటికి రాష్ట్రంలో 8.96 లక్షల టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయి. జనవరిలో వచ్చే ఎరువులను కలుపుకుంటే ఏకంగా 13.67 లక్షల టన్నులు అందుబాటులో ఉంటాయి.

ఇక ఆర్బీకేల్లో జనవరి నెల వినియోగం కోసం 1.69 లక్షల టన్నులు ఉంచగా, 94,676 టన్నులు అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం 74,373 టన్నుల ఎరువులు ఉన్నాయి. 2023-24 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఆర్బీకేల్లో 10 లక్షల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఖరీఫ్‌లో 5.60 లక్షల టన్నులు నిల్వ చేశారు. వాటిలో 2 లక్షల టన్నుల విక్రయాలు జరిగాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో 4 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటికే 1.90 లక్షల టన్నులు అందుబాటులో ఉంచారు. వీటిలో 1.18 లక్షల టన్నులు విక్రయించారు. డిమాండ్‌కు అనుగుణంగా జిల్లాలవారీగా ఆర్బీకేల్లో కేటాయింపులు పెంచుతున్నారు.


ఎరువుల కొరత లేదు..

రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఎరువుల నిల్వలు ఉన్నాయి. డిమాండ్‌కంటే రెండు రెట్లు ఎక్కువ నిల్వలు ఉండడం చరిత్రలో ఇదే తొలిసారి. ఆర్బీకేల్లో కూడా సమృద్ధిగా ఎరువులు ఉన్నాయి. రైతులెవ్వరూ ఎమ్మార్పీకి మించి చెల్లించొద్దు. విధిగా రసీదు తీసుకోండి. ఎక్కడైనా ఎరువులు అందుబాటులో లేకున్నా, ఎవరైనా ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్నా సమీప ఆర్బీకే లేదా స్థానిక వ్యవసాయాధికారికి సమాచారం ఇవ్వండి. లేదంటే టోల్ ఫ్రీ నెం. 155251కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

గొంతు తడవని బాల్యం

- ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మంది చిన్నారులకు తాగునీటి సమస్య
- దక్షిణాసియాలోనే అత్యధికంగా 35 కోట్ల మందిపై ప్రభావం
- తక్కువ వర్షపాతంతో ఎండిపోతున్న బావులు, నీటి కుంటలు, రిజర్వాయర్లు
- ఫలితంగా చిన్నారులపై పెరుగుతున్న 'హీట్ వేవ్ ఫ్రీక్వెన్సీ'
- వెల్లడించిన యునిసెఫ్ తాజా నివేదిక



సాక్షి, అమరావతి: ప్రపంచంలోని వంద కోట్ల మంది బాలలు తాగునీరు దొరక్క అల్లాడిపోతున్నారు. దక్షిణాసియాలో అత్యధికంగా చిన్నారులు తాగునీటి సమస్యతో పోరాడుతున్నట్టు ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. దాదాపు 18 ఏళ్లలోపు వయస్కుల్లో 35 కోట్ల మంది గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతున్నట్టు పేర్కొంది. ఫలితంగా ఆహార అభద్రత, పోషకాహార లోపం, డయేరియా వంటి ఇతర వ్యాధుల బారిన పడి బాల్యం చితికిపోతోందని తాజాగా యునిసెఫ్ నివేదిక వెల్లడించింది. నీటి లభ్యత కేవలం చిన్నారుల సంక్షేమంపైనే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఆర్థికాభివృద్ధికి కూడా ముప్పుగా పరిణమిస్తోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. తద్వారా వ్యవసాయ కుటుంబాల్లోని ఆర్థిక కష్టాలు పిల్లల చదువులపై ప్రభావం చూపుతోందని చెబుతున్నారు. ప్రపంచంలోని నాలుగింట ఒకవంతు కంటే ఎక్కువ మంది పిల్లలు దక్షిణాసియాలోనే ఉండగా.. పునరుత్పాదక నీటి వినియోగం కేవలం 4 శాతం మాత్రమే ఉంది.

వేడెక్కుతున్న వాతావరణం

వాతావరణ మార్పులు, భూగర్భ జలాలను అధికంగా వెలికితీస్తుండటంతో చిన్నారులు కరువు పీడిత ప్రాంతాల్లో దుర్భర జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా పాకిస్తాన్, భారత్, బంగ్లాదేశ్, నేపాల్‌లోని ఇండో గంగానది పరీవాహక ప్రాంతం ప్రపంచంలోనే అత్యధికంగా నీటి దోపిడీకి గురవుతోంది. ఇక్కడి భూగర్భ జలాల లవణీయత పెరిగిపోవడం, రిజర్వాయర్లు ఎండిపోవడంతో శీతోష్ణస్థితి విపరీతంగా వేడెక్కుతోంది. నేల నాణ్యత, వర్షపాతం కూడా భూగర్భ జలాల రీచార్జ్ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 2022 గణాంకాల ప్రకారం దక్షిణ ఆసియాలోనే 5 కోట్ల మందికిపైగా చిన్నారులకు ఇప్పటికీ ప్రాథమిక తాగునీటి సేవలు అందుబాటులో లేవు. ఇది మిగిలిన ప్రాంతాల్లో కంటే అధికం. దక్షిణాసియా తర్వాత తూర్పు, దక్షిణ ఆఫ్రికా, పశ్చిమ, మధ్య ఆఫ్రికాలో నీటి దుర్బలత్వం చాలా ఎక్కువ స్థాయిలో ఉంది. ఇదిలా ఉంటే 2030 నాటికి దక్షిణాసియాలో ప్రాథమిక తాగునీటి సేవల కవరేజీ వేగంగా పెంచేలా యునిసెఫ్ చర్యలు చేపడుతోంది.

ప్రపంచంలో సగం మంది

ప్రపంచవ్యాప్తంగా సగం మంది (వంద కోట్ల) చిన్నారులు తీవ్ర తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. 2022లోనే 73.90 కోట్ల మంది చిన్నారులు అత్యధికంగా తాగునీటి కొరతతో ఇబ్బంది పడ్డారు. 43.60 మంది చిన్నారులు అత్యంత దుర్భర నీటి సమస్య కలిగిన ప్రాంతాల్లో జీవనం వెళ్లదీస్తున్నారు. మరోవైపు చిల్డ్రన్స్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ (సీసీఆర్ఐ) ప్రకారం నీటి జాడ లేని ప్రాంతాల్లో 55.90 కోట్ల మంది హీట్‌వేవ్ ఫ్రీక్వెన్సీకి గురవుతున్నట్టు కనుగొన్నారు. ఇది 2050 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికిపైగా ప్రభావం చూపుతుందని అంచనా.


కొత్త ఏడాదిలో 3 రాజధానుల కల సాకారం

1,191వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: బహుజనులు సుదీర్ఘకాలంగా చేస్తున్న ఉద్యమం ఫలించి నూతన ఏడాదిలో మూడు రాజధానుల కల సాకారం చేసుకుంటామనే ఆశాభావాన్ని బహుజన పరిరక్షణ సమితి నాయకులు వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,191వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. కులవాదుల కుట్రలను ఛేదించేందుకు నాలుగు సంవత్సరాలుగా చేస్తున్న తమ పోరాటం సత్ఫలితాలు సాధిస్తుందన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బడబానల కొండలు!



సముద్ర గర్భంలో అగ్నిపర్వతాలు

అవున్నిజమే. అది కూడా ఒకటి కాదు, రెండు కాదు. ఏకంగా 8 అగ్ని పర్వతాలు! అంటార్కిటికా మహాసముద్రంలో 4 వేల మీటర్ల లోతున చాలాకాలంగా నిద్రాణంగా ఉన్నాయట. ఇవి ఒక్కోటీ సగటున కిలో మీటరు పై చిలుకు ఎత్తులో ఉన్నాయి. వీటిలో అతి పెద్ద అగ్నిపర్వత శ్రేణి 1.5 కిలోమీటర్ల ఎత్తుంది! టాస్మేనియా నుంచి అంటార్కిటికా మధ్య 20 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పరిశోధనలు చేపట్టిన సీఎస్ఐఆర్ఓ వోయేజ్ నౌకలోని పరిశోధక బృందం వీటి ఉనికిని తాజాగా గుర్తించింది. 3డి ఇమేజింగ్ ద్వారా ఈ పర్వతాలను అత్యంత స్పష్టంగా మ్యాపింగ్ కూడా చేసింది. సముద్ర గర్భంలో అగ్నిపర్వతాల ఉనికి ఇంత స్పష్టంగా చిక్కడం నిజంగా అద్భుతమని సీఎస్ఐఆర్ఓ జియో ఫిజిసిస్ట్ డాక్టర్ క్రిస్ యూల్ చెప్పారు. సముద్ర ప్రవాహాల వేగం అత్యంత ఎక్కువగా ఉండే ధ్రువ ప్రాంతంలో ఇవి ఉండటం ఆశ్చర్యమేనని ఆయనన్నారు. వీటిలో నాలుగు పర్వతాల ఉనికిని కొన్నేళ్లుగా అనుమానిస్తూనే ఉన్నారు. ఇప్పుడది ధ్రువపడటంతో పాటు వాటి పక్కనే మరో నాలుగు అగ్నిపర్వతాలు కూడా ఉన్నట్టు తేలింది. ఇవి మకారీ ద్వీపానికి దాదాపు 200 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నాయి. భూ అయస్కాంత శక్తి చాలని ఫలితంగా బహుశా 20 లక్షల ఏళ్ల కింద ఇవి ఏర్పడి ఉంటాయని భావిస్తున్నారు. సీఎస్ఐఆర్ఓ వోయేజ్ ప్రాజెక్టును అమెరికా, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థలు ఉమ్మడిగా తలపెట్టాయి. సముద్ర అంతర్భాగపు రహస్యాలను అన్వేషించడంతో పాటు వాటిని స్పష్టంగా మ్యాపింగ్ చేయడం దీని ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ''అంటార్కిటికా మహాసముద్రపు ధ్రువ ప్రవాహ గతి సముద్ర అడుగు భాగాన్ని ఢీకొనడం వల్ల ఏర్పడే భారీ సుడిగుండాలు వేడిమితో పాటు కర్బనాన్ని సముద్రంలో అన్నివైపులకూ చెదరగొడతాయి. అలా గ్లోబల్ వార్మింగ్ కట్టడిలో కీలకపాత్ర పోషిస్తాయి'' అని వోయేజ్ మిషన్ చీఫ్ కో సైంటిస్టు డాక్టర్ హెలెన్ ఫిలిప్స్ వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నింగిలోకి ఎక్స్‌పోశాట్



2024లో తొలి రోజే ఇస్రో ధమాకా ● పీఎస్ఎల్వీ 60వ ప్రయోగం దిగ్విజయం ● ఫ్యూయల్ సెల్ సహా 10 పరికరాలు భూ కక్ష్యలోకి

- భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో కీలకం
- శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు
- ఇది గగన్‌యాన్ ఏడాది: ఇస్రో చైర్మన్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నూతన సంవత్సరాన్ని దిగ్విజయంగా ఆరంభించింది. సోమవారం చేపట్టిన పీఎస్ఎల్వీ సీ58 60వ ప్రయోగం విజయవంతమైంది. పీఎస్ఎల్వీ రాకెట్ తొలుత కృష్ణబిలాల పరిశోధనకు ఉద్దేశించిన ఎక్స్‌రే పొలారిమీటర్ శాటిలైట్ (ఎక్స్‌పోశాట్)తో పాటు కేరళ యూనివర్సిటీకి చెందిన బుల్లి ఉపగ్రహం వియ్‌శాట్‌నూ రోదసిలోకి ప్రవేశపెట్టింది. అనంతరం చివరిదైన నాలుగో దశలో ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టం (ఎఫ్‌సీపీఎస్)తో పాటు మొత్తం పది పరికరాలను దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భారత్ నిర్మించబోయే సొంత అంతరిక్ష కేంద్రానికి ఇంధన లభ్యత కోణంలో ఎఫ్‌సీపీఎస్ ఎంతో కీలకం కానుంది. ప్రయోగం దిగ్విజయం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. 2024కు అద్భుత ఆరంభాన్నిచ్చినందుకు శాస్త్రవేత్తలకు అభినందనలన్నారు.

నిప్పులు చిమ్ముతూ...

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ58 ప్రయోగం జరిగింది. ఆదివారం మొదలైన 25 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే సోమవారం ఉదయం 9.10 గంటలకు ముగిసింది. ఆ వెంటనే 44.4 మీటర్లు పొడవున్న పీఎస్ఎల్వీ రాకెట్ 260 టన్నుల బరువుతో మంచు తెరలను చీల్చుకుంటూ, నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. మొత్తం ప్రయోగం నాలుగు దశల్లో 21.55 నిమిషాల్లో పూర్తయింది. ముందుగా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని భూమికి 650 కిలోమీటర్లు ఎత్తులోని సన్‌సింక్రనస్ ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అనంతరం కిలో బరువున్న వియ్‌శాట్‌ను కూడా కక్ష్యలోకి నిర్దేశిత సమయంలో ప్రవేశపెట్టారు. ఏడాది తొలి రోజే చేపట్టిన కీలక ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకున్నారు. ఇస్రో ప్రయోగాల పరంపరకు శ్రీకారం చుట్టి ఈ ఏడాదితో 60 ఏళ్లు పూర్తయ్యాయి. పీఎస్ఎల్వీ రాకెట్ సిరీస్‌లోనూ ఇది 60వ ప్రయోగం కావడం విశేషం! మొత్తమ్మీద షార్ నుంచి ఇది 92వ ప్రయోగం.

ఫ్యూయల్ సెల్ ప్రయోగం...

ఎక్స్‌పోశాట్, వియ్‌శాట్లను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ప్రయోగ చివరి దశలో పీఎస్ఎల్వీ వ్యోమ నౌకను రెండుసార్లు మండించి దాని ఎత్తును 650 కి.మీ. నుంచి 350 కి.మీకి తగ్గించారు. 10 కీలక పరికరాలను ఆ భూ దిగువ కక్ష్యలోకి విజయవతంగా చేర్చారు. ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టం (ఎఫ్‌సీపీఎస్)తో పాటు బెలిఫ్‌శాట్, గ్రీన్ ఇంపల్స్ ట్రాన్స్‌మిటర్ బెలాట్రిక్స్ వంటివి వీటిలో ఉన్నాయి. పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్-3 (పోయెం) ప్రయోగంలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టారు. 2023 ఏప్రిల్లో పీఎస్ఎల్వీ-సీ55 ప్రయోగం సందర్భంగా కూడా పోయెం-2 ద్వారా ఇలాంటి ప్రయోగాన్నే ఇస్రో చేపట్టింది.

- ఇస్రో నిర్మించనున్న భారత అంతరిక్ష కేంద్రానికి ఎఫ్‌సీపీఎస్ కీలకం కానుంది.
- రోదసిలో సుస్థిర శక్తి వనరును సమకూర్చుకోవడం దీని లక్ష్యం.
- ఇందులోని టెక్నాలజీ ఎలక్ట్రో కెమికల్ రియాక్షన్ సాయంతో రసాయన శక్తిని నేరుగా విద్యుచ్ఛక్తిగా మారుస్తుంది.
- తద్వారా మన అంతరిక్ష కేంద్రానికి కావాల్సిన ఇంధనాన్ని ఇది సుదీర్ఘ కాలం పాటు అందించగలదు.

ఎక్స్‌పోశాట్‌తో ఉపయోగాలివీ...

- ఉపగ్రహం బరువు 469 కిలోలు.
- ఇది ఐదేళ్ల పాటు సేవలందిస్తుంది.
- గతంలో ప్రయోగించిన ఆస్ట్రోశాట్‌తో కలిసి ఖగోళ పరిశోధన చేపట్టనుంది.
- ఇవి రెండూ విశ్వాంతరాల్లో పరిణామాలపై, ముఖ్యంగా కృష్ణ బిలాలపై పరిశోధనలు చేస్తాయి.
- ఎక్స్‌పోశాట్‌లోని ప్రాథమిక పేలోడ్ పోలిక్స్ (ఎక్స్-పోలారిమీటర్ పరికరం)ను 8.3 కిలోవాట్ల ఫోటాన్ల మధ్య వ్యవస్థ ఎక్స్‌రే శక్తి శ్రేణిలో ధ్రువణ పరామితులను, ప్రత్యేకంగా వాటి డిగ్రీ, ధ్రువణ కోణాలను కొలిచేందుకు రూపొందించారు. రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఆర్ఐ) బెంగళూరు ఇస్రో కేంద్రం దీన్ని రూపొందించింది.
- ఇందులోని మరో పేలోడ్ ఎక్స్‌పెక్ట్ (ఎక్స్ రే స్పెక్ట్రోస్కోపీ, టైమింగ్) 0.8–15 కిలోవాట్స్ శక్తి పరిధిలో స్పెక్ట్రోస్కోపిక్ సమాచారాన్ని అందిస్తుంది. దీన్ని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్ రూపొందించింది.
- ఈ రెండు పేలోడ్లు విశ్వాంతరాల్లో కృష్ణ బిలాలపై లోతుగా అధ్యయనం చేసి విలువైన సమాచారం అందిస్తాయి.
- ఇక కేరళ వర్సిటీ విద్యార్థినులు తయారు చేసిన వియ్‌శాట్ కేజీ బరువున్న సూక్ష్మ ఉపగ్రహం.
- కేరళలో మారిన వాతావరణ పరిస్థితుల అధ్యయనం దీని ముఖ్యోద్దేశం.

ఈ ఏడాది 12 ప్రయోగాలు: సోమనాథ్



ప్రయోగానంతరం ఇస్రో శాస్త్రవేత్తలతో సోమనాథ్

ఈ ఏడాది 12 ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. ''2024ను గగన్‌యాన్ ఏడాదిగా నిర్దేశించుకున్నాం. ఆ ప్రాజెక్టులో భాగంగా ఈ ఏడాది నాలుగు మానవరహిత ప్రయోగాలు చేయనున్నాం. అనంతరం 2025లో మానవసహిత ప్రయోగం ఉంటుంది. నాసాతో సంయుక్తంగా రూపొందించిన ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని త్వరలో ప్రయోగిస్తాం. ఈ నెల 26న, లేదా ఫిబ్రవరి తొలి వారంలో నావిక్-02 ఉపగ్రహ ప్రయోగం ఉటుంది'' అని ఆయన వివరించారు.

మసూద్ అజార్ హతం?

సోషల్ మీడియాలో పోస్టులు వైరల్



ఇస్లామాబాద్: కాందహార్ విమానం హైజాక్ సూత్రధారి మసూద్ అజార్ బాంబు పేలుడులో హతయ్యాడంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్‌గా మారాయి. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో పాకిస్తాన్‌లోని భావల్పూర్ మసీదు నుంచి వస్తుండగా బాంబు పేలిన ఘటనలో అతడు హతమైనట్లు ధ్రువీకరించని ట్వీట్ల ద్వారా తెలుస్తోంది. పేలుడుకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అనంతరం పాక్ ఆర్మీ దావూద్ ఇబ్రహీం సహా పలువురు ఉగ్రవాదులపై దాడులు చేపట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తోంది. భారత్‌లో మోస్ట్ వాంటెడ్‌గా ఉండి పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం తదితర రెండు డజన్ల మంది వరకు ఉగ్రవాదులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. 2001 పార్లమెంట్‌పై దాడి ఘటనకు సంబంధించిన కేసుల్లో అజార్‌ను భారత్ వాంటెడ్‌గా ప్రకటించింది. 2008లో నేపాల్ నుంచి భారత్‌కు బయలుదేరిన ఇండియన్‌ఎయిర్ లైన్స్ విమానాన్ని ఉగ్రవాదులు హైజాక్ చేసి, అఫ్గానిస్తాన్‌లోని కాందహార్‌కు తీసుకెళ్లారు. హైజాకర్ల డిమాండ్ మేరకు జైళ్లలో ఉన్న అజార్ సహా ముగ్గురు కరడుగట్టిన ఉగ్రవాదులను భారత్ ప్రభుత్వం విడిచిపెట్టింది. విమాన ప్రయాణికుల్లో ఒకరిని పొడిచి చంపిన ఉగ్రవాదులు, మరికొందరిని గాయపరిచారు. వారంపాటు కొనసాగిన తీవ్ర ఉత్కంఠ అనంతరం అందులోని 176 మందిని ఉగ్రవాదులు సురక్షితంగా విడిచిపెట్టారు.

గోల్డీని ఉగ్రవాదిగా ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ: కెనడాకు చెందిన గ్యాంగ్‌స్టర్ సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్‌ను కేంద్రం ఉగ్రవాదిగా ప్రకటించింది. ఉగ్రవాద వ్యతిరేక ఉపా చట్టం కింద అతడిని ఉగ్రవాది ప్రకటిస్తున్నట్లు హోం శాఖ సోమవారం తెలిపింది. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ఇతడు మాస్టర్ మైండ్‌గా ఉన్నాడు. పాకిస్తాన్ దన్నుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఇతడికి పలు హత్య కేసులతో సంబంధం ఉందని హోం శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. పంజాబ్‌లోని శ్రీముక్త్‌సర్ సాహిబ్‌కు చెందిన బ్రార్ ప్రస్తుతం కెనడాలోని బ్రాంప్టన్‌లో ఉంటున్నాడు. ఇతడిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది.

బంగ్లాదేశ్ నోబెల్ గ్రహీతకు 6 నెలల జైలు



ఢాకా: బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ మహ్మద్ యూనస్(83)కు కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. మరో ముగ్గురితో కలిసి ఆయన స్థాపించిన గ్రామీణ్ టెలికం సంస్థలో కార్మికుల సంక్షేమ నిధిని నెలకొల్పడంలో విఫలమైనట్లు మూడో కార్మిక న్యాయస్థానం జడ్జి షేక్ మరీనా సుల్తానా సోమవారం యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాదు, తలా రూ.19 వేల జరిమానా విధించారు. అనంతరం వారు పెట్టుకున్న పిటిషన్ల మేరకు నలుగురికీ బెయిల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పును వీరు హైకోర్టులో సవాల్ చేసుకునే వీలుంటుంది. ఈ నెల 7న బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

పదేళ్ల ప్రగతిపై మీరేమంటారు?

ప్రజాభిప్రాయం కోరిన ప్రధాని మోదీ


న్యూఢిల్లీ: దేశం గత పదేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో సాధించిన అభివృద్ధిపై ప్రజలు అభిప్రాయాలను వెల్లడించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రధాని మోదీ డిసెంబర్‌లో నమో యాప్‌లో 'జన్ మన్ సర్వే' ప్రారంభించారు. ప్రభుత్వంతోపాటు, ఎంపీల పనితీరు సహా వివిధ అంశాలను గురించి తాము ఏమనుకుంటున్నదీ నేరుగా తనకు తెలపాలని అందులో కోరారు. సర్వేలో ఎలా పాల్గొనాల్సిందీ తెలిపే లింక్‌ను కూడా ఆయన సోమవారం 'ఎక్స్'లో షేర్ చేశారు. పరిపాలన, నాయకత్వానికి సంబంధించిన వేర్వేరు అంశాలతోపాటు కేంద్ర స్థాయి అభివృద్ధి, కొన్ని ప్రత్యేక నియోజక వర్గాల గురించి కూడా అందులో ప్రశ్నలు న్నాయి.

మూడు క్రిమినల్ చట్టాలపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన మూడు క్రిమినల్ చట్టాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ చట్టాల్లో ఎన్నో లోపాలున్నాయని న్యాయవాది విశాల్ తివారీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మూడు చట్టాలపై పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ జరగలేదని చెప్పారు. వాటిని ప్రవేశపెట్టిన సమయంలో చాలా మంది ప్రతిపక్ష సభ్యులు సభలో లేరని తెలిపారు. మూడు క్రిమినల్ చట్టాలపై కూలంకషంగా అధ్యయనం చేసేందుకు నిపుణులతో కూడిన కమిటీ వేసేలా ప్రభుత్వానికి మార్గదర్శకాలివ్వాలన్నారు. చట్టాలు అమలు కాకుండా అడ్డుకోవాలని కోరారు. నూతన చట్టాలు అమలైతే పోలీసులకు మరిన్ని తిరుగులేని అధికారాలు సంక్రమించడంతోపాటు ప్రజల హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులకు డిసెంబర్ 21వ తేదీన లోక్‌సభ ఆమోదం తెలపడం, అదే నెల 25న వాటిపై రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర వేయడం తెలిసిందే.

సూర్య నమస్కారాలతో గిన్నిస్ రికార్డు

అహ్మదాబాద్: వేలాదిగా ఏకకాలంలో సూర్య నమస్కారాలు చేయడం ద్వారా గుజరాత్ వాసులు ప్రపంచ రికార్డు నెల కొల్పారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 108 ప్రాంతాల్లో చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమంలో 50 వేల మందికి పైగా పాలుపంచుకున్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.



తీర్పులు న్యాయమూర్తుల వ్యక్తిగతం కాదు

రాజ్యాంగం, చట్టం ప్రకారమే కేసులపై తీర్పులిస్తారు ● సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల వెలువరించిన ఏకగ్రీవ తీర్పు పట్ల వ్యక్తమవుతున్న విమర్శలపై స్పందించడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నిరాకరించారు. రాజ్యాంగం, చట్టం ప్రకారమే న్యాయమూర్తులు కేసులపై తీర్పులిస్తారని చెప్పారు. ఏదైనా కేసుపై చట్టానికి లోబడే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. సోమవారం పీటీఐ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో జస్టిస్ చంద్రచూడ్ పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేమంటూ ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై మాట్లాడారు. ఏ న్యాయమూర్తి కూడా వారి వ్యక్తిగత అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని తీర్పులు ఇవ్వరని స్పష్టం చేశారు. ఈ కేసులో ఇచ్చిన తీర్పు కూడా జడ్జిల వ్యక్తిగతం కాదని అన్నారు. చాలా రకాల కేసుల విచారణ, తీర్పుల్లో తాను కూడా భాగస్వామిగా ఉన్నానని గుర్తుచేశారు. ఒక జడ్జిగా ఏ కేసును, తీర్పునూ వ్యక్తిగతంగా తీసుకోలేదని చెప్పారు. అందుకు తనకు ఎలాంటి విచారం గానీ, ఫిర్యాదు గానీ లేదన్నారు. న్యాయమూర్తులు తీర్పు వెలువరించిన తర్వాత అది ప్రజల ఆస్తిగా మారుతుందని స్పష్టం చేశారు. దానిపై అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకుంటుందని పేర్కొన్నారు. తీర్పుపై విమర్శలను తిప్పికొట్టడం, సమర్థించుకోవడం సరికాదన్నారు. తీర్పు ఇచ్చిన తర్వాత ఇక ఆ సంగతి పక్కన పెట్టాలన్నది తన ఉద్దేశమని వివరించారు.

తీర్పుపై ఏ జడ్జికీ ఆధిక్యముండదు

అయోధ్యలో వివాదాస్పద స్థలంలో రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు దేళ్ల క్రితం ఇచ్చిన తీర్పుపై జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. అప్పటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. ఈ తీర్పు రావడానికి కారణాన్ని ధర్మాసనంలోని ఏ ఒక్క సభ్యుడికో అపాదించలేమని పేర్కొన్నారు. ధర్మాసనంలోని సభ్యులంతా ఏకగ్రీవంగా అయోధ్య తీర్పు ఇచ్చారని వెల్లడించారు. ఏ కేసులో అయినా ఇవ్వాల్సిన తీర్పును సంబంధిత జడ్జిలంతా కలిసి కూర్చొని, చర్చించుకొని నిర్ణయిస్తారని పేర్కొన్నారు. చివరకు అది కోర్టు తీర్పుగా మారుతుందని స్పష్టం చేశారు. తీర్పును నిర్ణయించే విషయంలో ఆధిక్యం ఏ ఒక్క జడ్జికో కట్టబెట్టలేమని తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం కోసం పేర్లను ప్రతిపాదించే కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదు అని విమర్శించడం సరైంది కాదని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొలీజియంలో అంతర్గతంగా జరిగే సంప్రదింపులను కొన్న కారణాలతో ప్రజలకు తెలియపర్చలేమని సీజేఐ స్పష్టం చేశారు.

జపాన్‌లో సునామీ హెచ్చరికలు

- జపాన్ వాయవ్య తీరంలో తీవ్ర భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదు, వేలాది ఇళ్లు ధ్వంసం
- ఇషిగావా, నిగాటా, టొమయాలో 21 ప్రకంపనలు
- ఉభయ కొరియా, రష్యాలోనూ సునామీ హెచ్చరికలు



జపాన్‌లో భూకంప తీవ్రతకు పగుళ్లిచ్చిన రోడ్లను చూస్తున్న జనం

టోక్యో: ద్వీప దేశమైన జపాన్‌లో నూతన సంవత్సరం తొలిరోజే శక్తివంతమైన భూకంపం సంభవించింది. వాయవ్య జపాన్ తీరంలో సోమవారం సాయంత్రం 4 గంటల తరువాత పలుమార్లు భూప్రకంపనలు నమోదయ్యాయి. కనీసం 21 సార్లు భూమి కంపించినట్లు స్థానిక మీడియా తెలియజేసింది. ఇషిగావా రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాల్లో వరుసగా భూప్రకంపనలు సంభవించాయి. తొలుత సాయంత్రం 4.06 గంటల ప్రాంతంలో మొదలైన ప్రకంపనలు 4.32 గంటల వరకు కొనసాగాయి. ఈ భూకంప తీవ్రత సాయంత్రం 4.10 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైనట్లు జపాన్ వాతావరణ సంస్థ ప్రకటించింది. భూకంపం దాటికి సముద్రంలో ఐదు అడుగుల మేర అలలు ఎగిసిపడ్డాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. పశ్చిమ కోస్తా తీరంలోని ఇషిగావా, నిగాటా, టొమయా జిల్లాలకు జపాన్ వాతావరణ సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఇషిగావాకు మేజర్ సునామీ హెచ్చరిక, మిగిలిన పశ్చిమ తీర ప్రాంతానికి తక్కువ తీవ్రత కలిగిన సునామీ హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని గంటల తర్వాత సముద్రంలో అలల తీవ్రత తగ్గుముఖం పట్టడంతో సాధారణ సునామీ హెచ్చరికలను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. తీర ప్రాంతాల్లోని జనం తక్షణమే సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని సూచించింది. నిగాటా, టొమయాలో 3 మీటర్ల మేర అలలు ఎగిసిపడుతున్నాయి. ఫోన్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని సమీక్షిస్తున్నామని ప్రధాని కిషిడా చెప్పారు.

శిథిలాల కింద బాధితులు!

ఇషిగావా జిల్లాతోపాటు సమీప ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయని వాతావరణ సంస్థ ప్రకటించింది. ఇషిగావాలోని నోటో ప్రాంతం నుంచి 300 కిలోమీటర్ల మేర సునామీ అలలు విస్తరించే అవకాశం ఉందని స్థానిక వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. భూకంపం వల్ల ఇళ్లు కంపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. భూప్రకంపనలతో భయాందోళనకు గురైన జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు కుర్చీలు, టేబుళ్ల కింద దాక్కున్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు నేలకూలాయి. మరికొన్ని ఇళ్లకు పగుళ్లు కనిపించాయి. ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. రాజధాని టోక్యోతోపాటు కాంటో ఏరియాలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. అధికారులతో పాటు సైన్యమూ సహాయక చర్యల్లో నిమగ్నమైంది. ఉభయ కొరియాలతో పాటు రష్యాలోనూ సునామీ హెచ్చరికలు జారీ చేశాయి. టోక్యోలోని భారత రాయబార కార్యాలయం బాధితులకు సమాచారం, సహాయం అందించేందుకు ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

మణిపూర్‌లో కాల్పులు.. ముగ్గురు మృతి

ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తౌబల్ జిల్లా లిలాంగ్ చింగ్‌జావో ప్రాంతంలో సోమవారం సాయంత్రం పోలీసు దుస్తుల్లో వచ్చిన దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాంతో తౌబల్‌తోపాటు ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. దాంతో ఆగ్రహించిన ఒక వర్గం వారు నాలుగు కార్లకు నిప్పుపెట్టారు. కార్లు ఎవరివనే విషయం తెలియాల్సి ఉంది. కాల్పుల ఘటనను సీఎం బీరేన్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. దోషులను పట్టుకుని, చట్టం ముందు నిలబెడతామని ఆయన స్పష్టం చేశారు. మణిపూర్‌లో గత ఏడాది మే 3వ తేదీన ట్రైబల్ సాలిడారిటీ మార్చ్ అనంతరం కొనసాగుతున్న జాతుల మధ్య వైరంతో 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మొయితీలున్నారు. కొండ ప్రాంత జిల్లాల్లో నివసించే నాగాలు, కుకీలు కలిపి 40 శాతం వరకు ఉంటారు.

దక్షిణ ధ్రువంలో పోలార్ ప్రీత్ విజయ యాత్ర

ఒంటరిగా అత్యంగా వేగంగా చేరుకున్న మహిళగా రికార్డు



లండన్: అంటార్కిటికా అన్వేషణలతో పోలార్ ప్రీత్‌గా పేరు తెచ్చుకున్న బ్రిటిష్ సిక్కు ఆర్మీ అధికారి, ఫిజియోథెరపిస్ట్ కెప్టెన్ హర్‌ప్రీత్ చాంది(33) మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. దక్షిణ ధ్రువంపై ఒంటరిగా వేగవంతంగా అన్వేషణ పూర్తి చేసుకున్న మహిళగా తాజాగా చరిత్ర సృష్టించారు. రోన్నె ఐస్ షెల్ఫ్ నుంచి నవంబర్ 26న ప్రారంభించిన యాత్ర దక్షిణ ధ్రువానికి చేరుకోవడంతో గురువారంతో ముగిసినట్లు ఆమె స్వయంగా ప్రకటించారు. రోజుకు 12 ,13 గంటల చొప్పున ముందుకు సాగుతూ మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద మొత్తం 1,130 కిలోమీటర్ల దూరాన్ని ఎవరి సాయం లేకుండానే 31 రోజుల 13 గంటల 19 నిమిషాల్లో పూర్తి చేశానన్నారు. ఈ ఫీట్‌ను గురించి గిన్నిస్ వరల్డ్ బుక్ నిర్వాహకులకు వివరాలందించానని, ధ్రువీకరణ కోసం వేచి చూస్తున్నానని చెప్పారు. అంటార్కిటికా అన్వేషణలకు సంబంధించి కెప్టెన్ హర్‌ప్రీత్ చాంది పేరిట ఇప్పటికే రెండు వేర్వేరు రికార్డులు నమోదై ఉన్నాయి.

రామాలయం అక్షతల పంపిణీ ప్రారంభం



అయోధ్య: అయోధ్యలోని భవ్య రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈనెల 22వ తేదీన మధ్యాహ్నం 12.20 గంటలకు జరిగే విగ్రహ ప్రతిష్టకు గాను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి అక్షతల పంపిణీని ప్రారంభించినట్లు ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. బియ్యంతో పసుపు, నెయ్యి కలగలిపిన పవిత్ర అక్షతల పంపిణీ కార్యక్రమం మకర సంక్రాంతి వరకు, ఈ నెల 15 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజలకు పంపిణీ చేసే అక్షతల ప్యాకెట్‌పై రామాలయం చిత్రంతోపాటు ఆలయ నిర్మాణం గురించిన వివరాలతో కూడిన కరపత్రం ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 5 లక్షల ఆలయాల పరిధిలోని 5 కోట్ల కుటుంబాల ప్రజలకు అక్షతలు అందుతాయని చెప్పారు.

వేగంగా వ్యాపిస్తున్న జేఎన్.1 వేరియంట్



న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్-19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు ఇప్పటి వరకు 197 గుర్తించినట్లు ప్రభుత్వ విభాగం ఇన్సాకాగ్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ కేసులు బయపడిన 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జాబితాలో తాజాగా ఒడిశా చేరినట్లు పేర్కొంది. ఇందులో కేరళలో 83, గోవాలో 51, గుజరాత్‌లో 34, కర్ణాటక, మహారాష్ట్రల్లో 8 చొప్పున, రాజస్తాన్‌లో 5, తమిళనాడులో 4, తెలంగాణలో 2, ఒడిశాలో 1 కేసు ఉన్నట్లు వివరించింది. ఈ సబ్ వేరియంట్‌కు చెందిన కేసులు డిసెంబర్‌లో 180, నవంబర్‌లో 17 కేసులు బయటపడ్డాయని వెల్లడించింది. జేఎన్.1 సబ్ వేరియంట్ కేసులు వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ వీటితో ప్రమాదం తక్కువని వివరించింది. ఇలా ఉండగా, దేశంలో కొత్తగా 636 కోవిడ్ కేసులు బయటపడ్డాయని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం 4,394 యాక్టివ్ కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించింది.



జిల్లా జడ్జికి శుభాకాంక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికకు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సోమవారం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



భక్తులతో విజయకీలాద్రి కిటకిట

తాడేపల్లి రూరల్: సీతానగరంలోని విజయ కీలాద్రి దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరంలో స్వామిని దర్శించుకునేందుకు అధికంగా వచ్చారు.



దుర్గమ్మ సేవలో సీఎస్

ఇంద్రకీలాద్రి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి దంపతులు సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విశాల్‌గున్నికి డీఐజీగా ఉద్యోగోన్నతి



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ)గా విధులు నిర్వర్తిస్తున్న విశాల్‌గున్నికి ఉద్యోగోన్నతి లభించింది. సీనియర్ ఎస్పీ హోదాలో పని చేస్తున్న ఆయనకు ఇటీవలే డీఐజీ (డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్)గా ఉద్యోగోన్నతి పొందారు. పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం డీఐజీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

దుర్గగుడికి రూ.4.48 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.4.48 లక్షల విరాళాన్ని సమర్పించారు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన తలారి సూరిబాబు, తలారి ఈశ్వర్ దుర్గ నాగేంద్రప్రసాద్, ప్రీతి సౌజన్య అన్నదానం, ఇతర అభివృద్ధి పనులకు రూ.4,48,015 విరాళాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను చైర్మన్ రాంబాబు అందజేశారు.

దేవదాయ శాఖ మంత్రికి ఆశీర్వచనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు సోమవారం ఆశీర్వచనాలు అందజేశారు. నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి టీటీడీ అర్చకులు చేరుకుని వేదార్వచనం పలికి ఆశీర్వదించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజారోగ్యానికి అభయం



మొదటి విడతలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం
- జిల్లాలో 587 వైద్య శిబిరాల నిర్వహణకు నిర్ణయం
- ఆయా క్యాంపుల్లో 92 మంది స్పెషలిస్టు వైద్యుల సేవలు
- అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఏడాదిన్నరగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది. స్పెషలిస్టు వైద్యులనే గ్రామాలకు పంపి ప్రజలకు వైద్య సేవలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించింది. జిల్లాలో మొదటి విడత విజయవంతంగా మెగా ఆరోగ్య మేళాలు నిర్వహించి 3.75 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయించింది. అదే స్ఫూర్తితో మంగళవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఎక్కడా ఎలాంటి లోపాలూ తలెత్తకుండా పక్కాగా మెగా ఆరోగ్య మేళాలు నిర్వహించేలా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సారథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

మొత్తం 587 క్యాంపుల నిర్వహణ

జిల్లాలోని ప్రతి గ్రామ/వార్డు సచివాలయం పరిధిలో మెగా ఆరోగ్య మేళా నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 587 క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో 257, అర్బన్ విజయవాడలో 286, సెమీ అర్బన్ మునిసిపాలిటీల్లో 44 క్యాంపులు నిర్వహించనున్నారు. తొలి రోజైన మంగళవారం గ్రామ సచివాలయాల పరిధిలో తొమ్మిది క్యాంపుల్లో వైద్య సేవలు అందిస్తారు. బుధవారం అర్బన్‌లోని వార్డు సచివాలయాల్లో ఏడు క్యాంపులు, ఈ నెల నాలుగో తేదీన అర్బన్ సచివాలయాల్లో ఆరు క్యాంపులు, ఐదో తేదీన గ్రామ సచివాలయాల్లో ఎనిమిది క్యాంపులు నిర్వహించేలా మొదటి వారం మ్యాపింగ్ పూర్తి చేశారు.

స్పెషాలిటీ వైద్యుల నియామకం

రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులతో పాటు, 92 మంది స్పెషాలిటీ వైద్యులు విధులు నిర్వహించనున్నారు. గైనకాలజిస్టులు 36 మంది, పిల్లల వైద్యులు 19 మంది, జనరల్ మెడిసిన్ వైద్యులు 25 మంది, ఆర్థోపెడిక్ (ఎముకలు-కీళ్లు) వైద్యులు తొమ్మిది మంది, ఇతరులు ముగ్గురు సేవలు అందిస్తారు. వీరిలో విజయవాడ ప్రభుత్వాస్పత్రి నుంచి 43 మంది, డీసీహెచ్ఎస్ నుంచి 27 మంది, డీసీ ఏఆర్ఎస్ నుంచి 22 మంది వైద్యులు పాల్గొని పరీక్షలు చేస్తారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడత జిల్లాలో విజయవంతంగా నిర్వహించి 3.75 లక్షల మందికి వైద్య పరీక్షలు చేశాం. అదే స్ఫూర్తితో రెండో విడత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాం. గ్రామాలతో పాటు, పట్టణాల్లోనూ ప్రతి సచివాలయం పరిధిలో క్యాంప్ నిర్వహిస్తాం. ఈ కార్యక్రమంలో 92 మంది స్పెషలిస్టు వైద్యులు భాగస్వాములు కానున్నారు. ఇప్పటి క్యాంపుల నిర్వహణకు సంబంధించి మ్యాపింగ్ పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్ సారథ్యంలో విజయవంతంగా నిర్వహిస్తాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

ఇంటికే మందులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఆరోగ్య మేళాల్లో 182 రకాల మందులతో పాటు, రక్తపోటు, మధుమేహం, ఈసీజీ వంటి పరీక్షలతోపాటు, జ్వరాలు, హిమోగ్లోబిన్ నిర్ధారణ వంటి పరీక్షలు చేస్తారు. ఇంకా ఏమైనా అవసరమైతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యూపీహెచ్‌సీల్లో నిర్వహిస్తారు. మందులు సైతం సమగ్రంగా పంపిణీచేస్తారు. క్రానిక్ డిసీజస్ (దీర్ఘకాలిక వ్యాధులు) మధుమేహం, రక్తపోటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి స్పెషలిస్టు వైద్యుల సూచనమేరకు సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటికే తీసుకెళ్లి మందులు అందించే కార్యక్రమం కూడా రెండో విడతలో ప్రారంభం కానుంది. దీంతో వ్యాధులతో బాధపడే వారు ఏ ఒక్కరు మందులు వాడకుండా ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు



నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



గిరిజన రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. రెడ్డిగూడెం మండలం అన్నారావుపేటకు చెందిన ఎనిమిది మంది గిరిజనులకు 11.44 ఎకరాలకు సంబంధించి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలెక్టర్ పంపిణీ చేశారు. విజయవాడ రూరల్ మండలం, కొత్తూరు తాడేపల్లికి చెందిన 13 యానాది కుటుంబాలకు గృహ నిర్మాణ సహాయం కింద రూ.8.19 లక్షల మెగా చెక్కు, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాలకు చెందిన 77 గిరిజన కుటుంబాలకు బోర్‌వెల్స్ విద్యుదీకరణకు సహాయం కింద రూ.6.70 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. గిరిజనులను అన్ని విధాలా ఆదుకుని వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఇటీవల ప్రత్యేక కమిటీ ఆమోదించిన గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయించి గృహ ప్రవేశాలు చేయించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలకు అదనంగా గిరిజనుల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని సహాయం చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమంలో భాగస్వాములైన గిరిజన సంక్షేమ శాఖకు, వాసవీ మహిళా మండలి (వీఎంఎం), నాబార్డుకు అభినందనలు తెలిపారు.

కార్డుదారుల ఇంటి వద్దకే నిత్యావసరాలు

- వలంటీర్ల పర్యవేక్షణలో మరింత కట్టుదిట్టం
- ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పౌరసరఫరాల శాఖ ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులు ఇంటివద్దకే నిత్యావసరాల సరుకుల పంపిణీ విధానంలో స్వల్ప మార్పులు చేశామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల నుంచి గ్రామ/వార్డు వలంటీర్ల క్లస్టర్లలో రేషన్ పంపిణీకి కార్డుల సంఖ్యను బట్టి ఐదు నుంచి పది నిర్ణీత ప్రదేశాలను గుర్తించామని పేర్కొన్నారు. ఆ ప్రదేశంలో వీధికి ఇరువైపులా ఉన్న కార్డుదారులకు సౌకర్యవంతంగా ఉండేలా రేషన్ పొందొచ్చని సూచించారు. వలంటీర్ల పర్యవేక్షణలో నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. ఇక నుంచి రేషన్ పంపిణీ చేస్తున్న వాహన ఆపరేటర్లు క్లస్టర్స్‌లో పంపిణీ చేసేందుకు ఒకరోజు ముందుగా సంబంధిత వలంటీర్లకు సమాచారం ఇవ్వాలని స్పష్టంచేశారు. ఉదయం ఏడు గంటల నుంచి ఆ క్లస్టర్‌లో వలంటీర్ల పర్యవేక్షణలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ఈ మేరకు వలంటీర్ యాప్‌లో నిర్దేశిత ప్రదేశాలను నమోదు చేశారని వివరించారు. ఎవరైనా కార్డుదారులు నిర్ణీత సమయంలో అందుబాటులో లేని పక్షంలో సరుకుల పంపిణీ ముగింపు రోజైన 17వ తేదీన సంచార వాహనం సంబంధిత గ్రామ/వార్డు సచివాలయం వద్ద సంబంధిత కార్డుదారులకు సమాచారం అందించి సరుకులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ మార్పులపై సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సంచార వాహన ఆపరేటర్లుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని బియ్యం కార్డుదారులు వారికి సంబంధించిన రేషన్ పొంది ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యాన్ని ఆహారంగా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ ఆ ప్రకటనలో సూచించారు.

భవానీదీక్షల విరమణకు సన్నద్ధం



సిద్ధమైన క్యూలైన్లు



విద్యుత్‌దీపాల వెలుగుల్లో ఇంద్రకీలాద్రి

- ఈ నెల 3వ తేదీ ఉదయం అగ్నిప్రతిష్టాపన
- 5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని అంచనా
- 20 లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్న దేవస్థానం
- గిరి ప్రదక్షిణ మార్గంలో మరిన్ని సదుపాయాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల ఏడో తేదీ వరకు కొనసాగే దీక్షల విరమణకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, ఒడిశా నుంచి భవానీ మాలధారులు ఇంద్రకీలాద్రికి తరలి రానున్నారు. ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మందికి పైగా భవానీలు దీక్షల విరమణకు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భవానీల రద్దీకి అనుగుణంగా అమ్మవారి దర్శనంలో వారికి ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు ఆలయ ప్రాంగణంతో పాటు స్నాన ఘాట్లు, తలనీలాలు సమర్పించే కేశఖండన శాలలు, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచే భవానీలు నగరానికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు రాత్రే పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, తెల్లవారుజామున గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకున్న అనంతరం క్యూలైన్‌లోకి చేరుకుంటారు.

అగ్నిప్రతిష్టాపనతో దీక్షల విరమణ ప్రారంభం

మూడో తేదీ ఉదయం ఆరు గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం ఆలయం నుంచి అర్చకులతోపాటు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, పాలక మండలి సభ్యులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం దిగువన ఉన్న హోమగుండాల వద్దకు చేరుకుంటారు. మహా మండపం ఎదుట ఏర్పాటు చేసిన రెండు హోమ గుండాల్లో ఉదయం 6.30 గంటలకు అగ్నిప్రతిష్టాపన చేస్తారు. దీంతో దీక్షల విరమణ లాంఛనంగా ప్రారంభమవుతుంది. అప్పటికే అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని కొండ దిగువకు చేరుకునే భవానీలు ఇరుముడులను సమర్పించిన అనంతరం హోమ గుండంలో నేతి కొబ్బరికాయలను సమర్పించడంతో దీక్ష పరిసమాప్తం చేసుకుంటారు.

శబరిమల రద్దీ నేపథ్యంలో మరింత అప్రమత్తం

ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని రీతిలో శబరిమల అయ్యప్ప సన్నిధిలో స్వాముల రద్దీ అధికంగా కనిపించింది. శబరిమలలో అయ్యప్ప దర్శనానికి 12 నుంచి 16 గంటల సమయం పట్టేలా రద్దీ కొనసాగుతోంది. దీంతో భవానీ దీక్షలు కూడా భక్తులు అధికంగానే స్వీకరించి ఉంటారని దేవస్థానం అంచనా వేస్తోంది. భవానీల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని దేవస్థాన చైర్మన్, ఈఓ పాలక మండలి సమావేశంలో చర్చించారు. పోలీసు శాఖ, రెవెన్యూ శాఖలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాయి. రైల్వే స్టేషన్, బస్టాండ్‌తో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాల వద్ద రద్దీని అంచనా వేయడంతో పాటు స్నానఘాట్లు, గిరి ప్రదక్షిణ మార్గాలు, క్యూలైన్‌లపై దృష్టి పెడుతున్నారు.

కోవిడ్ నిబంధనలు తప్పని సరి...!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో భవానీలు కోవిడ్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని దేవస్థానం సూచిస్తోంది. భవానీలు తమ స్వస్థలాల నుంచి బయలుదేరినప్పటి నుంచి మాస్క్‌లు ధరించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొంటోంది. దీక్షల విరమణకు నిత్యం వేలాది మంది భవానీలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎవరికి వారు తమ స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు.

సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలి

పుస్తక ప్రియుల పాదయాత్ర సభలో వక్తలు



ప్రసంగిస్తున్న ఇంతియాజ్ అహ్మద్. వేదికపై మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు



పుస్తక ప్రియుల పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉత్తమ సమాజం కావాలంటే ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఐదో రోజు సోమవారం 'పుస్తకప్రియుల పాదయాత్ర' జరిగింది. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. సిద్ధార్థ కళాశాల వద్ద మొదలైన పాదయాత్ర సిద్ధార్థ జంక్షన్, మదర్ థెరిస్సా జంక్షన్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, గాయత్రీ నగర్ మీదుగా పుస్తకమహోత్సవ ప్రాంగణం వరకు సాగింది. విద్యార్థులు ప్లకార్డులు చేబూని పుస్తకాలు చదవాలంటూ నినాదాలు చేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. పుస్తక మహోత్సవం ప్రాంగణంలోని కేతు విశ్వనాథరెడ్డి సాహితీ వేదికపై పాదయాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథి, మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చాలంటే పుస్తకాలు చదవాలన్నారు. తాను ఐఏఎస్ అధికారి కావడానికి పుస్తకాలు చదివే అలవాటు ఉండటమే కారణమన్నారు. పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా పిల్లలు తమ జీవితాలను తాము కోరుకున్నట్లు మలచుకోవచ్చని సూచించారు. పుస్తకాలు కావాలంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు కానీ ఇలాంటి ప్రదర్శనలకు రావడంవల్ల చాలా కొత్త విషయాలను తెలుస్తాయని వివరించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిలోనూ పుస్తకాలు ఉండాలన్నారు. పిల్లలకూ పుస్తకాలకూ ఉన్న అనుబంధం మార్కులకు, హోం వర్కులకు పరిమితం చేయకూడదని సూచించారు. గుర్రం జాషువా, శ్రీశ్రీ వంటి కవుల రచనలు, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహాపురుషుల జీవితాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. వికాస్ విద్యావనం డైరెక్టర్ పరిమి మాట్లాడుతూ.. పుస్తకమహోత్సవం వల్ల పిల్లలకు పుస్తకాలతో అనుబంధం పెంచుకునే అవకాశం లభిస్తోందన్నారు. పుస్తక మహోత్సవ నిర్వహణ కమిటీ మాజీ అధ్యక్షుడు వెంకట నారాయణ మాట్లాడుతూ.. రోజురోజుకూ పుస్తకాలు చదివే పాఠకుల సంఖ్య తగ్గుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. పుస్తకమహోత్సవ సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు, కార్యదర్శి కె.లక్ష్మయ్య, గోళ్ల నారాయణరావు, గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ స్టాల్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ)జిల్లా క్యాలెండర్–2024 ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఎస్టీయూ బృందం ఉదయభానును సోమవారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్‌ను ఉదయభాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు బియ్యాల రామారావు, ఎం.శ్రీహరి, టీవీఎల్.నరసింహారావు, కె.రామాంజనేయులు, పి.డి.వి.ప్రసాదరావు, జి.రవి, పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజేంద్ర, ఎల్.మోహన్, కోశాధికారి జె.వెంకటేశ్వర్లు, వత్సవాయి మండల అధ్యక్షుడు పి.ఆనంద్, మండల నాయకులు సీహెచ్.శ్రీనివాసరావు, పి.సజ్జనరావు, జి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ఉంగుటూరు: గన్నవరం మండలం బల్లిపర్రులో ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బల్లిపర్రు గ్రామానికి చెందిన తొమ్మండ్రు జోసఫ్ (26), గుడ్డేటి రవి మరో ఇద్దరు వ్యక్తులు గన్నవరంలో టీడీపీ నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆటోలో సోమవారం వెళుతున్నారు. మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో జోసఫ్‌పై ఆటో పడటంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గాయపడిన జోసఫ్‌ను చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందాడు. ముగ్గురికి స్వల్పగాయలయ్యాయి. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆత్కూరు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి....

గుడివాడరూరల్: బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కుచికాయలపూడి గ్రామానికి చెందిన కొల్లిపర అరవింద్ (18) సోమవారం ఉదయం గ్రామం నుంచి గుడివాడ వస్తుండగా బొమ్ములూరు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బైపాస్‌రోడ్ వద్ద ఉన్న మట్టి రోడ్డుకు ద్విచక్ర వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడిన అరవింద్ అక్కడికక్కడే మృతి చెందాడు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు ఆధునిక వైద్యం

- జీజీహెచ్‌లో అందుబాటులో స్ట్రోక్ యూనిట్
- అత్యాధునిక సౌకర్యాలతో ఐసీయూ
- వారంలో మూడు రోజులు న్యూరాలజీ ఓపీ
- నెలకు వంద మంది వరకూ బ్రెయిన్ స్ట్రోక్ రోగులు
- అవసరమైతే ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్

➡ పెనమలూరుకు చెందిన రాజయ్య మున్సిపాలిటీలో డ్రైనేజీ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. విధుల్లో ఉండగా కాలు , చేయి చచ్చుపడటంతో వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయనకు స్ట్రోక్ నిర్ధారణ చేసి థ్రోంబలైజ్ ఇంజక్షన్ ఇవ్వడంతో వైకల్యం లేకుండా కోలుకున్నాడు.

➡ గన్నవరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి విధుల్లో ఉండగా మూతి వంకర ఉన్నట్లు సహ ఉద్యోగులు గుర్తించారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకు రాగా, సీటీ స్కాన్ చేసి స్ట్రోక్‌గా గుర్తించారు. చికిత్స అందించి వైకల్యం రాకుండా కాపాడగలిగారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): పక్షవాతానికి గురైన రోగులకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి పెద్దదిక్కులా నిలుస్తోంది. అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ఎందరికో పునర్జన్మను ప్రసాదిస్తుంది. సకాలంలో ఆస్పత్రికి (గోల్డెన్ అవర్) చేరుకున్న వారికి ఎలాంటి వైకల్యాలు లేకుండానే నయం చేయగలుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ స్ట్రోక్ యూనిట్ సైతం అందుబాటులోకి వచ్చింది. దీంతో రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారు. అరుదైన జబ్బులకు సైతం మెరుగైన సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా స్ట్రోక్ నిర్ధారణకు అవసరమైన సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్‌లు అందుబాటులో ఉండటంతో సకాలంలో నిర్ధారణ చేయగలుగుతున్నారు.

ప్రత్యేక పరీక్షలు చేసి మందులు....

సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో న్యూరాలజీ ఓపీ వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శని) నిర్వహిస్తున్నారు. వారానికి 900 నుంచి 1100 మంది వరకూ రోగులు వస్తుంటారు. వారిలో 300 మంది గతంలో బ్రెయిన్‌స్ట్రోక్‌తో మందులు వాడే వారు ఉంటారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారు రెగ్యులర్‌గా మందులు వాడాల్సి ఉన్నందున వారికి ప్రత్యేకంగా పరీక్షలు చేసి మందులు ఇస్తుంటారు. అవసరమైతే రిపీట్ ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ చేస్తుంటారు.



స్ట్రోక్ యూనిట్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

అధునాతన సౌకర్యాలు....

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో 20 పడకలతో న్యూరాలజీ విభాగం ఉంది. అందులో 10 పడకలతో న్యూరో ఐసీయూ (స్ట్రోక్‌యూనిట్)ను రెండేళ్ల కిందట అందుబాటులోకి తెచ్చారు. ఆ యూనిట్‌లో బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం) రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇక్కడ నిపుణులైన వైద్యుల పర్యవేక్షణతో పాటు, వెంటిలేటర్స్, మల్టీపారామీటర్స్, సెంట్రల్ ఆక్సిజన్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు మించిన స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు ఉన్నాయి.

24 గంటలూ వైద్య సేవలు...

బ్రెయిన్ స్ట్రోక్ రోగులు ఎప్పుడైనా ఆస్పత్రికి రావచ్చు. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి వస్తే, వారికి అవసరమైన సీటీ, ఎంఆర్‌ఐ స్కాన్‌లు తీస్తారు. అందుకోసం 24 గంటలూ ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌తో పాటు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు సేవలు అందిస్తున్నారు. వారి పర్యవేక్షణలో నిరంతరం సేవలు అందిస్తున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఇక్కడకు వచ్చిన రోగికి పూర్తిగా స్వస్థత చేకూరుస్తూ వారికి భరోసా ఇస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు



స్ట్రోక్ యూనిట్‌లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వారు ఏ సమయంలోనైనా ఆస్పత్రికి రావచ్చు. క్యాజువాలిటీకి వస్తే, అక్కడ లక్షణాలను గుర్తించి సీటీ, ఎంఆర్‌ఐ స్కాన్‌లు చేస్తారు. అవసరమైతే స్ట్రోక్ యూనిట్‌లో అడ్మిట్ చేస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కూడా వారికి ఓపీలో ఫాలోఅప్ మెడిసిన్స్ అందిస్తున్నారు. ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– డాక్టర్ డి.వెంకటేష్ ,
సూపరింటెండెంట్ జీజీహెచ్

స్ట్రోక్‌పై అవగాహన పెరగాలి



బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం)పై ప్రజల్లో అవగాహన పెరగాలి. స్ట్రోక్ లక్షణాలను గుర్తించి నాలుగున్నర గంటల్లోపు ఆస్పత్రికి చేరగలిగితే సత్వర వైద్యంతో వైకల్యం రాకుండా చూడవచ్చు. వారంలో మూడు రోజుల పాటు నిర్వహించే నూరాలజీ ఓపీలో 900 నుంచి 1100 మంది వరకూ రోగులు వస్తుంటారు. వారిలో మూడో వంతు స్ట్రోక్ రోగులే ఉంటున్నారు. ఆస్పత్రిలో స్ట్రోక్ యూనిట్ (న్యూరో ఐసీయూ) అందుబాటులో ఉండటంతో మెరుగైన సేవలు అందించగలుగుతున్నారు.

– డాక్టర్ దారా వెంకట రమణ,
న్యూరాలజిస్ట్

పెన్షనర్లు యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్స్ సమర్పించాలి

జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎం. హెచ్. రెహమాన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ (ఈస్ట్), కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, విస్సన్నపేట ఉప ఖజా నా కార్యాలయాల పరిధిలో పెన్షనర్లు ఫిబ్రవరి 29లోగా యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్స్ సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎం.హెచ్. రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్స్, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లతో పాటు నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లను మంగళవారం నుంచి వచ్చే ఫిబ్రవరి 29 లోగా సమర్పించాలని కోరారు. పింఛనుదారులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. జిల్లాలోని పెన్షనర్లు ఈ విధానం ద్వారా తమ లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. తమ నివాసిత ప్రాంతంలో అందుబాటులో ఉన్న మీ సేవా కేంద్రాలు, నెట్ సెంటర్ లు, పోస్టాఫీసులలో సంప్రదించి తమ తమ లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పించవచ్చునని స్పష్టం చేశారు.

లైఫ్ సర్టిఫికెట్స్ సమర్పణకు ఖజానా కార్యాలయాలను సంప్రదించే పెన్షన్‌దారులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కాల పరిమితిలోగా తమ లైఫ్ సర్టిఫికెట్స్‌ను సమర్పించి వారి పెన్షన్ చెల్లింపులను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని వారి పెన్షన్ మార్చి 31 నుంచి నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

తాడేపల్లిరూరల్ : తప్పిపోయి వచ్చిన ఓ బాలుడి ప్రకాశం బ్యారేజ్ ప్రాంతంలో సోమవారం పోలీసులు గుర్తించారు. ఆ బాలుడు ఎవరో కనుక్కునేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. బాలుడు బధిరుడని గుర్తించి మంగళగిరి తుళ్ళూరు, తాడికొండ, పోలీస్‌స్టేషన్లకు బాలుడి వివరాలు పంపించారు. సచివాలయ వలంటీర్ల ద్వారా విచారణ చేసి వెంకటపాలెంకు చెందిన తొట్టక సాంబశివరావు, లక్ష్మీ దుర్గల కుమారుడైన తొత్తుక కార్తీక్‌గా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సాంబశివరావు, లక్ష్మీ దుర్గ



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న తాడేపల్లి పోలీసులు

బాబు బధిరుడని, మాట్లాడలేడని, వినపడదని వివరించారు. ఉదయం నుంచి కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామనుకున్న తరుణంలో ఇక్కడ ఉన్నాడని సమాచారం రావడంతో వచ్చామని చెప్పారు.

చిల్లర లేదన్నందుకు మహిళపై దాడి

అడ్డువచ్చిన యువకుడిపైనా అద్దంతో దాడి

తాడేపల్లిరూరల్ : చిల్లర లేదన్నందుకు ఓ యువకుడు చిరువ్యాపారం చేసుకునే ఓ మహిళపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం నులకపేట పాపాయమ్మ కొట్టు సెంటర్ వద్ద జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం పాపాయమ్మ కొట్టు సెంటర్‌లో తుమ్మూరి చంద్ర అనే మహిళ చిన్న దుకాణం పెట్టుకుని నివాసముంటోంది. డోలాస్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు సయ్యద్ అఫ్రోజ్ (పప్పు) సోమవారం కొట్టు దగ్గరకు వచ్చి సిగరెట్లు అడిగి, ఫోన్‌పే ఉందా అని ప్రశ్నించాడు. చంద్ర లేదని సమాధానం చెప్పడంతో రూ.500 నోటు ఇచ్చాడు. అంత పెద్ద మొత్తానికి చిల్లర లేదని ఆమె బదులివ్వడంతో పప్పు ఆమె చేతిలోని సిగరెట్ ప్యాకెట్ లాక్కుని, ఫోన్‌పే లేదు, చిల్లర లేదు అంటే ఊరుకుంటామా అని ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీంతో రూ.500 నోటు ఇస్తే చిల్లర మార్చుకొస్తానని ఆమె అడగడంతో పప్పు దాడికి పాల్పడ్డాడు. విచక్షణారహితంగా కొట్టాడు. దీనిని గమనించిన స్థానిక యువకుడు ఎస్‌కే మీరావలి అఫ్రోజ్‌ను అడ్డుకున్నాడు. దీంతో అతను మీరావలిపైనా విచక్షణా రహితంగా దాడిచేశాడు. పక్కనే ఉన్న టిఫిన్ బండి అద్దం పగలకొట్టి మీరావలి తలపై కొట్టాడు. అతడికి తీవ్ర గాయమైంది. ఈ ఘటనపై చంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ యత్నం

పటమట(విజయవాడతూర్పు): పటమట పంటకాల్వ రోడ్డులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ యత్నం జరిగిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట పంటకాల్వ రోడ్డులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కార్యాలయం తలుపులు, తాళాలు పగలకొట్టి చోరీ యత్నానికి ప్రయత్నించారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ ఈఎస్‌ఎల్ ప్రసాద్ ఫిర్యాదు చేయగాఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేశారు. పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు



చీమకుర్తి: పేర్నమిట్టలో రెండురోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి 42వ షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. బాలికల విభాగంలో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడుస్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో బాపట్ల, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. విజేతలకు స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు చేతులమీదుగా మెమొంటోలు అందించి అభినందించారు.

రేపు 'స్పా' కళాశాల స్నాతకోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాల ఏడో వార్షికోత్సవాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నామని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 243 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. నేషనల్ యాంటీ ర్యాగింగ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, రిటైర్డ్ ఎయిర్ మార్షల్ డాక్టర్ అజిత్ శంకరావ్ భోంస్లే ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలను అందజేస్తారని తెలిపారు.

పాడి రైతుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలి

ఎఎంఎ ప్రతినిధి బృందానికి చలసాని వినతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఎఎంఎ) ఆంధ్రప్రదేశ్‌లో పాడి రైతుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) చైర్మన్ చలసాని ఆంజనేయులు కోరారు. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ బృందానికి చెందిన డాక్టర్ మైఖేల్ సుక్, డాక్టర్ నిటా కుళకరిని, డాక్టర్ విల్లర్డ్. వి. ఎడ్వర్డ్స్, డాక్టర్ మెడిలిన్.ఈ. బట్లర్, డాక్టర్ థామస్. జె.మెడెజ్కి, డాక్టర్ అలెగ్జాండర్ డింగ్, డాక్టర్ ఫెడ్రిక్.ఎం.చెన్, డాక్టర్ ముక్కామల అప్పారావు, ముక్కామల సుమతిల బృందం భారతదేశంలోని వివిధ ప్రదేశాలను సందర్శించి ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేస్తుంది. ఈ నేపథ్యంలో తాడేపల్లికి విచ్చేసిన సందర్భంగా బృంద సభ్యులను విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు కలిసి చర్చించారు. తొలుత ఎఎంఎ బృంద సభ్యులను చలసాని ఆంజనేయులు శాలువాతో సత్కరించి కృష్ణా మిల్క్ యూనియన్ మెమెంటోలు అందజేశారు. రాష్ట్రంలోని పాడి రైతుల స్థితిగతులను వివరించడంతో పాటు పాడిపరిశ్రమ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో వివరించారు. పాడి రైతులకు ఎఎంఎ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి రైతుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న డాక్టర్ ముక్కామల శ్రీనివాస్ (బాబీ) అసోసియేషన్ అధ్యక్షుడు కావడం గర్వకారణమని చెప్పారు. ఈ బృందం భారతదేశంలోని ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా పాడి రైతుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలన్నారు. సేవా బావం కలిగిన డాక్టర్ ముక్కామల అప్పారావు, సుమతిల కుమారుడైన శ్రీనివాస్ తల్లిదండ్రులలాగా సమాజ సేవకు విశేష కృషి చేస్తున్నారన్నారు.



అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో చలసాని ఆంజనేయులు

సీఎస్‌ను కలిసిన కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని కలెక్టర్ పి.రాజాబాబు సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసిన కలెక్టర్ రాజాబాబు బోన్సాయి మొక్కను అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.



సీఎస్ జవహర్‌రెడ్డికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ రాజాబాబు

సామాజిక చైతన్యానికి అండగా శ్రీశ్రీ సాహిత్యం



పుస్తక మహోత్సవంలో శ్రీశ్రీ సాహిత్యనిధి స్టాల్



పుస్తక మహోత్సవ ప్రాంగణం

పుస్తక మహోత్సవంలో కొలువుదీరిన స్టాల్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆధునిక సాహిత్యంలో సమాజాన్ని చైతన్యవంతం చేసిన ప్రముఖ కవుల్లో అగ్రగణ్యుడు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యంలో ఆయనది చెరగని ముద్ర. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఆయన సాహితీ పరిమళాలు ప్రజలను ఆలోచింపజేశాయి, చేస్తున్నాయి. సినిమా రంగంలోనూ ఆయన తన అద్భుతమైన ముద్రను వేశారు. తెలుగు అభ్యుదయ సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్న శ్రీశ్రీ మన నుంచి దూరమై దశాబ్దాలు గడిచినా తన సాహితీ వెలుగును కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రధానంగా నేటి సమకాలీన సమాజంలో పాతుకుపోయిన అనేక రుగ్మతలను తన కలంతో ఎత్తి చూపి వ్యవస్థలో మార్పు కోసం పాటుపడిన సంఘ సంస్కర్త కూడా. అటువంటి మహాకవి సాహిత్యాన్ని ఇంకా విస్తృతం చేయడానికి తద్వారా సమాజాన్ని మరింత చైతన్య వంతం చేయటానికి నగరంలోని శ్రీశ్రీ సాహిత్యనిధి పాటుపడుతోంది. నగరానికి చెందిన సాహితీవేత్త సింగంపల్లి అశోక్‌కుమార్ ఈ సంస్థను స్థాపించి సాహితీ వికాసానికి ముఖ్యంగా శ్రీశ్రీ సాహితీ వ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆ క్రమంలోనే 34వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శ్రీశ్రీ సాహితీ గ్రంథాలను సాహితీప్రియులకు అందుబాటులో ఉంచారు.

170 పుస్తకాలను ముద్రించిన శ్రీశ్రీ సాహిత్యనిధి

శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకులు అశోక్‌కుమార్ విశేషమైన కృషిని కొనసాగిస్తున్నారు. అందులో ఇప్పటి వరకూ 170 పుస్తకాలను ముద్రించారు. ముఖ్యంగా తొలుత వంద పుస్తకాల లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానిని అధిగమించారు. అనంతరం మరో వంద పుస్తకాల లక్ష్యానికి శ్రీకారం చుట్టారు. అందులో మరో 70 పుస్తకాల ముద్రణ పూర్తి చేసి పాఠకులకు అందించారు.

రూ.2వేలకు ఏడు వేల విలువైన పుస్తకాలు

శ్రీశ్రీ సాహిత్యానికి సంబంధించి శ్రీశ్రీ సాహిత్య నిధి ముద్రించిన సుమారు వంద పుస్తకాలను విడివిడిగా ఏడు వేల రూపాయాల విలువ చేస్తాయి. వాటిని కేవలం రెండు వేలకు ఈ స్టాల్‌లో నిర్వాహకులు అందిస్తున్నారు. అంటే రెండు వేలు చెల్లిస్తే ఏడు వేల విలువైన వంద పుస్తకాలను పొందవచ్చు. శ్రీశ్రీ అందించిన సాహిత్యంతో పాటుగా ఆయన జీవితానికి సంబంధించి వివిధ ప్రక్రియలలో రచయితలు, కవులు అందించిన సాహిత్యం అందులో ఉన్నాయి.

దాతలు కోరితే గ్రంథాలయాలకు పంపుతాం



రెండు వేలు చెల్లించిన దాత తన పేరు మీద కోరిన పాఠశాలకు లేదా గ్రంథాలయాలకు వంద శ్రీశ్రీ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను పంపుతాం. అందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. దశాబ్దాలు గడుస్తున్నా శ్రీశ్రీ సాహిత్యం ఎప్పుడూ సమకాలీన సామాజిక పరిస్థితులను ఆవిష్కరిస్తూనే ఉంటుంది. శ్రీశ్రీ సాహిత్యం కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి పాటుపడుతుందని గట్టిగా నమ్ముతాను. అందువలనే ఆయన సాహిత్యాన్ని ప్రజలకు అందించేందుకు నా సంస్థ ద్వారా కృషి చేస్తున్నాను. ఇప్పటి వరకూ 170 పుస్తకాలు ముద్రించాము. అనేక మంది మిత్రులు, సాహితీమూర్తుల సహకారంతో శ్రీశ్రీ సాహిత్యనిధిని ముందుకు తీసుకెళ్తున్నాం.

– సింగంపల్లి అశోక్‌కుమార్,
శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకులు

క్లుప్తంగా

బుక్ డిపాజిట్ సెంటర్‌ను వినియోగించుకోండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): బుక్ డిపాజిట్ సెంటర్‌ను విద్యార్థులు, ప్రజలు వినియోగించుకోవాలని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ అన్నారు. కృష్ణలంకలోని హైస్కూల్ రోడ్డులో సోమవారం ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బుక్ డిపాజిట్ సెంటర్(బీడీసీ)ను ఆమె ప్రారంభించారు. జమలపూర్ణమ్మ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలు, పట్టణాల్లోని చిన్న చిన్న ప్రాంతాల్లో కూడా గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో బీడీసీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఠాగూర్ గ్రంథాలయం గ్రేడ్–1 అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీడీసీ దోహదపడుతుందన్నారు. గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఎంపీడీపీ నగేష్, సిబ్బంది జి.ఉమారాణి, ధనలక్ష్మి, కె.రాంబాబు, ఫణిబాబు, సుబ్రహ్మణ్యం, కేర్‌టేకర్ పడిది హేమసారిక పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ 2024 క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో సేవలు అందించాలని శుభాకాంక్షలు చెప్పిన ల్యాబ్ టెక్నీషియన్స్‌కు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి సౌభాగ్యం, కోశాధికారి ఫణికుమార్, ఉపాధ్యక్షుడు నరసింహారావు, సభ్యులు నాగేంద్రబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆంధ్రనాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగరానికి చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు నృత్య కళాకారులు ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన విశేషంగా అలరించింది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సోమవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నాట్య ప్రదర్శన జరిగింది. రాయన శ్రీనివాసరావు శిష్యబృందం పలు కీర్తనలకు హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు అమ్మవారి దర్శనం చేయించారు.

రవాణారంగం పూర్వవైభవానికి చొరవ చూపాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కరోనాతో రవాణా రంగం అతలాకుతలమైందని, లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపితే పూర్వ వైభవం సంతరించుకుంటుందని కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా ఆశాభావం వ్యక్తం చేశారు. ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. బెంజిసర్కిల్ సమీపంలో సంఘ హాలులో బాధ్యతలు చేపట్టిన ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది. సంఘ అధ్యక్షుడిగా నాగమోతు రాజా, ఉపాధ్యక్షులుగా కాజ వెంకట సత్య చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శిగా అల్లాడ వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శులుగా రావి శరత్‌బాబు, చెన్నుపాటి వినయ్, కోశాధికారిగా పొట్లూరి చంద్రశేఖరరావు బాధ్యతలు చేపట్టారు. వారితో ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పాలడుగు వెంకటేశ్వరరావు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా సంఘ అధ్యక్షుడిగా సేవలు అందించిన తుమ్మల లక్ష్మణస్వామి, ఇతర కమిటీ సభ్యులను సత్కరించారు.

4న అనఘాష్టమి వ్రతం

పటమట(విజయవాడతూర్పు): పటమట అవధూత దత్తపీఠంలో ఈ నెల 4వ తేదీ అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్నట్లు జయలక్ష్మి మాతృమండలి కన్వీనర్ స్రవంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు పటమటలోని గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో వ్రతం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొవాలనుకునే వారు 9491636317 నంబర్లో సంప్రదించాలని సూచించారు.


రామునికి వెండి వస్తువుల బహూకరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట అంగడాల వారి వీధిలోని రామాలయంలో స్వామి వారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కొనిజేటి రమేష్ హారతికి వినియోగించే వెండి సామగ్రిని సోమవారం బహూకరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అందించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొనిజేటి అక్షయ్, జీవీ రవికుమార్, కొనిజేటి అఖిల్, పీతా బుజ్జి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలతో ముందుకు..



కేక్ కట్ చేస్తున్న సీపీ టీకే రాణా



సందేశం ఇస్తున్న పీజే స్టీఫెన్‌పాల్

ఆటోనగర్(విజయవాడతూర్పు): గత ఏడాదిలో చేసిన తప్పులను సరిదిద్దుకొని నూతన సంవత్సరంలో మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలని మెస్సీయా ఫెలోషిప్ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ పిలుపు నిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. తొలుత చిన్నారులు క్రైస్తవ పాటలు ఆలపించారు. కార్యక్రమంలో విశ్వాసులుపాల్గొన్నారు.

గతాన్ని విడనాడి.. మార్పు పొందండి..

లబ్బీపేట(విజయవాడతూర్పు): నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ జీవితంలో మార్పును కోరుకోవాలని, గతించిన గాయాలను వీడాలని అంతర్జాతీయ వర్తమానికుడు రెవరెండ్ పీజే స్టీఫెన్ పాల్ అన్నారు. లైఫ్ చేంజింగ్ ఆధ్వర్యాన నూతన సంవత్సర ఆశీర్వాద సభ విజయవాడలోని ఎం కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగింది. పీజే స్టీఫెన్‌పాల్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా లైఫ్ చేంజింగ్ సండే స్కూల్ చిన్నారులతో ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. సేవకుల బృందం ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సర వాగ్దానాన్ని పీజే స్టీఫెన్‌పాల్ ప్రకటించారు.

టీటీడీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

విజయవాడ కల్చరల్: ఆంగ్లనూతన సంవత్సరం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలోని పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ అధికారి రామచంద్రరావు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ ప్రచురించిన డైరీలు, క్యాలెండర్లను అధికారులు విక్రయించారు. గురు, శుక్ర, శనివారాల్లో శ్రీ వారి అన్నప్రసాదం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● కంచికామకోటి పీఠపాలిత లబ్బీపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సీపీ టి.కె.రాణా కేక్ కట్ చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు వి.అజిత, ఉదయరాణి, మోకా సత్తిబాబు, కె.చక్రవర్తి, ఏడీసీపీలు లక్ష్మీపతి, జి.వి. రమణమూర్తి, బి.ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి పునాదులు కార్పొరేషన్ సిబ్బంది



మేయర్‌ను కలిసిన వీఎంసీ అధికారులు, సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరం అభివృద్ధి చెందాలంటే దానికి మూలకారకులు కార్పొరేషన్ సిబ్బందేనని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో వీఎంసీ అధికారులు, కార్పొరేటర్లు, వీఎంసీ సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలంటే దానికి మూల కారణం కార్పొరేషన్ లో పనిచేస్తున్న సిబ్బందేనని అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజాశ్రేయస్సుకు పని చేయాలన్నారు. అనంతరం మేయర్.. వీఎంసీ సిబ్బంది తీసుకొచ్చిన కేకును కట్ చేశారు. మేయర్, కమిషనర్‌ను కలిసిన వారిలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, అడిషనల్ కమిషనర్ జనరల్ కె.శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ డి.వెంకటలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ సెవెన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీయల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

తారాపేటలో...

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరం అందరికీ మేలు జరగాలని, భగవంతుడి ఆశీస్సులు లభించాలని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. నూతన సంవత్సరం వేడుకలు పురస్కరించుకొని వన్‌టౌన్ తారాపేటలో సెయింట్ పీటర్స్ కో–కథెడ్రల్ చర్చి ఆవరణలో సోమవారం జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన నూతన సంవత్సరం సందేశమిస్తూ గతేడాది దేవుడు మనకు ఎన్నెన్నో గొప్ప కార్యాలు చేశారన్నారు. అనంతరం చర్చి ఆవరణలో అత్యంత రమణీయంగా అలంకరించిన పూజా పీఠంపై బిషప్ రాజారావు చర్చి విచారణ కర్తలు ఫాదర్ విజయకుమార్ 'సమష్టి దివ్యపూజా బలి'ని సమర్పించారు.



స్వామివారి సేవలో న్యాయమూర్తి వెంకటరమణ

సీఎం జగన్‌కు శుభాకాంక్షలు



కొత్త సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సమష్టి కృషితో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పారదర్శకమైన సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని అధికారులకు ఆయన సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఢిల్లీరావును జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ పి.సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేందుకు జిల్లా అధికారులు, ఉద్యోగులు అందించిన సహకారం మరవలేనిదన్నారు. జిల్లాను 'మోడల్'గా తీర్చిదిద్దడంలో సహకారం అందించాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్డీఓలు పి.సాయిబాబు, కె.మాధవి, జిల్లా అధికారులు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, సహకార అధికారి సీహెచ్ శైలజ, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ బాషా, సాంఘిక సంక్షేమ అధికారి విజయ భారతి, డీఎంహెచ్‌వో సుహాసిని, పౌర సరఫరాల అధికారి మోహనబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తెద్దాం

నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో దేవినేని అవినాష్



అవినాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలందరికీ మంచి చేసిన ఈ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి తీసుకు వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గుణదలలోని పార్టీ కార్యాలయం సోమవారం కోలాహలంగా మారింది. దేవినేని అవినాష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి నియోజకవర్గంతో పాటు, నగరంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ వారితో కలిసి కేక్ కట్ చేశారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అసోసియేషన్లు ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ రోలర్ స్కేటింగ్ పతకాల విజేతలకు సూచించారు. చండీగఢ్‌లో ఇటీవల జరిగిన జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులు బచ్చు వరణ్‌కృష్ణ, ఎం. సుచిత్ర, పోతల విజయడానియేల్, కొవ్వూరి శాన్విరఫియా, చేబోయిన అభిరామ్, బి.జతిన్‌లను కమిషనర్ తన చాంబర్‌లో సోమవారం అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకటసత్యనారాయణ, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు మాధవీకృష్ణ, కోచ్ దిలీప్ పాల్గొన్నారు.

భక్తజన కోలాహలం

● దుర్గగుడి క్యూలైన్లలో భక్తుల బారులు
● సిఫార్సులకు చెల్లు.. టికెట్లు ఉంటేనే దర్శనం



దుర్గగుడి ఆవరణలో భక్తుల సందడి



క్యూలైన్లలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సర వేళ... ఇంద్రకీలాద్రిపై భక్తజన కోలాహలం కనిపించింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు ఏకరీతిగా కొనసాగింది. క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల తాకిడితో సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. మరో వైపున బుధవారం నుంచి భవానీ దీక్ష విరమణలు ప్రారంభం కానుండటంతో ఘాట్‌రోడ్డులో క్యూలైన్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో ఘాట్‌రోడ్డుపైకి ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డులో నడుచుకుంటూ కొండపైకి చేరుకున్నారు. మరో వైపున మహా మండపం లిఫ్ట, మెట్ల మార్గం ద్వారానే భక్తులను కొండపైకి అనుమతించారు. రద్దీ నేపథ్యంలో లిఫ్టను సైతం మహా మండపం 5వ అంతస్తు వరకే అనుమతించారు. నూతన సంవత్సరం రోజు విద్యార్థులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

టికెట్ల స్కానింగ్ కట్టుదిట్టం

వీఐపీల పేరిట వచ్చే వారిని టికెట్లు ఉంటేనే క్యూలైన్‌లోకి అనుమతించాలని ఈవో రామారావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి అదనపు సిబ్బందిని సైతం నియమించారు. దీంతో స్కానింగ్ పాయింట్ వద్ద రూ. 500 , రూ. 300 టికెటు క్యూలైన్‌లోకి ప్రవేశించాలంటే టికెట్లు తప్పని సరి అని సిబ్బంది పేర్కొడమే కాకుండా కఠినంగా అమలు చేశారు. దీంతో పలువురు భక్తులు ఆలయ సిబ్బందితో వాదనలకు దిగి ఈవోకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గతంలో ఎక్కడూ లేని రీతిలో సోమవారం టికెట్ల విక్రయం ద్వారా రూ. 10 లక్షలు పైబడే ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని పలువురు న్యాయమూర్తులు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు దర్శించుకున్నారు.

దేవదాయ శాఖ మంత్రికి దుర్గగుడి అర్చకుల ఆశీర్వచనం



మంత్రి కొట్టు సత్యనారాయణకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు దుర్గగుడి అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. నగరంలోని క్యాంప్ కార్యాలయానికి దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు చేరుకుని ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థానం రూపొందించిన క్యాలెండర్‌ను మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాల పెంపునకు 'ఫెట్' దోహదం



ఫెట్‌లో స్టాల్‌ను ప్రారంభిస్తున్న రామిశెట్టి వీరాస్వామి, ప్రిన్సిపాల్ పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో పోటీతత్వం, వ్యాపార దృక్పథం, నాయకత్వ లక్షణాల పెంపునకు ఫెట్‌లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, హయత్‌ప్లేస్ చైర్మన్ రామిశెట్టి వీరస్వామి అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఫెట్ నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల స్టాల్స్, గేమ్‌షోలతో పాటు, వివిధ రకాల ఆటపాటలు, నృత్యాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. వీరస్వామి రిబ్బన్ కట్‌చేసి స్టాల్స్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీమ్ స్పిరిట్‌తో ఎలా పనిచేయాలో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు ఏర్పరుచుకోవాలన్నారు. విద్యార్థులకు నూతన సంవత్సరం విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

సమాచార శాఖ అదనపు సంచాలకులు స్వర్ణలత



కేక్ కట్ చేస్తున్న స్వర్ణలత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, సమాచార, పౌర సంబంధాల శాఖకు మరింత వన్నెతెచ్చేలా పని చేయాలని ఆ శాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు అదనపు సంచాలకులు స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె కేక్ కట్ చేశారు. అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక పథకాలు అమలు చేస్తోందన్నారు. 2024లోనూ శాఖ అధికారులు, సిబ్బంది కొత్త ఉత్సాహంతో పనిచేసి డిపార్టుమెంటుకు మంచి పేరు తీసుకురావాలని స్వర్ణలత సూచించారు. కార్యక్రమంలో డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పీఆర్వో వీవీ ప్రసాద్, ఏఐఈ వి.వరప్రసాద్, ఏవీఎస్ ఎ.సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

డీసీపీ చక్రవర్తి



విజయవాడ స్పోర్ట్స్: పేద విద్యార్థినుల చదువుల కోసం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ట్రాఫిక్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.చక్రవర్తి అన్నారు. నగరానికి చెందిన విద్యార్థినులు లిఖిత(డిగ్రీ), సాహితి(ఇంటర్), దోలిక(ఎనిమిదో తరగతి) విద్యార్థినులకు సంస్థ సమకూర్చిన రూ. 40 వేలను డీసీపీ తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. పేదరికం కారణంగా చదువు ఆగిపోకూడదనే ఉద్దేశంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ చేసిన సాయాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చందన వెంకట్, ట్రాఫిక్ సీఐ రాజేంద్ర పాల్గొన్నారు.

200 పేద కుటుంబాలకు కూరగాయల పంపిణీ



గుణదల(విజయవాడ తూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్ సీపీ 'తూర్పు' కార్యాలయంలో పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. దేవినేని రాజశేఖర్ నెహ్రూ ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు దేవినేని సుధీర 200 మంది పేద కుటుంబాలకు కూరగాయలు అందజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వన్‌టౌన్‌లో బ్రాహ్మణ వీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరి కనిపించారు. కొత్తగళ్ల ప్రాంగణంలోని శ్రీ నగరేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు పోటెత్తారు. కోదండరామునికి ప్రత్యేక అలంకారం చేశారు. కెనాల్ రోడ్డులోని వినాయకుని దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. శ్రీ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకృష్ణుడు, సంకల్పసిద్ధి హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

మున్సిపల్ శాఖలో ఓహెచ్ అలవెన్సు పరిధి పెంపు

సాక్షి, అమరావతి: మున్సిపల్ శాఖలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, పారిశుధ్య వాహనాల డ్రైవర్లు, మలేరియా వర్కర్లకు నెలకు రూ.6 వేలు చొప్పున ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ చెల్లించనున్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ శాఖలోని ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి 2019 ఆగస్టు నుంచి ప్రభుత్వం రూ.6 వేలు వృత్తిపరమైన ఆరోగ్య భత్యం (ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్) చెల్లిస్తున్న విషయం తెలిసిందే. ఇకపై వీరితోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లు, పారిశుధ్య వాహనాల డ్రైవర్లు, మలేరియా వర్కర్లకు కూడా ఆరోగ్య భత్యం చెల్లిస్తారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబం


జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు


జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు దంపతులు


జస్టిస్ వెంకట జ్యోతిర్మయికి అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఈవో

తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ, జమ్మూకాశ్మీర్ గవర్నర్లు తమిళిసై సౌందర్ రాజన్, మనోజ్ సిన్హా సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, గుమ్మనూరు జయరాం, నారాయణస్వామి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తమిళనాడు మంత్రి గాంధీ, తమిళనాడు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోవిందరాజులు, విశాఖ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి ఉన్నారు.


ఆలయం వెలుపల తమిళనాడు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోవిందరాజులు


ఆలయం వెలుపల విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద సరస్వతి

ఒకే జిల్లాలో 61వేల కొత్త ఓట్లు

కొత్త ఓట్లలో యువతవే 80 శాతం!

- బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 61,193 కొత్త ఓట్లు
- అద్దంకి నుంచి అత్యధికంగా 12,883 ఓట్లు
- బాపట్లలో 9,967, రేపల్లెలో 9,961, చీరాలలో 9,958
- తొలగించిన ఓట్లు 46,116
- అత్యధికంగా పర్చూరు నుంచి 10,468 ఓట్ల తొలగింపు
- రేపల్లెలో 8,880, చీరాలలో 7,420, అద్దంకిలో 7,207 తొలగింపు
- పరిశీలనలో మరో 600 దరఖాస్తులు
- జనవరి 12 వరకూ పరిశీలన.. 22న తుది జాబితా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లాలో భారీ సంఖ్యలో కొత్త ఓటర్ల నమోదు జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో ఓటేయడానికి నవతరం ఉత్సాహంగా ముందుకు వస్తోంది. ఈ జిల్లాలో ఇప్పటివరకు 61,193 ఓట్లను కొత్తగా చేర్చారు. వీటిలో యువతవే 80 శాతం ఉన్నట్లు సమాచారం. మరోపక్క ఇబ్బడిముబ్బడిగా ఉన్న దొంగ ఓట్లను అధికారులు తొలగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా లక్షలాదిగా వచ్చిన ఫారం-6, ఫారం-7, 8లను ఎన్నికల అధికారులు వడపోసి, దొంగ ఓట్లను తొలగించి కొత్త ఓట్ల నమోదును చాలా వరకు పూర్తి చేశారు. ఇప్పటికే 46,116 అక్రమ ఓట్లను తొలగించారు. అన్నీ కలిపి మరో 600 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. వీటిలో కొత్త ఓట్లకు సంబంధించి 400 దరఖాస్తులు ఉన్నాయి. జనవరి 12వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. జనవరి 22 నాటికి తుది జాబితా విడుదల చేస్తారు. ఇప్పటివరకు నమోదైన కొత్త ఓట్లలో అత్యధికంగా అద్దంకిలో 12,883 నమోదయ్యాయి. బాపట్లలో 9,967, రేపల్లెలో 9,961, చీరాలలో 9,958, పర్చూరులో 9,385, వేమూరులో 9,039 ఉన్నాయి.

ప్రలోభాలకు లొంగకుండా దొంగ ఓట్ల తొలగింపు

జిల్లాలో 65 వేలకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, పలువురు అధికార పార్టీ నేతలు జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దొంగ ఓట్లను గుర్తించి వాటిని తొలగించాలని 65 వేలకు పైగా ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా వచ్చిన ఫారం-7 దరఖాస్తులను అధికారులు సమగ్రంగా పరిశీలించి దొంగ ఓట్లను తొలగిస్తున్నారు. దీంతో తమ దొంగ ఓట్ల వ్యవహారం బయటపడుతుందని భావించిన పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికార పార్టీ దొంగ ఓట్లు చేర్పిస్తోందంటూ ఆరోపణలకు దిగారు. అధికారులకు పదేపదే ఫిర్యాదు చేశారు. కోర్టును ఆశ్రయించారు. జిల్లా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. అయినా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం వేలాది ఫారం-7 దరఖాస్తులను నిశితంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపింది. ఇప్పటివరకూ 46,116 దొంగ ఓట్లను గుర్తించి, తొలగించింది. వీటిలో అత్యధికంగా పర్చూరు నుంచి 10,468 ఓట్లను తొలగించారు. రేపల్లె పరిధిలో 8,880, చీరాల నుంచి 7,420, అద్దంకిలో 7,207, వేమూరులో 6,295, బాపట్ల నుంచి 5,846 ఓట్లను తొలగించారు. తొలగించిన ఓటర్లలో ఇతరప్రాంతాలకు వలస వెళ్లిన వారు, అక్కడే స్థిరపడిన వారు, చనిపోయిన వారు, రెండు చోట్లా ఓట్లు ఉన్నవారు ఉన్నారు.

ఓటు హక్కుతో ఆనందం



రాబోయే ఎన్నికల్లో తొలిసారి ఓటేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేస్తాను. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగను. మంచి ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు నావంతు తోడ్పాటు అందిస్తాను. మంచి పాలన అందించేవారికి మద్దతుగా నిలవాలన్నది కోరిక.

– పూరేటి సంధ్య, కొప్పెరపాడు, బల్లికురవ మండలం

ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నా



నాకు ఓటు హక్కు రావడం చాలా సంతోషంగా ఉంది. నేను ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్నాను. పేద, మధ్యతరగతి వారికి అండగా నిలిచే ప్రభుత్వాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది. రాబోయే ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నాను.

–ఎం.సాయి పూజిత, బీటెక్ విద్యార్థి, బాపట్ల

ప్రజల కోసం పనిచేసే వారికే ఓటు



తొలిసారి ఓటుహక్కు రావడం ఆనందంగా ఉంది. పేదలకు అండగా నిలిచి ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికే రాబోయే ఎన్నికల్లో నా ఓటు. ఎవరి ప్రలోభాలకూ లొంగకుండా ఓటు వేస్తాను. అందరికీ మంచి జరగాలన్నదే నా కోరిక.

– పి. వెంకట నాగ మణికంఠ రెడ్డి, దుండివారిపాలెం, కర్లపాలెం మండలం

పిల్లల చేతిలో హెల్‌ఫోన్!



- రోజుకు 3 గంటలకు పైగా మొబైల్ ఫోన్‌తోనే గడుపుతున్న పిల్లలు
- పట్టణాల్లో 9-17 ఏళ్లలోపు పిల్లల్లో 61 శాతం మంది పరిస్థితి ఇదే
- లోకల్ సర్కిల్ సర్వేలో తల్లిదండ్రులు వెల్లడి

సాక్షి, అమరావతి: కరోనా లాక్‌డౌన్, ఆన్‌లైన్ తరగతుల కారణంగా పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయింది. కరోనా వ్యాప్తి తగ్గిపోయినా.. ఆఫ్‌లైన్ తరగతులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పిల్లల్లో సెల్‌ఫోన్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. దేశంలోని పట్టణ, నగర ప్రాంతాల్లో 9 నుంచి 17 ఏళ్ల పిల్లలు రోజుకు సగటున మూడు గంటలకు పైగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారు. లోకల్ సర్కిల్ సంస్థ నిర్వహించిన సర్వేలో 61 శాతం తల్లిదండ్రులు ఈ అంశాన్ని వెల్లడించారు. తమ పిల్లలు ఫోన్‌లో గేమ్స్ ఆడటం, ఓటీటీ యాప్స్‌లో సినిమాలు చూడటం, సోషల్ మీడియాలో గడపడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 296 జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 46 వేల మంది తల్లిదండ్రులను సర్వే చేశారు. సర్వేలో పాల్గొన్న వారిలో 62 శాతం మంది పురుషులు, 38 శాతం మంది మహిళలు ఉన్నారు.

దూకుడు.. అసహనం పెరిగాయ్

సర్వేలో భాగంగా సెల్‌ఫోన్ అతి వినియోగంతో పిల్లల సామాజిక ప్రవర్తన/మానసిక ఆరోగ్యాలపై ప్రతికూల ప్రభావాల స్థాయిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. సెల్‌ఫోన్ వినియోగం కారణంగా పిల్లల్లో గమనించిన మార్పులు ఏమిటని 11,697 మంది తల్లిదండ్రులను ఆరా తీయగా.. 39 శాతం పిల్లల్లో దూకుడు స్వభావం పెరిగినట్టు తల్లిదండ్రులు చెప్పారు. 37 శాతం పిల్లల్లో అసహనం, 25 శాతం పిల్లల్లో అతి క్రియాశీలత (హైపర్ యాక్టివ్‌నెస్) పెరిగిందని వెల్లడించారు. 22 శాతం పిల్లల్లో నిస్పృహ పెరిగినట్టు గుర్తించారు.

ఇంట్లో ఉన్నంతసేపూ ఫోన్‌తోనే..

పట్టణ ప్రాంతాల్లోని చాలామంది పిల్లలు ఇంట్లో ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌తో గడపడానికి ఎక్కువ ఇష్టపడుతున్నారు. మీ పిల్లలు రోజుకు సగటు ఎంత సమయం సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారని 11,507 మందిని ఆరా తీయగా.. 6 గంటల మేర సెల్‌ఫోన్‌తో గడుపుతున్నట్టు 15 శాతం మంది తెలిపారు. 3నుంచి 6 గంటల పాటు తమ పిల్లలు ఫోన్ వినియోగిస్తున్నట్టు 46 శాతం మంది, 1నుంచి 3 గంటల మధ్య వినియోగిస్తున్నట్టు 39 శాతం మంది పేర్కొన్నారు. అయితే ఓటీటీ.. లేదంటే సోషల్ మీడియా మీ పిల్లలు సెల్‌ఫోన్ ఎందుకోసం వినియోగిస్తున్నారని 12,017 మందిని ప్రశ్నించి.. సోషల్ మీడియా, ఓటీటీ, ఆన్‌లైన్ గేమింగ్, ఇతర వ్యాపకాలు, ఏమీ చెప్పలేం అని ఆప్షన్‌లు ఇవ్వగా.. చాలామంది ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లతో సమాధానాలిచ్చారు. 37 శాతం మంది తమ పిల్లలు ఓటీటీల్లో సినిమాలు, వెబ్‌సిరీస్‌ను చూస్తున్నట్టు చెప్పారు. 35 శాతం మంది వాట్సప్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్, బీ రియల్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో పిల్లలు గడుపుతున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్ కోసం ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్టు 33 శాతం మంది, ఇతర వ్యాపకాలని 10 శాతం, ఏమీ చెప్పలేమని 2 శాతం మంది వెల్లడించారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం

పిల్లల్లో ఫోన్ వినియోగాన్ని నియంత్రించడంలో తల్లిదండ్రుల పాత్రే కీలకం. పాఠశాల, కళాశాలల్లో అలసిపోయి ఉంటారని ఇంటికి రాగానే పిల్లలు సెల్‌ఫోన్ వాడుతున్నా కొందరు తల్లిదండ్రులు పట్టించుకోరు. ఆటవిడుపు కోసం చేసే ఈ చర్య క్రమంగా వ్యసనంగా మారుతోంది. అదే విధంగా హోమ్ వర్క్, ప్రాజెక్ట్ వర్క్స్ కోసమని పిల్లలు అడిగిన వెంటనే సెల్‌ఫోన్ ఇచ్చేస్తుంటారు. అనంతరం వాళ్లు ఎంతసేపు ఫోన్‌ను వినియోగిస్తున్నారనేది పట్టించుకోరు. ఈ విధానాన్ని వీలైనంత వరకూ తగ్గించాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌ను అనవసరంగా వినియోగించడం మానుకోవాలి. వీలైనంత సేపు వారితో గడపాలి.

– డాక్టర్ కేవీ రామిరెడ్డి, సూపరింటెండెంట్, మెంటల్ కేర్ హాస్పిటల్, వైజాగ్

బలంగా.. బడుగుల అడుగులు

నవరత్నాలతో నాలుగున్నరేళ్లలో బీసీలు ఆర్థికంగా బలోపేతం

- అత్యధిక లబ్ధిదారులు బలహీన వర్గాలవారే..
- డీబీటీ, నాన్ డీబీటీతో రూ.1.65 లక్షల కోట్లు లబ్ధి చేకూర్చిన సీఎం జగన్
- ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే
- 10.35 లక్షల మంది గృహ నిర్మాణాలకు రూ.5,972.50 కోట్లు చెల్లింపు
- వైఎస్సార్ రైతు భరోసాతో 25.64 లక్షల మంది బీసీ రైతులకు రూ.15,000 కోట్లు
- వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 30.36 లక్షల మంది బీసీ అవ్వాతాతలు, ఇతర పెన్షన్ దారులకు రూ.39,845 కోట్లు
- బాబు జమానాలో బ్యాంకు రుణాలే దిక్కు.. జగన్ పాలనలో నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే ప్రయోజనం జమ



సాక్షి, అమరావతి: బీసీలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలతో వారికి అత్యధికంగా ప్రయోజనం చేకూర్చి ముఖ్యమంత్రి జగన్ బడుగుల బంధువుగా నిలిచారు. నాలుగున్నరేళ్లలో బలహీన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేశారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా నవరత్నాల ద్వారా బీసీ లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేశారు. జనాభాలో అత్యధిక శాతం బీసీలే ఉన్నా గత ప్రభుత్వాలు ఆ మేరకు లబ్ధి చేకూర్చలేదు. దీన్ని సరిదిద్దుతూ ముఖ్యమంత్రి జగన్ అడుగులు వేశారు. నవరత్నాల లబ్ధిదారుల్లో బీసీలే అత్యధికంగా ఉండటం దీనికి నిదర్శనం.

సింహభాగం లబ్ధి

బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు... బీసీలంటే దేశానికి బ్యాక్ బోన్ అంటూ పాద యాత్రతో పాటు ఎన్నికల ముందు నిర్వహించిన బీసీ సదస్సులో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి జగన్ తు.చ. తప్పకుండా దీన్ని ఆచరించారు. బీసీలకు అన్ని రంగాల్లో తగిన వాటా కల్పించారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.1.65 లక్షల కోట్ల మేర బీసీలకు ప్రయోజనం చేకూర్చారు. నేరుగా నగదు బదిలీ ద్వారా 4.07 కోట్ల ప్రయోజనాల కింద రూ.1.15 లక్షల కోట్లు బీసీల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. నగదేతర బదిలీ ద్వారా 1.23 కోట్ల ప్రయోజనాలతో రూ.50,321.88 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే ఉండటం విశేషం. ఇందులో 10.35 లక్షల మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే రూ.5,972.50 కోట్లు బిల్లుల రూపంలో నేరుగా చెల్లింపులు చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద 25.64 లక్షల మంది బీసీ రైతులకు రూ.15,000 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 30.36 లక్షల మంది అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేతి వృత్తిదారులైన బీసీ వర్గాలకు రూ.39,845 కోట్లు సాయం అందించారు.

ప్రతి అడుగులో..

ఇన్నాళ్లకు బీసీలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో మెజార్టీ వాటా లభించింది. ఏ పథకాన్ని తెచ్చినా, ఏ నియామకాలు చేపట్టినా వారికే గరిష్టంగా మేలు జరిగేలా చర్యలు తీసుకుంది. రాజ్యాధికారంలోనూ వారికి సీఎం జగన్ పెద్ద పీట వేశారు. మంత్రివర్గంలోనే కాకుండా బీసీల్లోని వివిధ వర్గాలకు జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా వర్గాలకు నామినేటెడ్ పదవులు ఇచ్చారు. గత ప్రభుత్వంలో బీసీలకు సబ్సిడీ పథకాలపై బ్యాంకు రుణాలు మాత్రమే అందేవి. అదికూడా ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తేనే బ్యాంకులు రుణాలు మంజూరు చేసేవి. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా నవరత్నాల ద్వారా బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా ఆర్థిక, సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చింది. రాజకీయ సిఫార్సులతో పని లేకుండా వైఎస్సార్ నవశకం ద్వారా నవరత్నాల అర్హులను ప్రభుత్వం గుర్తించింది. అర్హత ఉండి కూడా ఎవరికైనా పొరపాటున లబ్ధి చేకూరకుంటే వారికి ఏడాదిలో రెండు సార్లు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి మరీ పథకాల ప్రయోజనాలను అందిస్తున్నారు.

సామాజిక మహా విప్లవానికి నాంది



దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలుగా మిగిలిపోయిన వారిని వెన్నుముక వర్గాలుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుంది. సామాజిక మహా విప్లవానికి నాంది పలికారు. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం ఒక చరిత్ర. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందుకు నడిపిస్తున్నారు. నవరత్నాలతో పారదర్శకంగా మేలు చేస్తున్నారు. ఏటా సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి పక్కాగా అమలు చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని ఉద్యమాలు జరిగినా కేంద్రం సానుకూలంగా స్పందించలేదు. సీఎం జగన్ బీసీల న్యాయమైన కోర్కెను తీర్చేందుకు సంకల్పించడం శుభ పరిణామం.

–మోర్ల మహీంధర్, వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం

ప్రైవేట్ బిల్లు ఘనత వైఎస్సార్‌సీపీదే..




అట్టడుగు వర్గాలను ఆదుకుంటూ బడుగులకు అన్ని విధాలుగా గొడుగై నిలిచి సీఎం జగన్ కొత్త ఒరవడి సృష్టించారు. అంబేద్కర్ ఆలోచనలు, జ్యోతిబా పూలే ఆశయాలను ఆచరించి చూపిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. దేశంలో బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో సైతం బలహీన వర్గాలకు జరగనంత మేలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతోంది. రాజకీయంగా, సామాజికంగానూ బీసీలకు సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. కేంద్రంలో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖతో పాటు నిధుల కేటాయింపుపై సీఎం జగన్ పార్టీ ఎంపీల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తేవటాన్ని స్వాగతిస్తున్నాం.

– చింతపల్లి గురుప్రసాద్, అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమాఖ్య

తెలంగాణ

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

- మూడు వేర్వేరు కేసుల్లో 4.59 కిలోల బంగారం స్వాధీనం
- నలుగురిని అరెస్ట్ చేసిన కస్టమ్స్ అధికారులు


పట్టుబడిన బంగారం

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో భారీ మొత్తంలో బంగారం పట్టుబడింది. మూడు వేర్వేరు కేసులలో రూ.2.91 కోట్ల విలువైన 4.59 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు హైదరాబాద్ కస్టమ్స్ విభాగం జాయింట్ కమిషనర్ వివేకానంద రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 30న దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికురాలు లోదుస్తుల్లో దాచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి 1,632 గ్రాముల బరువు ఉన్న 14 గోల్డ్ బార్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,03,63,200 ఉంటుందని తెలిపారు. అదే విధంగా డిసెంబర్ 31న ఓ ప్రయాణికుడిని తనిఖీ చేయగా 1,100 గ్రాముల బరువైన బంగారం, మరో ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి 1,865.2 గ్రాముల బంగారం పట్టుబడింది. మొత్తం కలిపి 4.59 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు.

కొత్తేడాది యాదాద్రీశుడి సన్నిధి కిటకిట

యాదగిరిగుట్ట: నూతన సంవత్సరం మొదటి రోజు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కొత్త సంవత్సరం శ్రీస్వామి వారిని దర్శించుకుంటే ఏడాదంతా అంతా మంచి జరుగుతుందనే భావనతో తెలంగాణలోని ఆయా జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు చెందిన భక్తులు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి నాలుగు గంటలు, వీఐపీ దర్శనాలకు 2 గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాలు పట్టిందని భక్తులు తెలిపారు. ఎక్కువ మంది భక్తులు కొండ కింద గల లక్ష్మీ పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేశారు. ఇక కొండపైకి, కొండ కిందకు ఉచిత బస్సుల్లో భక్తులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు కిక్కిరిసి పోయాయి. గంటల తరబడి బస్సుల కోసం భక్తులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక పట్టణ బస్టాండ్‌లో బస్సులు తక్కువ సంఖ్యలో రావడంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాధాయం రూ.76,78,268 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

మూడు విప్లవ సంస్థల విలీనం

సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీగా ఏర్పాటు

లక్డీకాపూల్(హైదరాబాద్): మూడు విప్లవ సంస్థలు ఏకమయ్యాయి. సీపీఐ(ఎంఎల్) రాంచంద్రన్ వర్గం, సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన, సీపీఐ(ఎంఎల్) క్రాంతి వర్గం కలిసి సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీగా ఏర్పడినట్టు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30, 31 తేదీల్లో నిర్వహించిన జాతీయ ప్లీనరీ సమావేశాల్లో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా మల్లెపల్లి ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. నకిరేకంటి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పలు రాజకీయ, నిర్మాణపరమైన అంశాలను సమీక్షించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తు కార్యాచరణతోపాటు పార్టీ రాజకీయ, సాహిత్య, పీడితజన గొంతు అయిన ప్రతిఘటన పత్రిక సంపాదకులుగా షేక్ షావలిని కొనసాగిస్తూ తీర్మానించినట్లు తెలిపారు.

తెలంగాణ ఏజీగా సుదర్శన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఎ.సుదర్శన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా హైకోర్టులోని ఏజీ కార్యాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏజీలు తేరా రజనీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, ఇతర ప్రభుత్వ న్యాయవాదులు హాజరయ్యారు.

మరో ఏఏజీగా ఇమ్రాన్‌ఖాన్

హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ)ని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఏఏజీగా తేరా రజనీకాంత్‌రెడ్డి నియమించిన విషయం తెలిసిందే. తాజాగా ఇమ్రాన్‌ఖాన్‌ను మరో ఏఏజీగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.



పట్టణ పేదల సొంతింటి కల సాకారం

88 పట్టణ స్థానిక సంస్థల్లో 2.62 లక్షల ఇళ్ల నిర్మాణం

సాక్షి, అమరావతి

పట్టణ పేదల కష్టాలు తీరనున్నాయి. వారి సొంతింటి కల సాకారం కాబోతోంది. ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఆధ్వర్యంలో నిర్మించిన ఇళ్లను పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే 82,080 ఇళ్లను లబ్ధిదారులకు అందజేసింది. ఈ నెల 4 నుంచి మరో 73,580 ఇళ్లను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 61,684 యూనిట్ల పంపిణీకి ముహూర్తం నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వం నిరుపేదలపై అధిక ధరలను మోపగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాటిని తొలగించింది. 1,43,600 మంది నిరుపేదలకు ఉచితంగానే ఫ్లాట్లను కేటాయించింది. మరో 1,18,616 మంది తక్కువ ఆదాయ వర్గాలకు ఆర్థిక భారాన్ని సగానికి తగ్గించి ఇళ్లను అందిస్తోంది. రాష్ట్రంలోని 88 పట్టణ స్థానిక సంస్థల (యూఎల్బీ) పరిధిలో 163 ప్రాంతాల్లో జీ+3 విధానంలో 2,62,216 టిడ్కో ఇళ్లను నిర్మిస్తుండగా ఇందులో మొదటి దశలో 1,51,298 వంద శాతం నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 31 లక్షల మంది పేద మహిళలకు ఇప్పటికే ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ 31 లక్షల ఇళ్ల స్థలాలు కాకుండా పట్టణ ప్రాంతాల్లో పేదలకు ఇస్తున్న టిడ్కో ఇళ్లు అదనం.

అన్ని మౌలిక వసతులతో లబ్ధిదారులకు..

ఇళ్లకు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు, ఎస్టీపీ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాకే ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోంది. ప్రస్తుతమున్న నగరాలు, పట్టణాలకు సమీపంలో అనువైన ప్రాంతాల్లో ఉన్న ఈ అపార్ట్‌మెంట్లు సరికొత్త పట్టణాలను తలపిస్తుండటం విశేషం. గుడివాడ, నంద్యాల, కర్నూలు, నెల్లూరు యూఎల్బీల పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఫ్లాట్లు 10 వేల నుంచి 12 వేల వరకు ఉండడం విశేషం. ఒక్క నెల్లూరు పరిధిలోనే (అల్లీపురం, వెంకటేశ్వరపురం) రెండు చోట్ల మొత్తం 27 వేల ఇళ్లు నిర్మిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలను తలపిస్తున్న 163 ప్రాంతాల్లోని నివాసాలకు 'వైఎస్సార్ జగనన్న నగరాలు'గా పేరు పెట్టారు. వీటి నిర్వహణకు నివాసితులతో సంక్షేమ సంఘాలను సైతం ఏర్పాటు చేశారు.

ఇళ్ల పేరిట పేదలపై చంద్రబాబు బండ

టిడ్కో ప్రాజెక్టులో భాగంగా గత చంద్రబాబు ప్రభుత్వం 3,13,832 ఇళ్ల నిర్మాణం తలపెట్టింది. వీటిలో 2019 మే నాటికి 1,90,944 యూనిట్లు పునాది స్థాయిని మాత్రమే దాటాయి. మరో 1,22,888 యూనిట్లు పునాదుల్లోనే మిగిలిపోయాయి. చ.అడుగు నిర్మాణ వ్యయాన్ని రూ.1,879గా నిర్ణయించడంతోపాటు 63,744 యూనిట్ల నిర్మాణానికి రూ.3,232 కోట్లు వ్యయాన్ని ఖరారు చేశారు. అయితే, ఇందులో జరిగిన అక్రమాలను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణ వ్యయాన్ని రూ.2,840 కోట్లకు తగ్గించి రూ.392 కోట్ల ప్రజాధనం ఆదా చేసింది. పేదలు 300 చ.అ. ఇంటికి బాబు ప్రభుత్వం రూ.7.5 లక్షలు భారం మోపి, 20 ఏళ్లపాటు ప్రతినెలా వాయిదాలు కట్టాలని షరతుపెట్టింది. తద్వారా ప్రతి నెలకు రూ.3,805 భారం మోపింది. ఇక 365 చ.అ. ఇంటికి రూ.50 వేలు, 430 చ.అ. ఇంటికి రూ.లక్ష చొప్పున లబ్ధిదారుల వాటా కింద వసూలు చేసింది.

లబ్ధిదారులకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్

వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక మూడు కేటగిరీల్లో 2,62,216 టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. వీటిలో 300 చ.అ. విస్తీర్ణంలో 1,43,600 యూనిట్లు, 365 చ.అ విస్తీర్ణంలో 44,304 యూనిట్లు, 430 చ.అ విస్తీర్ణంలో 74,312 యూనిట్లు ఉన్నాయి. నిరుపేదలకు కేటాయించిన 300 చ.అ. ఇంటిని రూ.1కే కేటాయించి 1,43,600 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.10,339 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చింది. 365 చ.అ ఇళ్లకు 44,304 మంది లబ్ధిదారులు రూ.50 వేలు, 430 చ.అ. ఇళ్లకు 74,312 మంది లబ్ధిదారులు రూ.లక్ష చొప్పున వాటా చెల్లించాలని గత ప్రభుత్వం నిబంధన పెడితే, దాన్ని జగన్ ప్రభుత్వం సగానికి తగ్గించింది. అంతేకాకుండా లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ.482.32 కోట్లను కూడా ప్రభుత్వమే చెల్లించింది. రెండు, మూడు కేటగిరీల్లోని లబ్ధిదారులు గత ప్రభుత్వ ధరల ప్రకారం రూ.10,797 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వ చర్యలతో ఆ మొత్తం రూ.4,590 కోట్లకు దిగివచ్చింది. మౌలిక సదుపాయాలకు సైతం గత సర్కారు కేవలం రూ.306 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. వైఎస్ జగన్ సర్కారు రూ.3,237 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. రివర్స్ టెండరింగ్‌లో చ.అడుగుకు నిర్మాణ వ్యయాన్ని రూ.1,692 తగ్గించడంతో పాటు అన్ని పనుల్లోనూ దాదాపు రూ.4,368 కోట్ల ప్రజా ధనాన్ని ఆదా చేసింది. అన్ని కేటగిరీల ఇళ్ల లబ్ధిదారులకు సేల్‌డీడ్, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, యూజర్ ఛార్జీలను మినహాయించడంతో లబ్ధిదారులు మొత్తం రూ.5,487.32 కోట్లు మేలు పొందారు.

ఇళ్ల పంపిణీ తాజా షెడ్యూల్..

- జనవరి 4న అనకాపల్లి జిల్లాలో సత్యనారాయణపురం 2,744 గృహాలు.
- 6న గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలో 1,888.
- జనవరి రెండో వారంలో మచిలీపట్నంలో 864, పెద్దాపురంలో 1,584.
- మూడో వారంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15,552, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 1,008, మదనపల్లి మున్సిపాలిటీలో 1,872, చిత్తూరు మున్సిపాలిటీలో 2,832.
- నాలుగో వారంలో విజయనగరం జిల్లా సారిపల్లిలో 352, సోనియానగర్‌లో 1,088, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 548, విశాఖ జిల్లా దబ్బందలో 1,920, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 1,248, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో 480, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 192, పలాసలో 912. రెండో దశలో 6,500 ఇళ్లను కూడా పంపిణీ చేస్తారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 800, పాలకొల్లులో 1,024, తాడేపల్లిగూడెంలో 1,124, కడపలో 9,912, విశాఖపట్నంలోని 11 ప్రాంతాల్లో 6,048.
- ఫిబ్రవరి మొదటి వారంలో పార్వతీపురం మున్సిపాలిటీలో 768 ఇళ్లు.

విదేశీ వర్సిటీలకు కొత్త నిబంధనలు

యూజీసీ కసరత్తు

- అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల రాకకు మార్గం సుగమం
- మన దేశంలో ప్రఖ్యాత వర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు
- ఆక్స్‌ఫర్డ్, మెల్‌బోర్న్, క్వీన్స్‌ల్యాండ్, టెక్సాస్, సెయింట్ పీటర్స్‌బర్గ్, ఇన్‌స్టిట్యూటో మారంగోని వర్సిటీల ఆసక్తి
- ఆర్థిక ఇబ్బందులతో విదేశాలకు వెళ్లలేని విద్యార్థులకు మేలు
- తక్కువ ట్యూషన్ ఫీజులు, మెరిట్ స్కాలర్ షిప్‌లతో లబ్ధి

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారతదేశంలో అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రపంచంలోని అత్యుత్తమవిద్యా నైపుణ్యాలను మన విద్యార్థులకు స్వదేశంలోనే అందించేలా క్యాంపస్‌లను నెలకొల్పనున్నాయి. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ 2020)లో విదేశీ విశ్వవిద్యాలయాలు నేరుగా ఇక్కడ కార్యకలాపాలు సాగించేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) త్వరలో కొత్త నిబంధనలను ప్రవేశపెట్టనుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల రాకతో దేశీయ విద్యార్థులకు తక్కువ ట్యూషన్ ఫీజుతో వరల్డ్ క్లాస్ వర్సిటీ విద్య, మెరిట్ ఆధారిత స్కాలర్ షిప్‌లు లభించనున్నాయి. ఉన్నత విద్యలో రాణించాలనే కోరిక ఉండి.. ఆర్థిక ఇబ్బందులతో విదేశాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యలో ఆరోగ్యకర పోటీ



యూఎస్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాల్లోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలైన ఆక్స్‌ఫర్డ్, మెల్‌బోర్న్, క్వీన్స్‌లాండ్, టెక్సాస్, సెయింట్ పీటర్స్‌బర్గ్, ఇన్‌స్టిట్యూటో మారంగోని వంటి విశ్వవిద్యాలయాలతో సహా వివిధ దేశాలకు చెందిన సంస్థలు ఇప్పటికే భారత్‌లో క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపించినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు దేశవిదేశాల నుంచి 200లకు పైగా సూచనలు వచ్చాయని యూజీసీ తెలిపింది. విదేశీ విశ్వవిద్యాలయాలు క్లస్టర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని సూచించాయని పేర్కొంది. ఈ క్రమంలోనే దేశంలోని భారతీయ విశ్వవిద్యాలయాల సహకారంతో విదేశీ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు డిగ్రీలు అందించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశాయని వివరించింది. దేశంలో విదేశీ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడంతో ఉన్నత విద్యలో నాణ్యత పెరుగుతుందని, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తామని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పరిశోధన, ఆవిష్కరణలపై మరింత కృషి చేయడంతో పాటు మరిన్ని ఉద్యోగావకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పరిశోధనలకు ఉత్తమ అవకాశం

వాస్తవానికి భారత్ నుంచి ఏటా 7 నుంచి 8 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తే, భారతీయ విద్యార్థులు తక్కువ ధరకు స్వదేశంలో ప్రపంచ స్థాయి విద్యను పొందే అవకాశం ఉంటుంది. చాలా మంది భారతీయ ప్రొఫెసర్లు, పరిశోధకులు ఇప్పటికే విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్త పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం, అటువంటి పరిశోధకుల సంఖ్య పరిమితంగా ఉంది. అయితే ఇక్కడ విదేశీ విశ్వవిద్యాలయాలు తమ క్యాంప్‌లను ప్రారంభించడంతో వీరి సంఖ్య పెరుగుతుందని యూజీసీ అభిప్రాయపడింది. అయితే భారతదేశంలో క్యాంపస్‌లను ఏర్పాటు చేసే విదేశీ విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి గ్రాంట్లను ఇచ్చే అవకాశం లేనట్టు తెలుస్తోంది. ప్రవేశాల ప్రక్రియ, ఫీజులపై ప్రభుత్వాల ప్రత్యక్ష జోక్యం కూడా ఉండదు. కానీ, ఫీజులు, ప్రవేశాల విషయంలో భారతీయ విద్యా వ్యవస్థ దెబ్బతినకుండా నిర్ణయించడంతో పాటు పారదర్శకంగా వ్యవహరించేలా పర్యవేక్షించనుంది.

ఆదాయానికే అగ్రతాంబూలం




యాడ్స్ ద్వారా సోషల్ మీడియా సంస్థలకు రూ.కోట్లలో ఆదాయం

గతేడాదితో పోలిస్తే 'మెటా' ఆదాయంలో 13% వృద్ధి

యువత బలహీనతలతోనే కాసుల వ్యాపారం | హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: యువత బలహీనతలు సోషల్ మీడియా సంస్థలకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రతీ విషయాన్ని ఆర్థిక కోణంలోనే చూస్తూ యూజర్ల రక్షణ, హానికర కంటెంట్‌ను అరికట్టడంలో అవి అలక్ష్యం వహిస్తున్నాయి. సోషల్ మీడియా సంస్థలు తమకు వచ్చే ప్రకటనల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికే పనిచేస్తున్నాయని హార్వర్డ్ యూనివర్సిటీలోని 'హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' అధ్యయనం వెల్లడిస్తోంది. తాజా నివేదిక ప్రకారం..2022లో అమెరికాలోని 18 ఏళ్ల లోపు యూజర్ల కేటగిరీలో ఏకంగా రూ.91,541 కోట్లను సోషల్ మీడియా సంస్థలు ఆర్జించాయి. ఇందులో 12 ఏళ్లలోపు కేటగిరీలో ఏకంగా రూ.17,476 కోట్లు ప్రకటనల రాబడి ఉండటం విశేషం. స్నాప్‌చాట్, టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా వచ్చే ప్రకటనల ఆదాయం 30–40% యువ యూజర్ల వీక్షణల ద్వారా సోషల్ మీడియా సంస్థలకు సమకూరుతోంది.

- **స్నాప్‌చాట్‌కు అధిక రాబడి:** హార్వర్డ్ వర్సిటీ బృందం అమెరికాలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్ వినియోగదారులపై పరిశోధన చేసింది. 12 ఏళ్ల లోపు యూజర్ల కేటగిరీలో ప్రకటనల ద్వారా యూట్యూబ్ రూ.7,983 కోట్లు, ఇన్‌స్టాగామ్ రూ.6,676 కోట్లు, ఫేస్‌బుక్ రూ.1,140 కోట్లను రాబట్టినట్లు నివేదిక పేర్కొంది. 13–17 ఏళ్ల లోపు యూజర్ల వినియోగంలో టిక్‌టాక్ రూ.16,644 కోట్లు, యూట్యూబ్ రూ.9,986 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించింది. మొత్తం ప్రకటనల ఆర్జనలో స్నాప్‌చాట్ 41%, టిక్‌టాక్ 35%, యూట్యూబ్ 27%, ఇన్‌స్టాగామ్ 16% వాటా ఉన్నట్లు వెల్లడించింది.
- **దేశంలోనూ గణనీయంగా వృద్ధి:** భారత్‌లో సగటు వ్యక్తి సోషల్ మీడియా వినియోగం రోజుకు 192 నిమిషాలుగా ఉన్నట్లు పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సోషల్ మీడియా దిగ్గజ సంస్థ మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్) స్థూల ప్రకటనల ఆదాయం రూ.18,308 కోట్లుగా నమోదైంది. ఇది 2022 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 13% వృద్ధి చెందింది. త్వరలోనే మెటా యాడ్ ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను ప్రారంభించే అవకాశాన్ని అన్వేషిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రెడిసీర్ నివేదిక ప్రకారం దేశంలో డిజిటల్ ప్రకటనల విలువ 2020లో రూ.24,966 కోట్ల నుంచి 2030కి రూ.2.91 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయంగా ఇన్‌స్టాగామ్ ప్రకటనల కోసం ప్రతి క్లిక్‌కి సగటున రూ.66.06 వసూలు చేస్తోంది.
- **ప్రభుత్వ జోక్యం తప్పనిసరి..:** టెక్ కంపెనీల నుంచి ఎక్కువ పారదర్శకత ఉండాలన్నా..యువత మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావాలను అరికట్టాలన్నా ప్రభుత్వ జోక్యం ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ నియంత్రణ ఉంటే చిన్నారులు, యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుని వచ్చే హానికరమైన ప్రకటన పద్ధతులను తగ్గించవచ్చని వీరు అభిప్రాయపడుతున్నారు. యువత మానసిక ఆరోగ్యానికి హాని కలిగించడం, ఇతర ఆందోళనలపై పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని అరికట్టడానికి అమెరికాలో ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చారు. మానసిక ఆరోగ్య సంక్షోభానికి కారణమైనందుకు అక్కడ రాష్ట్రాలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌పై దావాలు కూడా వేస్తున్నాయి. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ దశాబ్దాల నాటి చట్టాన్ని [illegible] 13 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగంలో పరిమితులను పాటించాలని ఆదేశించింది. భారత ప్రభుత్వం కూడా డిజిటల్, సోషల్ మీడియా నియంత్రణలపై డ్రాఫ్ట్ బిల్లును సిద్ధం చేస్తోంది.



ఏపీ విద్యుత్ సంస్థలకు ప్రతిష్టాత్మక అవార్డులు

- మూడు 'ఫాల్కన్ మీడియా–ఎనర్షియా ఫౌండేషన్' జాతీయ అవార్డులు కైవసం
- ఏపీ ట్రాన్స్‌కోకు 'టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అవార్డు
- ఉత్తమ రాష్ట్ర టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీ అవార్డు పొందిన నెడ్‌క్యాప్
- రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్‌ను చేరుకున్న ఉత్తమ రాష్ట్రంగా ఏపీ
- ఇంధన శాఖ అధికారులకు సీఎం జగన్ అభినందనలు



ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఉన్నతాధికారులు చక్రధర్‌బాబు, ఎస్.రమణారెడ్డి, బి.మల్లారెడ్డి, కుమారరెడ్డి, భాస్కర్‌లను అభినందిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థలు మరోసారి ప్రతిష్టాత్మక అవార్డులను కైవసం చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన విద్యుత్ సంస్థలకు అందించే 'ఫాల్కన్ మీడియా–ఎనర్షియా ఫౌండేషన్' జాతీయ అవార్డులను ఏకంగా మూడింటిని ఏపీ విద్యుత్ సంస్థలు పొందాయి. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీ ట్రాన్స్‌కో)కు 'టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అవార్డు లభించింది. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్ట్‌ల ప్రచారానికి సంబంధించి దేశంలోనే బెస్ట్ స్టేట్ టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అవార్డును కైవసం చేసుకుంది. రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్ (పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యత) లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ముందంజలో ఉన్న ఉత్తమ రాష్ట్రంగా ఏపీ విద్యుత్ సంస్థలను అవార్డు వరించింది. డిసెంబర్ 29వ తేదీన ముంబైలో జరిగిన '16వ ఎనర్షియా అవార్డ్స్–2023' ప్రదానోత్సవంలో ఏపీ విద్యుత్ సంస్థలకు ఈ అవార్డులను అందించారు. ఈ నేపథ్యంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసి రాష్ట్రానికి లభించిన అవార్డుల గురించి వివరించారు. ప్రతిష్టాత్మకమైన అవార్డును గెలుచుకోవడంలో కృషి చేసిన విద్యుత్ సంస్థలు, ఇంధన శాఖ అధికారులను సీఎం వైఎస్ జగన్ ఈ సందర్భంగా అభినందించారు.


దేశంలోనే అత్యుత్తమ విద్యుత్ వ్యవస్థ

ఏపీ ట్రాన్స్‌కో సాధించిన విజయాలను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు. ట్రాన్స్‌మిషన్ సిస్టం లభ్యత 99.7 శాతం (హై రెగ్యులేటరీ బెంచ్ మార్క్ 99.5 శాతం) ఉందని, ట్రాన్స్‌మిషన్ నష్టాలు 2.74 శాతానికి పరిమితమయ్యాయని తెలిపారు. దేశంలోనే అత్యంత విశ్వసనీయ స్టేట్ ట్రాన్స్‌కో, గ్రిడ్ ఆపరేటర్‌గా కూడా ఏపీ ట్రాన్స్‌కో గుర్తింపు పొందిందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేయడానికి, పునరుత్పాదక శక్తిని పెద్ద మొత్తంలో సాధించడానికి వీలు కల్పిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ పాలసీ–2020, ఏపీ పంప్డ్ స్టోరేజీ ప్రమోషన్ పాలసీ–2022, ఏపీ గ్రీన్ ఎనర్జీ అండ్ గ్రీన్ అమ్మోనియా ప్రమోషన్ పాలసీ–2023 వంటి ప్రమోషన్ పాలసీలను ఎన్ఆర్ఈడీసీఏపీ నిర్వహణలో నోటిఫై చేసిందని చెప్పారు. పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. 37 ప్రాజెక్టులకు టెక్నో–కమర్షియల్ ఫీజిబిలిటీ రిపోర్ట్స్ (టీసీఎఫ్ఆర్) తయారయ్యాయని, వేరియబుల్ రెన్యూవబుల్ ఎనర్జీ జనరేషన్‌ని బ్యాలెన్స్ చేయడానికి, గరిష్ట విద్యుత్ డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరాను అందించడానికి ఇవి ఉపయోగపడతాయని వివరించారు. మొత్తం 41,020 మెగావాట్ల సామర్థ్యంతో దశలవారీగా పీఎస్పీ ప్రాజెక్టుల స్థాపనకు నివేదికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఏపీ పవర్ సెక్టార్‌ను దేశంలోనే నంబర్–1గా నిలిపేందుకు నిరంతరం కృషిచేయాలని విద్యుత్ సంస్థలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. సీఎంను కలిసిన వారిలో ఏపీ జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎస్ చక్రధర్‌బాబు, నెడ్‌క్యాప్ వీసీ అండ్ ఎండీ ఎస్.రమణారెడ్డి, ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీ బి.మల్లారెడ్డి, ఇంధన శాఖ జాయింట్ సెక్రటరీ, ఏపీఎస్ఈసీఎం సీఈవో కుమారరెడ్డి, గ్రిడ్ డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ ఉన్నారు.

వై నాట్ 175 దిశగా మా అడుగులు


మేనిఫెస్టోను అమలు చేశాం... వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు మల్లాది, వెలంపల్లి, విజయవాడ తూర్పు సమన్వయకర్త దేవినేని అవినాశ్

సాక్షి, అమరావతి: తమ నాయకుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం సంక్షేమం–అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సోదరులతోపాటు అగ్రవర్ణ పేదలంతా తమను మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఆ పార్టీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాశ్ చెప్పారు. మేనిఫెస్టోను అమలు చేసిన తాము 2024 ఎన్నికల్లో 'వై నాట్ 175' దిశగా అడుగులేస్తున్నామని, తమపార్టీ విజయం తథ్యమని పేర్కొన్నారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ తమ టార్గెట్‌ను చేరువయ్యేందుకు కొద్దిరోజులే ఉన్నాయని.. మరోసారి తమ నాయకుడు జగనన్న ముఖ్యమంత్రి కాబోతున్నారని చెప్పారు. దీంతోపాటు ఈ రాష్ట్రానికి ఎలాంటి సంబంధం లేని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ5 నాయుడులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పబోతున్నారన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను పూర్తిచేశారని తెలిపారు. వీటిని ఇంకా ఎక్కువగా జనంలోకి తీసుకెళతామన్నారు. ఇచ్చినదానికన్నా సంతృప్తస్థాయిలో ఇస్తున్నారని, చాలా కుటుంబాల జీవితాలు మారిపోయాయని చెప్పారు. పింఛన్లు దాదాపు 66 లక్షల మందికి ఇస్తున్నట్లు తెలిపారు. ఆసరా, చేయూత, పింఛన్ ఫైనల్ ఇన్‌స్టాల్‌మెంట్ అందిస్తున్న నేపథ్యంలో వీటిపై పార్టీ యంత్రాంగం, ఎమ్మెల్యేలు, లబ్ధిదారులందరినీ భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమంలో కూడా అందరి భాగస్వామ్యం ఉండేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు.



మేనిఫెస్టోలో చెప్పింది అధికారంలోకి రాగానే అమలు చేశాం

సంక్షేమంలో వెనకడుగు వేయని సీఎం జగన్



వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పింది అధికారంలోకి రాగానే అమలు చేశామని చెప్పారు. 'చంద్రబాబు 2014లో ఇచ్చిన మేనిఫెస్టో ఏమైనా అమలు చేశారా? మహిళలకు, రైతులకు రుణమాఫీ అన్నారు.. చేశారా? బాబువస్తే జాబు.. లేదంటే రూ.2 వేల భృతి అన్నారు.. ఇచ్చారా?.. అందుకే ప్రజలు ఛీ కొట్టారు. తిరస్కరించారు. పొమ్మన్నారు. మళ్లీ ఇప్పుడు తానేదో సత్యహరిశ్చంద్రుడిని అయ్యాయని చెప్పుకొంటున్నారు..' అని విమర్శించారు. వీరి తాటాకు చప్పుళ్లకు భయపడేవారు లేరన్నారు.



వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాశ్ మాట్లాడుతూ ఎంతమంది శత్రువులు ఎదురైనా సీఎం జగన్ సంక్షేమ కార్యక్రమాల అమల్లో వెనకడుగు వేయలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎంతమంది ఏకమైనా మళ్లీ సీఎంగా జగన్ గెలుస్తారన్నారు. రాజకీయ వ్యూహాల్లో భాగంగా మార్పులు, చేర్పులు, కూర్పులు సహజమని ఎక్కడ సామాజిక సమీకరణలు ఉంటే అక్కడ పోటీచేయవచ్చన్నారు. రాజకీయ వ్యూహాల్లో భాగంగా తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా నియోజకవర్గాల్లో సామాజిక పరిస్థితుల కనుగుణంగా అభ్యర్థుల మార్పులు, చేర్పులు చేస్తున్నారని చెప్పారు. తమ పార్టీ అభ్యర్థుల్ని మార్చుకుంటే.. ఉల్లో పెట్టికి కుక్కల హడావుడి అన్నట్లు చంద్రబాబు, లోకేశ్, పవన్ హడావుడి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వాళ్లు ఎంతమంది కలిసినా, ఎంతమందిని చేర్చుకున్నా తమకు భయం లేదని చెప్పారు. ప్రజలు, సీఎం జగన్ ఒకవైపు, ప్రతిపక్షాలు మరో వైపుగా ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

పూల రంగులు మార్చేయండి

శాస్త్రవేత్తల కృషితో అందుబాటులోకి 'ఫ్లోరల్ మ్యాజిక్ టెక్నాలజీ'

- పూల నుంచి తీసిన సహజ రంగులతోనే వాటి రంగుల్ని మార్చే ప్రయోగం సక్సెస్
- కనీసం వారం రోజులపాటు మారిన రంగులోనే దర్శనం
- ప్రపంచానికి నూతన విధానాన్ని అభివృద్ధి చేసిన వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ విద్యార్థులు
- ఒకేసారి ఏక మొత్తంలో ఒకే రంగు పూలను పొందే అవకాశం • 'ఫ్లోరీ కల్చర్ ఇండస్ట్రీ'కి వరం





రంగులు అద్దిన తర్వాత వివిధ రంగుల్లో కనిపిస్తున్న తెల్ల చామంతి పూలు



రంగులు అద్దిన తర్వాత వివిధ రంగుల్లో కనిపిస్తున్న తెల్ల చామంతి పూలు

సాక్షి, అమరావతి: పెళ్లిళ్లు.. వేడుకల్లో భారీగా వినియోగించే పూలను ఒకే రంగులోకి మార్చాలంటే టింటింగ్ పద్ధతి మాత్రమే ఇప్పటివరకు అందుబాటులో ఉంది. ఈ పద్ధతిలో ఒక్కొక్క పువ్వును మాత్రమే రంగు మార్చాల్సి వస్తోంది. ఇలా చేయడం చాలా కష్టతరమైన పని. ఒకేసారి అన్ని పూల రంగును సులువుగా మార్చేందుకు ఇంతవరకు ఎలాంటి పద్ధతి కనుగొనలేదు. ప్రపంచంలోనే తొలిసారి ఈ సమస్యకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తిరుపతిలో ఉన్న ఉద్యాన పరిశోధన స్థానం ఓ చక్కని పరిష్కారాన్ని కనుగొంది. పువ్వుల నుంచి ఇంకులను తయారు చేసి.. వాటితో విలువ ఆధారిత వస్తువులను తయారు చేసేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేస్తుంటారు. ఇందులో భాగంగా పూల ఇంకులను వినియోగించి ఒకేసారి మనకు నచ్చిన రంగులో భారీ ఎత్తున పూలను ఉత్పత్తి చేసుకునే విధానాన్ని కనుగొన్నారు.

ఎలా తయారు చేస్తారంటే..

సేకరించిన పూలను మెత్తగా గ్రైండ్ చేస్తారు. ఆ తర్వాత ప్రకృతి సిద్ధంగా లభించే ద్రవ్యాలను జతచేసి మరోసారి గ్రైండింగ్ చేస్తారు. ఇలా వచ్చిన ద్రవ్యాలను వడగట్టి వాటి సహజతత్వం కోల్పోకుండా శీతలీకరణ చేయడం ద్వారా రంగు ద్రావణాన్ని తయారు చేస్తారు. ఎంపిక చేసిన తెలుపు రంగు పూలపై.. వాటిని కోసేందుకు ముందు ఆ ద్రావణాన్ని పిచికారీ చేస్తారు. స్ప్రే చేసిన వెంటనే పూల రంగు మనకు కావాల్సిన రంగులోకి సహజ సిద్ధంగా మారిపోతుంది. గంటసేపు ఆరిన తరువాత పువ్వుల్ని కోత కోసి నిల్వ చేసుకోవచ్చు. ఈ విధానంలో అతి తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో పూలను కావాల్సిన రంగులోకి మార్చుకునే వెసులుబాటు ఉంది.

ప్రయోగం ఇలా..

తిరుమల శ్రీవారి సేవకు ఉపయోగిస్తున్న పూల నుంచి తయారు చేసిన రంగులతో కోతకు సిద్ధంగా ఉన్న తెల్ల రంగు చామంతి పూలపై ప్రయోగించి ఫలితాలను రాబట్టారు. కనీసం వారం రోజుల పాటు నిల్వ ఉంటుందని గుర్తించారు. అలాగే పూర్ణిమ రకం చామంతి తోటలోని పూలపై ఇలా తయారు చేసిన పూల రంగును ప్రయోగాత్మకంగా పిచికారీ చేసి వాటి రంగు, తాజాదనాన్ని పరిశీలించారు. ఇది నూరు శాతం సహజసిద్ధంగా తయారవడంతోపాటు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ చూపలేదని గుర్తించారు. వినియోగదారుల కోరిక మేరకు అవసరమైతే వారు కోరుకున్న సువాసనల కోసం సెంట్‌ను అద్దుకునే వెసులుబాటు సైతం ఉంది. ప్రస్తుతానికి తిరుమల శ్రీవారి సేవకు ఉపయోగించే పూలను ఉచితంగా సేకరిస్తున్నారు. వాడిన పూలను కొనుగోలు చేస్తే కిలోకు సుమారుగా రూ.10 ఖర్చవుతుంది. వీటి ద్వారా ఒక లీటర్ రంగు తయారీకి రూ.20 నుంచి రూ.50 వరకు ఖర్చవుతుంది. లీటర్ ద్రావణం 15–20 మొక్కలపై పిచికారీ చేసుకోవచ్చు. ఒక ఎకరాకు 2 వేల లీటర్ల ద్రావణం అవసరమవుతుంది.

మరింత విస్తృతంగా పరిశోధనలు

జెర్బ్ బెరా (వైట్), రోజా (వైట్) ఇతర రకాల పూలపై కూడా ప్రయోగాలు చేసేందుకు ఉద్యాన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. పూల రంగులతో పెన్నుల తయారీపైనా పరిశోధనలు చేస్తున్నారు. రంగుల కోసం ప్రస్తుతం ఏ పూలను వినియోగిస్తున్నారంటే రోజా (మిరాబుల్ రెడ్), డెకరేషన్‌కు ఉపయోగించే బంతి (ఆరంజ్), చామంతి (ఎల్లో), తామర (పింక్, వైట్), ఆర్కిడ్స్ (సోనియా రకం పర్పుల్ కలర్)ను ఉపయోగిస్తున్నారు. తోటల్లోని పూలపై స్ప్రే చేసినప్పుడు వాతావరణంలో తేమను బట్టి వాటి రంగులు మారే అవకాశం ఉందని గుర్తించారు. సాఫ్ట్ ల్యాండ్ స్కేపింగ్ ఇండస్ట్రీ, ఫ్లోరిస్ట్స్–బొకే షాప్స్, ఇన్‌స్టంట్‌గా కలర్ చేంజ్ చేసి కస్టమర్ చాయిస్‌కు అనుగుణంగా బొకేట్స్‌ను ఇచ్చేందుకు ఉపయోగించవచ్చు.

చాలా ఆనందంగా ఉంది



రసాయనాలు కలపకుండా ప్రకృతిలో లభించే పూల నుంచే సహజ సిద్ధమైన రంగులను తయారు చేయవచ్చని నిరూపించాం. తద్వారా ఏక మొత్తంలో ఒకే రంగు పూలను తయారు చేసేందుకు వీలుగా నూతన సాంకేతికతను అభివృద్ధి చేయడంలో భాగస్వామి అయినందుకు చాలా ఆనందంగా ఉంది.

– జగదీశ్వరి, పీహెచ్‌డీ విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, తాడేపల్లిగూడెం

పరిశోధన విజయవంతం



పువ్వుల నుంచి ఇంకులను తయారు చేసి వాటి ద్వారా విలువ ఆధారిత వస్తువులను తయారు చేసే క్రమంలో పలువురు పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు చేసిన ఈ తరహా ప్రయోగం సక్సెస్ అయ్యింది. 10 రోజుల్లో 8 వేల లీటర్ల ద్రావణం తయారు చేశాం. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటివరకు సైడ్ ఎఫెక్ట్స్ ఏమీ లేవు. ఇతర పూల విషయంలో ఈ తరహా ప్రయోగం చేస్తే ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయేమోననే అంశంపై పరిశోధనలు జరుగుతున్నాయి. పూలకు సెంట్స్ యాడ్ చేసే విషయంలో కూడా పరిశోధనలు జరుగుతున్నాయి.

– ఆర్.నాగరాజు, ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఉద్యాన పరిశోధనా స్థానం

ఫ్లోరీ కల్చర్ ఇండస్ట్రీలో ముందడుగు

ఫ్లోరీ కల్చర్ ఇండస్ట్రీలో ఇదో గొప్ప చారిత్రాత్మక ముందడుగుగా పేర్కొనవచ్చు. ఇప్పటి వరకు ఇలా ఏక మొత్తంలో ఒక రంగు పూలను కావాల్సిన రంగులోకి మార్చుకునే సాంకేతికత ఎక్కడా లేదు. ఈ తరహా ప్రయోగం జరిగినట్టుగా జర్నల్స్‌లో కూడా ఎక్కడా లేదు. కొత్త సాంకేతికతను అభివృద్ధి చేసిన పీహెచ్‌డీ విద్యార్థిని జగదీశ్వరి బృందంకు నా అభినందనలు.

– టి.జానకీరామ్, వీసీ, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సంక్రాంతికి సింహపురి 'కోడ'ల్లుళ్లు

నెల్లూరు జిల్లా నుంచి గోదావరి జిల్లాలకు పందెం కోళ్లు

- హైవేలు, రద్దీ రోడ్ల వెంట విక్రయిస్తున్న వ్యాపారులు
- ఒక్కో పుంజు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ధర
- నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం
- ముందే బుక్కయిన హోటళ్లు

సంక్రాంతి వేళ ప్రతి ఇంటికీ అల్లుడు రావడం సహజం. కానీ.. పూర్వ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో జరిగే పందేలకు సింహపురి కోడి పుంజులు కూడా వచ్చేస్తున్నాయి. పందేల్లో పౌరుషంతో కాలు దువ్వే కాకి, నెమలి, డేగ, పచ్చకాకి, సేతువ వంటి జాతులకు చెందిన కోడి పుంజులను నెల్లూరు ప్రాంత వ్యాపారులు గోదావరి జిల్లాలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి తెచ్చిన మార్పుల్లో ఇదొకటి కావడం గమనార్హం.

సాక్షి, భీమవరం/భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతి కోడి పందేలకు గోదావరి జిల్లాల్లో ఉండే క్రేజే వేరు. పందెం పుంజులకూ డిమాండ్ భారీగానే ఉంటుంది. సాధారణంగా సంక్రాంతి పందేల కోసం స్థానికులే పెద్దఎత్తున కోడి పుంజులను పెంచి విక్రయిస్తుంటారు. కాగా.. కోవిడ్ తరువాత సింహపురి (నెల్లూరు) ప్రాంత వ్యాపారులు పందెం పుంజులను గోదావరి జిల్లాలకు తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. పండుగ రోజుల్లో పూర్వ గోదావరి జిల్లాల్లోని ప్రధాన బరుల్లో ఒక్కొక్క చోట రోజుకు 25 నుంచి 30 వరకు పందేలు జరిగితే.. గ్రామాల్లోని చిన్న బరుల్లో జరిగే పందేలకు లెక్కే ఉండదు. పండుగ మూడు రోజుల్లో వేలాదిగా జరిగే పందేలకు రెట్టింపు సంఖ్యలో కోడి పుంజులు అవసరమవుతాయి. సంక్రాంతి పందేల కోసం కోడి పుంజుల పెంపకం ద్వారా గోదావరి జిల్లాల్లో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీటి అమ్మకాల రూపంలో ఏటా రూ.12 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.



రోడ్డుపక్కన కట్టి ఉంచిన నెల్లూరు కోడి పుంజులు

కోడిపుంజు

ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి మరీ..

కోవిడ్ అనంతరం సింహపురి ప్రాంతానికి చెందిన వారు పందెం పుంజుల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. నెల్లూరు జిల్లాతోపాటు సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన నాటుకోళ్ల పెంపకందారులు, వ్యాపారులు గోదావరి జిల్లాల్లో అమ్మకాలు చేసేందుకు కోడి పుంజులతో తరలి వస్తున్నారు. ఒక్కొక్కరు 20 వరకు పుంజులతో.. నలుగురైదుగురు కలిసి ప్రత్యేక వాహనాల్లో వస్తున్నారు. విజయవాడ–కాకినాడ హైవే వెంట తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెం, పెరవలి, సిద్ధాంతం, గుండుగొలను తదితర ప్రాంతాల్లో జనసంచారం ఎక్కువగా ఉండే రద్దీ రోడ్లలో ఖాళీ ప్రదేశాల వద్ద కోడి పుంజులను ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. కాకి, నెమలి, డేగ, పచ్చకాకి, సేతువ తదితర జాతులు, వివిధ రంగుల్లో వీరి వద్ద అందుబాటులో ఉంటున్నాయి. పుంజు రంగు, ఎత్తు, బరువును బట్టి ఒక్కో పుంజు రూ.3 వేల నుంచి రూ.10 వేల ధర పలుకుతున్నాయి.

రోజుకో చోట విక్రయం

స్థానికంగా పందేల కోసం సిద్ధం చేసే పుంజుల ధర అధికంగా ఉంటోంది. వాటికి అందించే ఆహారం, శిక్షణను బట్టి ఒక్కొక్క పుంజు రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతాయి. నెల్లూరు పరిసర ప్రాంతాల నుంచి తెచ్చే పుంజులు ఇక్కడి పుంజులకు ఏమాత్రం తీసిపోని విధంగా మంచి సైజు, రంగుల్లో ఉంటున్నాయి. ఇక్కడ పెంచే పుంజులతో పోలిస్తే నెల్లూరు ప్రాంత పుంజుల ధర తక్కువగా ఉండటంతో పందేల రాయుళ్లు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. పుంజుల్ని అమ్ముతున్న చోటే డింకీ పందాలు కట్టి బాగున్న పుంజులను ఎంపిక చేసుకుని తీసుకుంటున్నారు. పందెంలో అదృష్టం కలిసొస్తే తమకు పెద్ద పండుగేనంటున్నారు. తెచ్చిన పుంజులు మూడు నాలుగు రోజుల్లో అమ్ముడవుతున్నాయని.. ఒక్కోరోజు ఒక్కోచోట అమ్మకాలు చేస్తుంటామని నెల్లూరుకు చెందిన కోళ్ల పెంపకందారుడు వెంకటరమణ తెలిపాడు. నాలుగేళ్లుగా ఏటా వస్తున్నామని, అమ్మకాలు బాగానే ఉంటున్నాయని వివరించాడు.

చాలా మంది వ్యాపారులొస్తున్నారు



గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సీజన్‌లో కోడి పుంజులకు గిరాకీ బాగుంటుంది. ఇక్కడ అమ్మకాలు చేసేందుకు మా ప్రాంతం నుంచి చాలామంది వ్యాపారులు పుంజులను తీసుకొస్తుంటారు. ఏటా సంక్రాంతి ముందు కోడి పుంజులను తెస్తున్నాను. అమ్మకాలు బాగుండి రూ.10 వేల వరకు మిగులుతాయి.

– వెంకయ్య, వ్యాపారి, నెల్లూరు

హోటళ్లు.. లాడ్జిలకు డిమాండ్

కోళ్ల కుంభమేళాగా పిలిచే సంక్రాంతి పందేలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని హోటళ్లు, లాడ్జిలకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది నవంబర్ నెల నుంచి హోటల్స్, లాడ్జి రూమ్‌ల ముందస్తు బుకింగ్ ముమ్మరంగా సాగుతోంది. బెంగళూరు, హైదరాబాద్, వరంగల్, ఏపీలోని విశాఖ, విజయవాడతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్దఎత్తున పందేలరాయుళ్లు, పందేలను వీక్షించేందుకు వివిధ వర్గాల ప్రజలు ఇక్కడకు తరలి వస్తుంటారు. దీంతో అతిథుల కోసం ఈ ప్రాంతాల వారు జిల్లాలోని హోటల్స్‌లో బస ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ దృష్ట్యా సాధారణ లాడ్జిలతోపాటు పేరొందిన హోటల్స్‌లో రూమ్‌లను జనవరి 10 నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌గా బుక్ చేస్తున్నారు. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం పట్టణాలతో పాటు ఆచంట, పెనుగొండ, అత్తిలి తదితర ప్రాంతాల్లోని హోటల్స్, లాడ్జిలలో ఇప్పటికే 70 శాతం రూమ్‌లు బుక్ అయ్యాయి. మరో వారం రోజులు గడిస్తే రూమ్‌లు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

రూమ్ రూ.5 వేల నుంచి రూ.10 వేలు

సంక్రాంతికి అడ్వాన్స్‌గా బుక్ చేసే హోటల్స్ రూమ్‌ల ధరలు ఆయా హోటల్స్ బట్టి 24 గంటలకు రూ.5 వేల నుంచి డిమాండ్ బట్టి రూ.10 వేల వరకు ఉంటోంది. ధర ఎక్కువైనా రూమ్ కచ్చితంగా ఉండాలనే ఉద్దేశంతో ముందస్తుగానే దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికోసం బుక్ చేసుకుంటున్నారు. రాజకీయ, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు దిగే డీలక్స్, సూట్ రూమ్‌లకు సైతం డిమాండ్ భారీగా పెరిగింది. పండుగ నాలుగు రోజుల ప్యాకేజీ రూపంలో అయితే రూమ్‌ను బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటోంది. 24 గంటలకు అయితే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలుకుతున్నాయి.

'పవర్' ఫుల్ యాప్స్

- రైతులకు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్ల కోసం 'రైతు నేస్తం'
- మెరుగైన సేవలే లక్ష్యంగా వాట్సాప్, చాట్‌బాట్ అప్లికేషన్లు
- ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్, లైన్ క్లియర్ అప్లికేషన్ పేరుతో ట్రాన్స్‌కో యాప్‌లు

సాక్షి, అమరావతి: పెరుగుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవుతున్నాయి. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడంలో రాజీ పడకూడదనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి తోడ్పాటు అందించేందుకు ఖర్చులను తగ్గించుకుంటూ.. మెరుగైన సేవలందిస్తున్నాయి. ఇందులో భాగంగా కొన్ని 'యాప్'లను రూపొందించి వాటిద్వారా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు, పంపిణీ, సరఫరా వ్యవస్థలను పర్యవేక్షిస్తూ నిరంతరం నియంత్రణతో ఫలితాలు సాధిస్తున్నాయి.

ట్రాన్స్‌కో సొంత అప్లికేషన్లు

ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) అంతర్గతంగా రెండు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వెబ్ ఆధారిత యాప్‌లను విద్యుత్ సంస్థల కోసం అభివృద్ధి చేసింది. స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) రూపొందించిన ఈ యాప్‌లు ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్, లైన్ క్లియర్ అప్లికేషన్ పేరుతో పనిచేస్తున్నాయి. ఇంట్రా స్టేట్ ఓపెన్ యాక్సెస్ యాప్ ద్వారా థర్మల్, సోలార్, విండ్, గ్యాస్ ప్లాంట్లు, మార్కెట్‌లో తక్కువ ధరలో అందుబాటులో ఉన్న వనరుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. 'లైన్ క్లియర్ అప్లికేషన్' అనేది సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు, ఎక్స్‌ట్రా హై టెన్షన్ మరమ్మతు పనుల్లో సహాయపడుతుంది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్)ను కూడా ఏపీ ట్రాన్స్‌కో అమలు చేస్తోంది. దీనికి విద్యుత్ టవర్లు, లైన్లు, ఎక్స్‌ట్రా హై టెన్షన్, సబ్‌స్టేషన్ల నెట్‌వర్క్‌ను అనుసంధానించింది.

పంపిణీ సంస్థల డిజిటల్ సేవలు

ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఆన్‌లైన్ డిజిటల్ పేమెంట్ యాప్‌లతో ఒప్పందం చేసుకున్నాయి. ఫలితంగా లేట్ పేమెంట్ సర్ చార్జీల బారిన పడకుండా బిల్లుల్ని క్షణాల్లో చెల్లించే వెసులుబాటు లభించింది. డిస్కంలు వాటి పేర్లతోనే సొంతంగా మొబైల్ యాప్‌లు కూడా రూపొందించుకున్నాయి. వీటిద్వారా కొత్త సర్వీసులు పొందడం, బిల్లు చెల్లింపులు వంటి సేవలు అందిస్తున్నాయి. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేయడానికి సహాయపడే అంతర్గత డిమాండ్ అంచనా నమూనా (ఇన్ హౌస్ ఎనర్జీ ఫోర్ కాస్టింగ్ మోడల్)ను డిస్కంలు వినియోగించుకుంటున్నాయి.

'మాయ' వచ్చేసింది

ఏపీ ఎస్పీడీసీఎల్ కొత్తగా రైతు నేస్తం సాఫ్ట్‌వేర్, వాట్సాప్ నంబర్ (91333 31912), 'మాయ' పేరుతో చాట్‌బాట్ అప్లికేషన్లను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చింది. మనిషి ప్రమేయం లేకుండా 'మాయ' చాట్‌బాట్ అప్లికేషన్ ద్వారా వినియోగదారుల సందేహాలకు ఆటోమేటిక్‌గా సమాధానం లభిస్తుంది. విద్యుత్ ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు అది ఏ స్థితిలో ఉందో దీనిద్వారా తెలుసుకోవచ్చు. కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌ను పొందవచ్చు. విద్యుత్ బిల్లు గురించి తెలుసుకుని చెల్లించడం ఎలాగో అడగవచ్చు. ఆరు నెలల బిల్ హిస్టరీ, కలెక్షన్ హిస్టరీ తెలుసుకోవచ్చు. విద్యుత్ సరఫరా స్థితిని కూడా 'మాయ' మనకు చెబుతుంది. ఇక్కడి నుంచే వినియోగదారుల మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అధికారుల ఫోన్ నంబర్లు తీసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా కూడా ఈ సేవలు పొందవచ్చు. కొత్త విద్యుత్ సర్వీస్ కోసం మీ సేవ, గ్రామ సచివాలయం, డిస్కం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన వెంటనే రైతుకు రిజిస్ట్రేషన్ నంబర్ మెసేజ్ రూపంలో రైతునేస్తం ద్వారా వస్తుంది. ఎస్టిమేట్ తయారీలో అధికారుల వల్ల ఎక్కడా జాప్యం జరగకుండా ఈ యాప్ చూస్తుంది. ఈ విధానం వల్ల రైతుకు 15 రోజుల్లోగానే డిమాండ్ నోటీసు, ఆ చార్జీలను చెల్లించిన 30 రోజుల్లోగానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరవుతుంది.

సేవల్లో ఆలస్యం ఉండదు

సేవల్లో ఆలస్యాన్ని నివారించేందుకు వీలుగా ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో సంస్కరణలు తీసుకువస్తోంది. అందులో భాగంగానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఏపీ ఎస్పీడీసీఎల్ తొలిసారిగా చాట్‌బాట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిద్వారా వినియోగదారులు తమ సమస్యను వెంటనే పరిష్కరించుకోవచ్చు. అలాగే రైతులు అడిగిన వెంటనే వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలనే లక్ష్యంతో రైతు నేస్తం అప్లికేషన్‌ను రూపొందించాం.

– కె.సంతోషరావు, సీఎండీ, ఏపీ ఎస్పీడీసీఎల్

అభాగ్యులను రక్షించారు

- గుజరాత్‌లో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన నలుగురు
- మతిస్థిమితం కోల్పోయి గుజరాత్ చేరుకున్న వైనం
- దిక్కుతోచని స్థితిలో ఉన్న వారిని చేరదీసిన స్వచ్ఛంద సంస్థ
- క్షేమంగా తీసుకొచ్చిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: మతిస్థిమితం కోల్పోయిన ఏపీకి చెందిన ముగ్గురితోపాటు తెలంగాణకు చెందిన మరో మహిళను గుజరాత్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ సిటీ పోలీసులకు అప్పగించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా భావిస్తున్న గోపు లక్ష్మి (48), స్వీటీ (41), నూరాల (45), తెలంగాణకు చెందిన ఐశ్వర్య (55) అనే మహిళలు మతిస్థిమితం లేనికారణంగా రోడ్లపై సంచరిస్తూ.. చివరకు గుజరాత్ చేరారు. కచర్‌భుజ్ ప్రాంతంలో దిక్కుతోచని స్థితిలో సంచరిస్తున్న వీరిని మానవ్ జ్యోత్ అనే స్వచ్ఛంద సంస్థ చేరదీసింది. తమ పేర్లు తప్ప ఇతర వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్న ఆ నలుగురూ అక్కడి ఆహారాన్ని సరిగా తీసుకోలేకపోయారు. నానాటికీ నీరసించి అనారోగ్యానికి గురవుతున్నారు. నలుగురు మహిళలు తెలుగు మాట్లాడుతున్నట్టు గుర్తించిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ నుంచి కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఫోన్ నంబర్ సేకరించారు. గత నెల 21న ఆయనకు కాల్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆయన ఆ నలుగురినీ సురక్షితంగా నగరానికి చేర్చే బాధ్యతల్ని సిటీ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. అదనపు సీపీ ఏవీ రంగనాథ్ పర్యవేక్షణలో డీసీపీ డి.కవిత గుజరాత్‌లోని మానవ్ జ్యోత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి.. ఓ ప్రత్యేక బృందాన్ని గుజరాత్ పంపారు. ఆ బృందం ఆ నలుగురినీ ఆదివారం హైదరాబాద్ తీసుకొచ్చారు. వారి ఆలనాపాలనతో పాటు వైద్యం చేయించడానికి సయోధ్యా హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ సంస్థకు ముందుకొచ్చింది. వీరిలో ఐశ్వర్య తెలంగాణకు చెందిన మహిళ కాగా, మిగిలిన ముగ్గురూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారని నగర మహిళ భద్రత విభాగం ప్రాథమికంగా గుర్తించింది. వీరి సంబంధీకులను గుర్తించి వీలైనంత త్వరగా అప్పగిస్తామని త్వరలో కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి చెప్పారు.

నెట్టింట మారీచుల భరతం పడుతున్న భారత్

సైబర్ నేరాలకు చెక్ పెడుతున్న 'ఐ4సీ'

- ఐదేళ్లలో 12.80 లక్షల సైబర్ నేరాలకు అడ్డుకట్ట • 3.80 లక్షల కేసుల్లో రూ.930 కోట్ల రికవరీ



సాక్షి, అమరావతి: అమాంతం పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో భారత్ విజయవంతమవుతోంది. సైబర్ నేరాల నిరోధానికి రాష్ట్రాల సమన్వయంతో కేంద్ర హోమ్ శాఖ నెలకొల్పిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) అత్యుత్తమ పనితీరు కనబరుస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాల కంటే మెరుగ్గా.. అంటే అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు దీటుగా సైబర్ నేరాలను కట్టడి చేస్తోంది. సైబర్ నేరాల నిరోధం కోసం కేంద్ర హోమ్ శాఖ 2018లో 'ఐ4సీ'ని నెలకొల్పింది. దీనికి అనుబంధంగా అన్ని రాష్ట్రాలు సైబర్ క్రైమ్ మానిటరింగ్ సెల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆన్‌లైన్, సైబర్ మోసాలపై సిటిజన్ పోర్టల్‌గా సైబర్ క్రైమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాయి. సైబర్ మోసాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోసానికి గురయ్యామని గుర్తించగానే ఫిర్యాదు చేసే విధానంపై పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నాయి. ఫిర్యాదులపై తక్షణం కేసుల నమోదు, సంబంధిత బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలను సంప్రదించి బ్యాంకు ఖాతాలు స్తంభింపజేయడం, నేర నిరూపణ అనంతరం బాధితులకు సంబంధిత మొత్తాన్ని ఇప్పించే చర్యలను పటిష్టంగా పర్యవేక్షిస్తోంది. సైబర్ నేరస్తుల సిమ్ కార్డులు, ఫోన్లు బ్లాక్ చేయడం, వారిని అరెస్ట్ చేయడం, న్యాయ విచారణ ప్రక్రియను కూడా సక్రమంగా కొనసాగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఐ4సీ చేపడుతున్న ఈ చర్యలు సత్ఫలితాలను అందిస్తున్నాయి.

12.80 లక్షల ఫిర్యాదులపై స్పందించి..

- 2018 సంవత్సరంలో ఐ4సీని నెలకొల్పగా.. 2023, డిసెంబర్ వరకు 12.80 లక్షల ఫిర్యాదులపై తక్షణం స్పందించి నేరాలను ముందుగానే నిరోధించింది. అంటే ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు సైబర్ ముఠాలకు బదిలీ కాకుండానే అడ్డుకట్ట వేసింది.
- మరో 3.80 లక్షల సైబర్ మోసాలపై కేసులు నమోదు చేసి విజయవంతంగా ఛేదించింది. సైబర్ మోసానికి గురైన తరువాత బాధితుల ఫిర్యాదుపై కేసులు నమోదు చేసి సమర్థంగా దర్యాప్తు పూర్తి చేసింది.
- సైబర్ ముఠాలు కొల్లగొట్టిన రూ.930 కోట్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి ఇప్పించింది.
- సైబర్ ముఠాలకు చెందిన 2.45 లక్షల సిమ్ కార్డులను బ్లాక్ చేసింది.
- ఆన్‌లైన్ మోసాల కోసం ఉపయోగించిన 42వేల మొబైల్ ఫోన్లను పనికి రాకుండా చేసింది.

ఐ4సీ లక్ష్యాలివీ

- దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు నోడల్ పాయింట్‌గా వ్యవహరించడం.
- మహిళలు, పిల్లలపై జరిగే సైబర్ నేరాలపై పోరాటాన్ని బలోపేతం చేయడం.
- సైబర్ క్రైమ్ సంబంధిత ఫిర్యాదులను సులభంగా ఫైల్ చేయడం, సైబర్ క్రైమ్ ట్రెండ్‌లు, నమూనాలను గుర్తించడం.
- సైబర్ నేరాల నివారణలో చురుకుగా వ్యవహరించడం, నేరాల గుర్తింపు కోసం లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా పని చేయడం.
- సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం.
- సైబర్ ఫోరెన్సిక్, ఇన్వెస్టిగేషన్, సైబర్ హైజీన్, సైబర్–క్రిమినాలజీ మొదలైన అంశాలలో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జ్యుడీషియల్ అధికారుల సామర్థ్యాన్ని పెంచడంలో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు సహాయం చేయడం.

సైబర్ ఫోరెన్సిక్, ట్రైనింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు

- దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సైబర్ ఫోరెన్సిక్ – ట్రైనింగ్ లేబొరేటరీలను కేంద్ర హోమ్ శాఖ నెలకొల్పింది. పోలీస్, న్యాయ, ఇతర విభాగాలకు చెందిన మొత్తం 24,600 మందికి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో శిక్షణ ఇచ్చింది.
- సైబర్ నేరాల నిరోధం కోసం దేశంలో ఏడు ప్రాంతీయ సైబర్ కో–ఆర్డినేషన్ టీమ్‌లను నెలకొల్పింది. మన రాష్ట్రంలో విశాఖపట్నంతోపాటు హైదరాబాద్, అహ్మదాబాద్, ఛండీగఢ్, గౌహతి, మేవాట్, జామ్తారాలలో వాటిని స్థాపించింది.
- ఈ టీమ్‌లు తమ పరిధిలో సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌లను గుర్తించడంతోపాటు నేరాల నిరోధం కోసం వివిధ ప్రభుత్వ ఏజెన్సీలతో సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నాయి.
- ఆన్‌లైన్‌లో మహిళల వేధింపుల నిరోధం కోసం ఐ4సీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందుకోసం సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్(సీసీపీడబ్ల్యూసీ)ని నెలకొల్పింది.

గెలుపు దారి

ప్రకృతి ఇచ్చిన ప్రేమ కానుక





● రిన్‌జింగ్

పెద్ద నగరాలలో పెద్ద ఉద్యోగం చేస్తున్నప్పటికీ రిన్‌జింగ్ భూటియా మనసులో ఏదో లోటు ఉండేది. విశాలమైన ప్రకృతి ప్రపంచంలో పుట్టి పెరిగిన రిన్‌జింగ్ రణగొణ ధ్వనులకు దూరంగా తన మూలాలను వెదుక్కుంటూ సిక్కిం వెళ్లింది. హిమాలయాలలోని అరుదైన మొక్కలతో తయారు చేసే స్కిన్‌కేర్ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన 'అగాపి సిక్కిం' స్టార్టప్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించింది. సొంత కాళ్ల మీద నిలబడడానికి పునరావాస కేంద్రాల్లోని మహిళల కోసం ఉచిత వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

సిక్కింలోని అద్భుతమైన ప్రకృతి అందాల మధ్య పుట్టి పెరిగిన రిన్‌జింగ్ వృత్తిరీత్యా దిల్లీ, బెంగళూరు, కోల్‌కత్తాలాంటి మహానగరాల్లో గడిపింది. ఆర్థిక సమస్యలు లేనప్పటికీ ఏదో లోటుగా అనిపించేది. ప్రకృతి మధ్య తాను గడిపిన కాలాన్ని గుర్తు చేసుకునేది. మరో ఆలోచన లేకుండా ఉద్యోగానికి రాజీనామా చేసి సిక్కిం బాట పట్టింది.

ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనే రిన్‌జింగ్ చిరకాల కల అక్కడ రెక్కలు విప్పుకుంది.

'ఉద్యోగ జీవితానికి సంబంధించి ఏ లోటు లేకపోయినప్పటికీ పెద్ద నగరాలలో కాలుష్యం, ఇరుకు ప్రదేశాలలో నివసించాల్సి రావడంతో బాగా విసుగెత్తిపోయాను. నా బిడ్డ పచ్చని ప్రకృతి ప్రపంచంలో పెరగాలనుకున్నాను. అందుకే వెనక్కి వచ్చేశాను' అంటుంది రిన్‌జింగ్.

ఉద్యోగం లేదు కాబట్టి బోలెడంత ఖాళీ సమయాన్ని చర్మ సంరక్షణకు సంబంధించిన పరిశోధనకు కేటాయించింది. ప్రకృతిలోని ఎన్నో వనమూలికల గురించి లోతుగా అధ్యయనం చేసింది. హిమాలయాలలో లభించే అరుదైన మొక్కలతో హ్యాండ్ క్రాఫ్టెడ్ స్కిన్‌కేర్ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన 'అగాపి సిక్కిం' అనే అంకుర సంస్థను ఆరంభించింది. 'అగాపి' అనేది గ్రీకు పదం. దీని అర్థం... ప్రేమ.

సిక్కింలోని అనేక ప్రాంతాలలో చర్మవ్యాధులకు ఔషధంగా తమ చుట్టుపక్కల ఉండే మొక్కలను ఉపయోగించడం అనేది తరతరాలుగా జరుగుతోంది. ఈ సంప్రదాయమే తనకొక దారి చూపింది. చర్మవ్యాధులను తగ్గించే ఎన్నో ఔషధాల వాడకం పరంపరగా వస్తున్నప్పటికీ వాటి గురించి స్కిన్‌కేర్ ఇండస్ట్రీకి తెలియదు.

బిజినెస్ మోడల్‌ను డిజైనింగ్ చేసుకున్న తరువాత కబీ అనే ప్రాంతంలో తొలిసారిగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించింది రిన్‌జింగ్. ఇరవైమందికి పైగా మహిళలు హాజరయ్యారు. ఈ ఉత్సాహంతో మరిన్ని ప్రాంతాలలో మరిన్ని ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించింది. 'మా వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్న పది మందికి పైగా మహిళలు సొంత ప్రాజెక్ట్‌లు మొదలు పెట్టడం సంతోషంగా అనిపించింది. ఏదో సాధించాలనే పట్టుదల వారిలో కనిపించింది. వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాను' అంటుంది రిన్‌జింగ్. మాదక ద్రవ్యాలు, మద్యవ్యసనంతో శిథిలం అవుతున్న వారికి ఆ వ్యసనాల నుంచి బయటకు తీసుకువచ్చే సాధనంగా వర్క్‌షాప్‌లను ఉపయోగించుకుంటోంది రిన్‌జింగ్.

పునరావాస కేంద్రాల్లో కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. మాస్కులు, షాంపులు, స్క్రబ్‌లు, ఫేషియల్ ఆయిల్... మొదలైనవి ఎన్నో ఉత్పత్తి చేస్తుంది అగాపి సిక్కిం.

స్థానిక రకాల కలబంద, జనపనార... మొదలైన వాటిని తమ ఉత్పత్తులకు ముడిసరుకుగా ఉపయోగించుకుంటోంది. మొదట సిక్కిం చుట్టుపక్కల నగరాలలో ప్రాడక్ట్స్‌ను విక్రయించేవారు. ఆ తరువాత బెంగళూరు, కోల్‌కతాతో పాటు దేశంలోని ఎన్నో ప్రాంతాలకు మార్కెట్ విస్తరించింది.

'అగాపి' చెప్పుకోదగిన బ్రాండ్‌గా ఎదిగినప్పటికీ 'ఇక చాలు' అనుకోవడం లేదు రిన్‌జింగ్. స్కిన్ కేర్ సైన్స్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు తన పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. ఇంగ్లాండ్‌లోని 'ఫార్ములా బొటానికా'కు సంబంధించి ఆన్‌లైన్ కోర్సులు చేస్తోంది.



● వర్క్‌షాప్ నిర్వహిస్తూ...

ప్రాచీన ఔషధాలపై కొత్త వెలుగు

ప్రాచీన కాలం నుంచి వాడుకలో ఉన్న సంప్రదాయ ఔషధాలు వెలుగు చూసేలా, ప్రపంచానికి తెలిసేలా కృషి చేస్తోంది రిన్‌జింగ్. తాను కంపెనీ స్థాపించడమే కాదు ఇతరులు కూడా స్థాపించేలా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది. 'ఇక్కడ అడుగు పెట్టడానికి ముందు ఎన్నో ప్రశ్నలు ఉండేవి. ఇప్పుడు వాటికి సమాధానం దొరికింది. అగాపి విజయం నాకు ఎంతో ఉత్సాహం ఇచ్చింది' అంటుంది రిన్‌జింగ్ భూటియా.



నేడు ప్రపంచ అంతర్ముఖ దినోత్సవం

అన్నీ మనసులోనే ఉంచుకుంటున్నారా?

అంతర్ముఖుల శక్తి వారి నిశ్శబ్దంలోనే ఉంటుంది. కాని అదే వారి బలహీనత కూడా కావచ్చు. అంతర్ముఖత్వం వల్ల కచ్చితంగా చెప్పాల్సినవి చెప్పకపోవచ్చు. మనసులో ఏముందో ఎదుటివారికి తెలియకపోవడం వల్ల అనుకోని సమస్యలు రావచ్చు. అంతర్ముఖులుగా ఉన్న స్త్రీలు తమ కుటుంబ, ఉద్యోగ, సామాజిక జీవనంలో ఎలా మెలగాలో తెలుసుకుందాం.

కొందరు అన్నింటికీ స్పందిస్తారు. కొందరు మౌనంగా ఉంటారు. కొందరిని చూసి ఇతరులు 'వాళ్ల మనసులో ఏమీ దాచుకోరు' అంటారు. మరికొందరిని చూసి 'వీళ్ల మనసులో ఏముందో తెలుసుకోలేము' అంటారు. బహిర్ముఖులదే (ఎక్స్‌ట్రావర్ట్స్) ఈ లోకం అని ఎక్కువ మంది విశ్వాసం. ఎందుకంటే తప్పో ఒప్పో ఏదో ఒకటి మాట్లాడి నలుగురి దృష్టిని ఆకర్షించేవాళ్లే గెలుపు సాధిస్తారని ఎక్కువమంది అభిప్రాయం. అలా కాకుండా కేవలం తమ పని ఏదో తాము చేసుకుంటూ అవసరమైతే తప్ప తమ అభిప్రాయాలను వెల్లడించని అంతర్ముఖులు (ఇంట్రోవర్ట్స్) సాధించే విజయాలు తక్కువ కాదు. ఇవాళ (జనవరి 2) ప్రపంచ అంతర్ముఖుల దినోత్సవం.

మీరు అంతర్ముఖులా?

ఎలా తెలుస్తుంది. ఈ ప్రశ్నలకు 'అవును'/'కాదు'లలో ఏది చెప్పగలరో చూడండి.

1. మీరు గుంపులో ఉండటానికి ఇష్టపడరా?
2. చాడీలు, పుకార్లు కాకుండా మీకు ఇష్టమైన అంశం గురించే మాట్లాడటానికి ఇష్టపడతారా?
3. మీ చిన్నప్పుడు బంధువులొచ్చినా, ఫంక్షన్ల సమయంలో ఎక్కువగా మీరెక్కడున్నారో తెలియనట్టు మసలేవారా?
4. అప్పుడప్పుడు ఒంటరిగా మీ ఆలోచనల్లో మీరుండాలనిపిస్తుందా?
5. మీకు తక్కువగా, మృదువుగా మాట్లాడే మనిషి అనే పేరుందా?

వీటి జవాబులు 'అవును' అయితే మీరు ఇంట్రావర్ట్ కిందే లెక్క. అయితే మానసిక నిపుణుల ప్రకారం ఎవరూ పూర్తిగా అంతర్ముఖత్వంతో, పూర్తిగా బహిర్ముఖత్వంతో ఉండరు. ఇరు స్వభావాలూ అందరిలో ఉంటాయి. అయితే ఒకటి ఎక్కువ పాళ్లల్లో ఉంటుంది. అంతర్ముఖత్వం ఎక్కువ పాళ్లల్లో ఉంటే మీరు అంతర్ముఖుల కిందే లెక్క.

ఇవీ ప్లస్ పాయింట్స్

అంతర్ముఖులు తమ లోపలి నుంచి తాము శక్తిని పొందుతారు. వీరు ఎప్పుడూ తమ మనోభావాలను, ఆలోచనలను గమనించుకుంటూ ఉంటారు. నడిచి వచ్చిన దారిని బేరీజు వేసుకుని సరి చేసుకుంటూ ఉంటారు. ఒక పని మీద లక్ష్యం ఉంటుంది. చాలామటుకు నిరుపయోగమైన పనుల్లో కాలం వృథా చేయరు.

మైనస్ పాయింట్స్

ఏ పనైనా సమర్థంగా చేయగలిగే శక్తి, నైపుణ్యం, ప్రతిభా ఉన్నా అది చేతలతో మాత్రమే చూపుతారు. మాటల వల్ల తెలియచేసి ముందుగా అవకాశం దొరకబుచ్చుకోరు. ఒకరిని పొగడటం, ఒకరితో పొగడ్త వినడం వీరికి దాదాపుగా రాదు. గుంపులను ఇష్టపడరు. వీరి నిశ్శబ్దాన్ని ఎదుటివారు పొగరుగా, నిర్లక్ష్యంగా భావించవచ్చు. నలుగురినీ తమ మాటలతో ఆకర్షించే ఎక్స్‌ట్రావర్ట్స్‌ను చూసి, వీరు అలా ఉండకపోవడం లోపమేమో అని బాధపడవచ్చు.

స్త్రీలు ఇంట్రోవర్ట్స్ అయినప్పుడు

ప్రపంచంలో బహిర్ముఖులు ఎంతమందో అంతర్ముఖులు అంతమంది ఉంటారు. అమ్మాయిలు తమ బాల్యంలో ఇంట్రోవర్ట్‌లుగా ఉంటే వీరికి తక్కువమంది స్నేహితులయ్యే అవకాశం ఉంది. తల్లితో, తోబుట్టువులతో తప్ప ఎక్కువమందితో మాట్లాడకపోవచ్చు. కాలేజీలో ఇలాంటి వారు కాలేజీలో ఉన్నారా లేరా అన్నట్టుగా ఉంటారు. ఉద్యోగాల్లో వీరు చెప్పిన పని చేసుకునిపోయే వారవుతారు. గృహిణిగా ఎక్కువ మౌనంతో, తక్కువ మాటలతో సంసారాన్ని నిర్వహిస్తారు. అయితే వీటివల్ల ఏ నష్టమూ లేకపోయినా అనేక విషయాలు వీరికి నచ్చనప్పుడు మౌనాన్ని ఆశ్రయిస్తారు. వారు ఎందుకు మౌనాన్ని ఆశ్రయించారో ఎదుటివారికి తెలియక సతమతమయ్యే స్థితి ఉంటుంది. కుటుంబ పరంగా, వృత్తిగతంగా, పిల్లల భవిష్యత్తు విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు వీరి నిర్ణయం బాగా ఆలస్యమయ్యి లేదా వెంటనే తేలక చిక్కులు రావచ్చు.

ఏం చేయాలి?

సుసాన్ కెయిన్ అనే అమెరికన్ రచయిత్రి 'క్వైట్: పవర్ ఆఫ్ ఇంట్రావర్ట్' అనే పుస్తకం రాసింది. అంతర్ముఖుల మౌనంలోనే వారి శక్తి ఉంటుంది. అదే సమయంలో భర్తతో/పిల్లలతో/ ఆఫీసు పరివారంతో కచ్చితమైన అభిప్రాయాలు వెల్లడి చేయాల్సి వచ్చినప్పుడు తప్పక వెల్లడి చేయాలి. ఇంట్లో కాసేపు ఒంటరిగా ఉండాలనిపించినప్పుడు 'అలక/కోపం' అనే భావన ఇతరులకు కలగకుండా 'కాసేపు పుస్తకం చదువుకుంటాను' అని చెప్పి ఏదో ఒక పుస్తకం పట్టుకుని గదిలో మీ ఆలోచనల్లో మీరు నిమగ్నం కావచ్చు. కుటుంబ సభ్యులు అందరూ కూడినప్పుడు మీరు తక్కువ మాట్లాడినా పూర్తి సమయం వారి సమక్షంలో ఉండేలా చూసుకోవాలి.

● ముగ్గు-ముచ్చట






బొడ్డు ఝాన్సీ
చౌటుప్పల్, యాదాద్రి, భువనగిరి జిల్లా

17 చుక్కలు
మధ్య చుక్క, 8 వచ్చేవరకు



పి. హారతి
సూళ్ళూరుపేట, తిరుపతి జిల్లా

13 చుక్కలు
3 వరుసలు, 3 వచ్చేవరకు





● పిజెటిఎస్‌ఎయులో అగ్రిహబ్ ఆధ్వర్యంలో సౌర ఫలకాల కింద కూరగాయ పంటల ప్రయోగాత్మక సాగు

సాగుబడి

పూర్వాషాడ కార్తె: జనవరి 10 వరకు
ఉత్తరాషాడ కార్తె: 11 నుంచి

ఆవిష్కర్తలకు ఆత్మీయ దిక్సూచి!

- అర్బన్, గ్రామీణ ఆవిష్కర్తలకు దిక్సూచిగా నిలుస్తున్న అగ్రిహబ్ ఫౌండేషన్
- స్టార్టప్‌ల ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో పరీక్షించి, వాటి ప్రయోజకత్వాన్ని నిర్ధారించే ఏర్పాటు
- ఆవిష్కర్తలు పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా అగ్రిహబ్ తోడ్పడుతోంది..

వ్యవసాయం రైతులకు గిట్టుబాటు కావాలంటే పనిసౌలభ్యంతో పాటు ఉత్పత్తి ఖర్చులు తగ్గించే యాంత్రీకరణ అత్యవసరం. ఆవిష్కరణలను సాంకేతికంగా, ఆర్థికంగా ప్రోత్సహించినప్పుడే వినూత్న యంత్రాలు రైతులకు అందుబాటులోకి వస్తాయి. అందుకు ఇంక్యుబేషన్ కేంద్రాలు దోహదం చేస్తాయి. అటువంటి కేంద్రాల్లో విలక్షణమైనది హైదరాబాద్ పిజెటిఎస్ఎయు ఆవరణలో కొలువుదీరిన అగ్రిహబ్ ఫౌండేషన్. టెక్నీషియన్ల నుంచి గ్రామీణుల వరకు ఎవరైనా అగ్రిహబ్ సేవలను అందుకోవచ్చు.

అగ్రిహబ్.. వ్యవసాయం, ఆహార సంబంధమైన అనుబంధ రంగాల్లో ఇటు సాంకేతిక నిపుణుల ఆవిష్కరణలకు, అటు గ్రామీణ ఆవిష్కర్తలకు మార్గదర్శిగా నిలుస్తున్న సంస్థ. రెండు అంచెల వ్యవస్థగా పనిచేస్తున్న తొలి అగ్రి ఇంక్యుబేటర్ కావటం దీని ప్రత్యేకత. అంతేకాదు, అగ్రిటెక్ స్టార్టప్‌ల ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో పరీక్షించి, వాటి యోగ్యతను నిర్ధారించే విలక్షణ వేదిక అగ్రిహబ్. పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకోవటంలోనూ ఆవిష్కర్తలకు చేదోడుగా నిలుస్తోంది. అర్హులైన ఆవిష్కర్తలకు నాబార్డు గ్రాంట్‌కు సిఫారసు చేస్తోంది. కొన్ని స్టార్టప్‌ల ఆవిష్కరణల్లో ఈక్విటీ ఫండింగ్ సమకూర్చుతోంది.

ఆలోచనతో వస్తే చాలు..

సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు వ్యవసాయం, ఆహారోత్పత్తులకు సంబంధించి వినూత్న ఆలోచనతో వస్తే.. ఆ ఆలోచనను ఆచరణాత్మక ఆవిష్కరణగా తీర్చిదిద్దటానికి ఇంక్యుబేషన్ సేవలందిస్తున్నామని అగ్రిహబ్ ఫౌండేషన్ సీఈవో, డైరెక్టర్ విజయ్ నడిమింటి 'సాక్షి సాగుబడి'తో మాట్లాడుతూ చెప్పారు. ఆవిష్కర్తలకు ధింకర్స్‌కు తోడ్పాటునందించింది. 25 స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం నెరపింది. 8 స్టార్టప్‌లు రూపొందించిన డ్రోన్లు, రోబోలు వంటి సాంకేతికతలను క్షేత్రస్థాయిలో వాలిడేట్ చేసింది. గ్రాంట్లు పొందటానికి నలుగురు ఆవిష్కర్తలకు తోడ్పడింది. 8 స్టార్టప్‌లకు ఈక్విటీ ఫండింగ్ అందించింది అగ్రిహబ్.



● అగ్రిహబ్ సీఈవో విజయ్

ప్రయోగాత్మకంగా సోలార్ సేద్యం!

రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపకరించే అగ్రిటెక్ స్టార్టప్‌ల సాంకేతికతలను పొలాల్లో వినియోగించి, వాటి ప్రయోజకత్వాన్ని ధృవీకరించటం అగ్రిహబ్ ప్రత్యేకత. ఇప్పటికి 8 సాంకేతికతలను వాలిడేట్ చేశారు. ఈ క్రమంలో.. అగ్రి ఫొటో ఓల్టాయిక్ (ఎపివి) సిస్టం వాలిడేషన్ ప్రక్రియ అగ్రిహబ్‌లో గత రబీ కాలం నుంచి కొనసాగుతోంది. పొలాల్లో పంటల సాగుతో పాటే ఏకకాలంలో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసే ఈ పద్ధతిని అగ్రివోల్టాయిక్స్ లేదా సోలార్ సేద్యంగా చెప్పుకోవచ్చు. సౌర కాంతిని పంటల సాగుతో పాటు విద్యుత్తు ఉత్పత్తికి కూడా వాడుకోవటం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడానికి ఆస్కారం ఉంది. అయితే, సాధారణ సోలార్ ఫలకాల నీడ కింద పంటలు పెరగవు. అందుకే వాటిని బంజరు భూముల్లోనో, కాలువల మీదనో పెడుతున్నారు. పంట పొలాల్లో కూడా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవాలంటే సౌర ఫలకాలు ఎండను కిందికి ప్రసరింపజేసేలా పారదర్శకమైనవై ఉండాలి. ఇటువంటి వినూత్న ఫలకాలనే రూపొందించింది బెంగళూరుకు చెందిన స్టార్టప్ సంస్థ రెన్‌బ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ ఫలకాలను వినియోగించి అగ్రిహబ్ ద్వారా పిజెటిఎస్ఎయులోని వాటర్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ డా. అవిల్ కుమార్ పర్యవేక్షణలో గత ఏడాది (2022-23) రబీ కాలం నుంచి పంటలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. క్యాబేజి, బ్రోకలి, కాళీఫ్లవర్, క్యారట్, చెట్టుచిక్కుడు, వేరుశనగ, మిరప వంటి సుమారు 15 రకాల పంటలను 65 వాట్ల సామర్థ్యం గల 40 సోలార్ ప్యానళ్ల కింద 300 చ.మీ. విస్తీర్ణంలో గత నవంబర్ నుంచి పలు పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటికి రబీ, ఖరీఫ్ పంటలు సాగు చేశారు. మళ్లీ రబీ పంటలు ఇటీవలే వేశారు. 'రెన్‌బ్యాక్ సోలార్ ప్యానల్స్ నుంచి ప్రసరించే సూర్యరశ్మిలో 70% వరకు నేల మీద పంటలపై పడుతోంది. సాధారణ సోలార్ ప్యానళ్ల కన్నా ఈ ప్యానళ్ల ద్వారా 10-12% అదనంగా విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. ఈ ప్యానళ్ల కింద సాగైన క్యారట్ పంట దిగుబడి ఏమీ తగ్గలేదు. వేరుశనగ వంటి పంటల్లో కొంచెం తగ్గింది. నీటి వినియోగంలో మార్పు లేదు. అయితే, మరికొన్ని పంటకాలాలు పండించిన తర్వాత ఏయే పంటలకు ఈ సోలార్ సేద్యం అనుకూలమో తెలుస్తుంది' అన్నారు డా. అవిల్ కుమార్(99513 35111).

పేటెంట్లకూ తోడ్పడుతున్నాం!

ఎంటర్‌ప్రెన్యూర్లు, శాస్త్రవేత్తల అగ్రిటెక్ స్టార్టప్‌లతో పాటు రైతులు, గ్రామీణుల ఆవిష్కరణలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్న ఏకైక ఇంక్యుబేషన్ సంస్థ అగ్రిహబ్ ఒక్కటే. సాంకేతిక ఆవిష్కరణలతో పాటు రైతుల వంగడాలకు కూడా పేటెంట్లు పొందేందుకు మేం తోడ్పడుతున్నాం. ఇన్నోవేటర్ల తరఫున ఇప్పటికి మొత్తం 13 పేటెంట్లకు దరఖాస్తు చేశాం.

– డా. కల్పనా శాస్త్రి, మేనేజింగ్ డైరెక్టర్, అగ్రిహబ్ ఫౌండేషన్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్





● డ్రోన్



● అగ్రిబోట్

రణలపై మేధోహక్కులకు పేటెంట్ హక్కులు పొందటానికి కూడా అగ్రిహబ్ తోడ్పడుతుంది. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన వారైనా ఈ సేవలు అందుకోవచ్చు. ఇప్పటి వరకు 350కి పైగా స్టార్టప్‌లకు అగ్రిహబ్ సేవలందించింది. 825 డిజైన్

గ్రామీణులకు ప్రత్యేకం..

గ్రామీణ ఆవిష్కర్తలకు ఇంక్యుబేషన్ సేవలందించటం కోసం జగిత్యాల, వరంగల్, వికారాబాద్‌లలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో అగ్రిహబ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని గ్రామీణ యువత, రైతులు, ఎఫ్‌పిఓలు, కోఆపరేటివ్‌ల నిర్వాహకులు తమ కలలను అగ్రిహబ్ తోడ్పాటుతో సాకారం చేసుకోవటానికి ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని అగ్రిహబ్ ఎండీ డా. కల్పనా శాస్త్రి తెలిపారు.

ceo@ag-hub.co
040 - 23014515

- విత్తనోత్పత్తి కోసం బీటీ హైబ్రిడ్ పత్తి పండిస్తున్న రైతు
- మిచాంగ్ తుపానుకు పడిపోయి.. తిరిగి నిలదొక్కుకుంది!
- మొక్కకు వంద కాయలు.. మూడెకరాల్లో 30 క్వింటాళ్ల పత్తి దిగుబడి, రూ. 7 లక్షల నికరాదాయం

విరగ్గాసిన సేంద్రియ పత్తి!

రసాయన మందులేమీ వాడకుండా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో బీటీ హైబ్రిడ్ సీడ్ పత్తిని సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు రైతు ఏకుల లక్ష్మీనారాయణ. వ్యవసాయమే జీవనంగా బతుకుబండిని నడిపిస్తున్న లక్ష్మీనారాయణ తనకు కౌలుకు ఇచ్చిన భూ యజమాని కోటగిరి చైతన్య సూచనల మేరకు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో బీటీ హైబ్రిడ్ విత్తన పత్తిని రెండేళ్లుగా సమర్థవంతంగా చేస్తూ విశేషమైన దిగుబడులతో పాటు అధిక నికరాదాయం పొందుతున్నారు.

లక్ష్మీనారాయణది ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట. శివారు గ్రామమైన సీతారామపురంలో కోటగిరి చైతన్య మామిడి తోటకు పక్కనే ఉన్న మూడెకరాల ఎర్ర నేలను కౌలుకు తీసుకొని విత్తన పత్తిని రెండేళ్లుగా సాగు చేస్తున్నారు. ఒక ఎకరానికి డ్రిప్ వేశారు. రెండెకరాలకు నీటిని పారగడుతున్నారు. 120 రోజుల దశలో ఉన్న పత్తి మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎదుగుతూ ఇంకా కొత్త చిగుర్లు వేస్తున్నాయి. మొక్కకు 90 నుంచి 110 వరకు కాయలతో చూపరులను ఆశ్చర్యపరుస్తున్నాయి. తనకు దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున మూడెకరాలకు రూ.60 వేలకు కౌలుకు తీసుకొని విత్తన పత్తిని సాగు చేస్తున్నారు.



● పత్తి పంటను ఇటీవల పరిశీలిస్తున్న దేవేంద్ర శర్మ

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న చైతన్య కరోనా కాలంలో ఇంటి దగ్గర ఉన్న కాలంలో సేంద్రియ సాగులో మెళకువలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. ఇప్పుడు బెంగళూరు తిరిగి వెళ్లినా అక్కడి నుంచే లక్ష్మీనారాయణకు సూచనలిస్తూ పత్తి సాగు చేయిస్తున్నారు. ఆవు పేడతో జీవామృతం, అనేక రకాల జీవన ఎరువులు కలిపి మగ్గబెట్టి ప్రత్యేకంగా రూపొందించిన ఎన్‌రిచ్డ్ కంపోస్టును మూడెకరాల్లో దుక్కి 3 టన్నులు వేశారు. పత్తి విత్తిన 20 రోజులకు మరో 3 టన్నుల కంపోస్టును మొక్కల మొదళ్ల వద్ద వేశారు. లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలతో సమీకృత చీడపీడల యాజమాన్య మెళకువలు పూర్తిగా పాటిస్తున్నారు. పంచగవ్య, పుల్లటి మజ్జిగతో పాటు అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తదితర కషాయాలను విడతల వారీగా లక్ష్మీనారాయణ సొంతంగా తయారు చేసుకుంటూ ఐదు రోజులకోసారి ఏదో ఒకటి అవసరాన్ని బట్టి పిచికారీ చేస్తున్నారు. దీంతో పత్తి మొక్కలు విత్తి 120 రోజులు అయినప్పటికీ ఇంకా బలంగా ఎదుగుతున్నాయి. అంతేగాకుండా ఒక్కొక్క చెట్టుకు కాయలు కూడా అధిక సంఖ్యలో వచ్చాయి.

3 ఎకరాల్లో విత్తన పత్తి సాగు: రూ. 7 లక్షల నికరాదాయం!

3 ఎకరాల పొలంలో విత్తన పత్తి క్రాసింగ్ కోసం అరెకరంలో పోతు (మగ) మొక్కల్ని పెంచుతున్నాను. అంటే.. నికరంగా 2.5 ఎకరాల్లోనే పత్తి పంట ఉన్నట్లు లెక్క. చెట్టుకు సగటున 90-100 కాయలున్నాయి. మొదటి విడత పత్తి తీశాం. మరో మూడుసార్లు తీస్తాం. ఎకరానికి 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటున్నాం. కనీసం 30 క్వింటాళ్ల సీడ్ పత్తి వస్తుందనుకున్నా.. 18 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, 12 క్వింటాళ్ల దూది వస్తుంది. విత్తనాలు క్వింటా రూ. 53,000, దూది క్వింటా రూ. 14,000కు అమ్ముతా. మొత్తం మీద రూ. 4.5 లక్షల ఖర్చులు పోగా నికరాదాయం రూ. 7 లక్షలకు తగ్గదు. తుపాను దెబ్బకు కొన్ని కాయలు పాడవ్వకపోతే మరో రూ. లక్ష అదనంగా వచ్చి ఉండేది.

– ఏకుల లక్ష్మీనారాయణ (95509 84667), అన్నేరావుపేట, రెడ్డిగూడెం మండలం, ఎన్టీఆర్ జిల్లా





● మిచాంగ్ తుపాను గాలులకు నేలకొరిగిన లక్ష్మీనారాయణ పత్తి పంట (ఫైల్)

నేలకొరిగినా తిప్పుకుంది!

డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుపానుకు మూడెకరాల్లోని పత్తి పంటంతా నేల వాలింది. దీంతో రైతు లక్ష్మీనారాయణ తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఏదైతే అది అవుతుందని.. పడిపోయిన మొక్కలను కూలీలతో లేపి నించోబెట్టి మొదళ్లలో మట్టిని వేయించారు. ఆ తర్వాత రెండు రోజులకే తోటంతా ఆశ్చర్యకరంగా నిలదొక్కుకుంది. వానపాములు నేలను గుల్లగా ఉంచటం, వేరు వ్యవస్థ బలంగా, లోతుగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని రైతు చెప్పారు. ఎంతో ఆరోగ్యంగా పెరుగుతున్న ఈ పంటను ఇటీవల పరిశీలించిన ప్రసిద్ధ వ్యవసాయ నిపుణులు దేవేంద్ర శర్మ, డా. జీవీ రామాంజనేయులు, పాలాది మోహనయ్య తదితరులు లక్ష్మీనారాయణ కృషిని ప్రశంసించారు. ఇతర రైతులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు.

– ఉమ్మా రవీంద్ర కుమార్ రెడ్డి, సాక్షి, నూజివీడు



ఆంక్షల ఫలితం... బిగ్‌బాష్ లీగ్‌కు ముజీబ్ దూరం

జాతీయ జట్టుకు తొలి ప్రాధాన్యత ఇవ్వకుండా ఫ్రాంచైజీ టి20 లీగ్‌లవైపు మొగ్గుచూపుతున్న తమ దేశ క్రికెటర్లు ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫజల్‌హక్ ఫరూఖీలపై గతవారం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఆంక్షలు విధించింది. ఇవి అమల్లోకి రావడంతో ఆస్ట్రేలియాలో ప్రస్తుతం జరుగుతున్న బిగ్‌బాష్ టి20 లీగ్‌లో మంగళవారం మెల్‌బోర్న్ స్టార్స్‌తో మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాల్సిన ముజీబ్‌ను ఆ జట్టు తప్పించింది. ఈ సీజన్‌లో రెనెగేడ్స్ తరఫున ఆడిన ఏకైక మ్యాచ్‌లో ముజీబ్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

విజయంతో ఒసాకా పునరాగమనం

జపాన్ టెన్నిస్ స్టార్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత నయోమి ఒసాకా విజయంతో పునరాగమనం చేసింది. 2022 సెప్టెంబర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఒసాకా గత ఏడాది జూలైలో పాపకు జన్మనిచ్చింది. 15 నెలల విరామం తర్వాత సోమవారం మొదలైన బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీలో ఒసాకా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో ఒసాకా 6-3, 7-6 (11/9)తో తమారా కొర్పాట్స్ (జర్మనీ)పై విజయం సాధించింది.





పవన్

మళ్లీ ఓడిన టైటాన్స్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 18–54 పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్ చేతిలో భారీ ఓటమి చవిచూసింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది ఎనిమిదో పరాజయం కావడం గమనార్హం. టైటాన్స్ జట్టు కెప్టెన్ పవన్ సెహ్రావత్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమయ్యాడు. పవన్ కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధించాడు. మొత్తం 14 సార్లు రెయిడింగ్‌కు వెళ్లిన పవన్ ఒకసారి సఫలమై, మరోసారి బోనస్ పాయింట్ రాబట్టాడు. తొమ్మిదిసార్లు పాయింట్ సాధించకుండానే తిరిగి వచ్చాడు. టైటాన్స్ జట్టు మరో ప్లేయర్ సందీప్ ఐదు పాయింట్లు గెలిచాడు. మరోవైపు పుణేరి పల్టన్ తరఫున మోహిత్ గోయట్, అస్లమ్ ముస్తఫా చెలరేగిపోయారు. మోహిత్ 13 పాయింట్లు, అస్లమ్ 8 పాయింట్లు స్కోరు చేశారు. గౌరవ్ ఖత్రీ (6), అభినేశ్ (5), మొహమ్మద్ రెజా (5) కూడా రాణించారు. మరో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ 48–41తో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. యూపీ యోధాస్ కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ 21 పాయింట్లతో అదరగొట్టినా తన జట్టును గెలిపించలేకపోయాడు.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	8	7	1	0	36
గుజరాత్ జెయింట్స్	9	6	3	0	33
జైపూర్ పింక్ పాంథర్స్	8	4	2	2	28
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	8	5	3	0	26
దబంగ్ ఢిల్లీ	8	4	3	1	25
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	10	3	6	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

వన్డేలకు వార్నర్ గుడ్‌బై

ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ వార్నర్ వన్డే ఫార్మాట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. బ్యాటింగ్‌లో మెరుపులు, నోటితో తూటాలు పేల్చే అతను పలు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచాడు. అతని ఖాతాలో సెంచరీలున్నట్లే కెరీర్‌లో సస్పెన్షన్‌లు, బాల్ టాంపరింగ్ మరకలూ ఉన్నాయి. ఇప్పుడా ఆట, దూకుడు ఇక మీదట టి20లకే పరిమితం కానున్నాయి.

- ఫామ్‌లో ఉంటే 'చాంపియన్స్' బరిలోకి
- ఇకపై టి20లకే 'డాషింగ్ బ్యాటర్' మెరుపులు



సిడ్నీ: డేవిడ్ వార్నర్ అంటే విజయవంతమైన ఓపెనరే కాదు... వివాదాస్పద క్రికెటర్ కూడా! బ్యాట్‌తో బాదడం ఎంత బాగా తెలుసో... 'సై అంటే సై' అని నోటికి పని చెప్పడం కూడా తెలిసినోడు. విధ్వంసకర బ్యాటర్‌గా ఎలా గుర్తుండిపోతాడో అంతే స్థాయిలో తెంపరితనం ఉన్న వ్యక్తిగానూ ముద్ర వేసుకున్నాడు. ఇక మన తెలుగు ప్రేక్షకులకైతే సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఇప్పుడు లేదు)తో బాగా కనెక్టయ్యాడు. తెలుగు హీరోల మేనరిజాన్ని, పాటలకు నప్పే స్టెప్పులతో సోషల్ మీడియాలో వినోదం పంచిన ఈ ఆస్ట్రేలియన్ తాజాగా వన్డే క్రికెట్‌కు సైతం వీడ్కోలు పలికేశాడు. పాకిస్తాన్‌తో స్వదేశంలో ఆఖరి టెస్టు ఆడేందుకు సిద్ధమవుతున్న వేళ వన్డేలపై నిర్ణయాన్ని ప్రకటించాడు. సిడ్నీలో 3 నుంచి జరిగే మూడో టెస్టు అనంతరం అతను కేవలం అంతర్జాతీయ క్రికెట్లో టి20 ఫార్మాట్‌లోనే కొనసాగుతాడు. సోమవారం మీడియా సమావేశంలో 37 ఏళ్ల వార్నర్ మాట్లాడుతూ 'భారత్‌లో జరిగిన ప్రపంచకప్ సమయంలోనే రిటైర్మెంట్ గురించి చెప్పాను. విశ్వవిజేత జట్టు సభ్యుడిగా ఎంతో సంతృప్తికరమైన వన్డే కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నాను. దీనివల్ల నేను ఫ్రాంచైజీ టి20 లీగ్‌ను మరింత శ్రద్ధపెట్టి ఆడేందుకు వీలవుతుంది. ఈ ఫార్మాట్‌లో అంతర్జాతీయ కెరీర్‌నూ కొనసాగిస్తాను.



ఫ్యామిలీతో...

అయితే 2025లో చాంపియన్స్ ట్రోఫీ నాటికి ఫామ్‌లో ఉంటే, జట్టుకు అవసరమనిపిస్తే అందుబాటులో ఉంటాను' అని అన్నాడు.

సఫారీతో అరంగేట్రం

దక్షిణాఫ్రికాతో 2009 జనవరిలో జరిగిన టి20 మ్యాచ్‌తో 22 ఏళ్ల వార్నర్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అదే నెల అదే ప్రత్యర్థితోనే తొలి వన్డే కూడా ఆడాడు. 15 ఏళ్ల కెరీర్‌లో 99 టి20 మ్యాచ్‌ల్లో 2894 పరుగులు చేశాడు. ఒక సెంచరీతోపాటు 24 ఫిఫ్టీలు అతని ఖాతాలో ఉన్నాయి. 161 వన్డేలాడిన వార్నర్ 45.30 సగటుతో 6932 పరుగులు సాధించాడు. ఇందులో 22 సెంచరీలు, 33 అర్ధసెంచరీలున్నాయి. 111 టెస్టుల్లో 44.58 సగటుతో 8695 పరుగులు చేశాడు. 26 శతకాలు, 36 అర్ధశతకాలు బాదాడు.

ఇవీ విజయాలు

➡ మరకలు పక్కనబెట్టి కేవలం క్రికెట్‌నే పరిగణిస్తే మాత్రం వార్నర్ పరిపూర్ణ సాఫల్య క్రికెటర్ అని చెప్పొచ్చు. ఆస్ట్రేలియా సాధించిన 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లలో అతను కీలకపాత్ర పోషించాడు. 2021 టి20 వరల్డ్‌కప్ విజయంలో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. 2023 ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ విజేత జట్టు సభ్యుడిగా ఉన్నాడు.

ఇవీ వివాదాలు

➡ 2013 చాంపియన్స్ ట్రోఫీ సమయంలో జో రూట్‌తో వాగ్వాదానికి దిగడంతో క్రికెట్ ఆస్ట్రేలియా అతనిపై రెండు టెస్టుల నిషేధం విధించింది. దీంతో అతను ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్ని ఆడలేకపోయాడు.

➡ కేప్‌టౌన్ టెస్టులో బాల్ టాంపరింగ్ ఉదంతం వార్నర్ కెరీర్‌కే మాయని మచ్చ. దీంతో అతనితో పాటు, స్మిత్ (అప్పటి కెప్టెన్) ఏడాది పాటు నిషేధానికి గురయ్యారు. ఇవి చాలవన్నట్లు అదుపులేని నోటి దురుసుతనంతో జీవితకాలం సారథ్యం చేపట్టకుండా శిక్షకు గురయ్యాడు.



విజయంతో ప్రారంభించాలని...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల జట్టు చివరి వన్డే
- ఇప్పటికే సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ బృందం
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: కొత్త ఏడాదిని విజయంతో ప్రారంభించాలనే లక్ష్యంతో... నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే చివరిదైన మూడో వన్డేలో భారత జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలై సిరీస్‌ను కోల్పోయింది. ఫలితంగా ఆస్ట్రేలియాపై తొలిసారి ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన భారత జట్టుకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇక చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి ఊరట చెందాలని భారత బృందం భావిస్తోంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో విశేషంగా రాణించి అద్భుత విజయాలు అందుకున్న భారత జట్టు వన్డే ఫార్మాట్‌కు వచ్చేసరికి తడబడింది. సమష్టి ప్రదర్శన కొరవడటంతో ఈ ప్రభావం మ్యాచ్ తుది ఫలితంపై పడింది. భారత్ తరఫున బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో ఒకరిద్దరే రాణిస్తుండటం ప్రతికూలంగా మారింది. తొలి వన్డేలో భారత జట్టు భారీ స్కోరు చేసినా బౌలర్ల వైఫల్యం దెబ్బతీసింది. రెండో వన్డేలో రిచా ఘోష్ ఒంటరి పోరాటంతో విజయానికి చేరువైన భారత్ చివర్లో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఆఖరికి మూడు పరుగుల తేడాతో ఓడిపోయింది. అంతేకాకుండా రెండో మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు ఏకంగా ఏడు క్యాచ్‌లు జారవిడిచారు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు మ్యాచ్‌ల్లోనూ విఫలమైంది. తొలి మ్యాచ్‌లో 9 పరుగులు చేసిన హర్మన్ రెండో మ్యాచ్‌లో 5 పరుగులతో సరిపెట్టుకుంది. చివరిసారి 2007లో స్వదేశంలో ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో గెలిచిన భారత్ ఆ తర్వాత వరుసగా తొమ్మిది వన్డేల్లో ఓటమి చవిచూసింది. స్వదేశంలో ఆసీస్ చేతిలో పరాజయపరంపరకు తెర దించాలంటే చివరి వన్డేలో భారత జట్టు విశేషంగా రాణించాల్సి ఉంటుంది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియాలతోపాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా బ్యాటింగ్‌లో మెరిపిస్తే భారత్ భారీ స్కోరు చేసే అవకాశముంటుంది. బౌలింగ్‌లో రేణుక సింగ్‌తోపాటు స్పిన్నర్లు కూడా తమ బాధ్యతను నిర్వర్తించడంతో టీమిండియా విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. చివరి బంతి వరకు ఓటమిని అంగీకరించని తత్వం ఆస్ట్రేలియా క్రికెటర్ల సొంతం. అందుకే రెండు వన్డేల్లోనూ ఆ జట్టు ఒత్తిడికిలోనైన సందర్భాల్లో తడబడకుండా సంయమనంతో ఆడి కోలుకున్నారు. ఫోబి లిచ్‌ఫీల్డ్, తాలియా మెక్‌గ్రాత్, యాష్లే గార్డ్‌నర్, ఎలీస్ పెరీ, కెప్టెన్ అలీసా హీలీ, అనాబెల్ సదర్లాండ్ మరోసారి రాణిస్తే ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం సాధ్యమే.

సస్పెన్షన్‌ను పట్టించుకోం... కమిటీని గుర్తించం!

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఇంత జరిగినా కూడా... భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ తన వైఖరి మార్చుకోవడం లేదు. కేంద్ర క్రీడాశాఖ విధించిన సస్పెన్షన్‌ను పట్టించుకోమని, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నియమించిన అడ్‌హక్ కమిటీని కూడా గుర్తించబోమని ధిక్కారపు ధోరణిని ప్రదర్శించారు. త్వరలోనే జాతీయ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించి తీరుతామని పేర్కొన్నారు. 'మేం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికయ్యాం. రిటర్నింగ్ అధికారి దీన్ని ధ్రువీకరిస్తూ సంతకం చేశారు. అలాంటి కార్యవర్గాన్ని ఎందుకు విస్మరిస్తారు. అడ్‌హక్ కమిటీతో మాకు సంబంధం లేదు. మా సమాఖ్యను మేమే నడిపించుకుంటాం త్వరలోనే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పోటీల నిర్వహణపై నిర్ణయం కూడా తీసుకుంటాం' అని సంజయ్ వెల్లడించారు. నియమావళిని అతిక్రమించలేదని ఇదివరకే క్రీడాశాఖకు సంజాయిషీ ఇచ్చామని, వారి స్పందన కోసం ఎదురు చూస్తున్నామన్నారు.



సినిమా



ఎన్టీఆర్

గ్లింప్స్‌కి వేళాయె

ఎన్టీఆర్ 'దేవర' సినిమా అప్‌డేట్ కోసం ఎప్పటి నుంచో ఆత్రుతగా ఎదురు చూస్తున్న అభిమానులకు ఓ గుడ్ న్యూస్. వారం రోజుల్లో ఫ్యాన్స్ నిరీక్షణకు ఫుల్‌స్టాప్ పడనుంది. ఈ నెల 8న 'దేవర' సినిమా పార్ట్ 1 గ్లింప్స్‌ని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ పవర్‌ఫుల్ లుక్‌ని విడుదల చేశారు నిర్మాతలు. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్–దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 80 శాతం పూర్తయ్యింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం గ్లింప్స్‌ను ఈ నెల 8న రిలీజ్ చేయనున్నాం. సినిమాని ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.



రవితేజ

థ్రిల్లింగ్ ఈగల్

రవితేజ హీరోగా, కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. కాగా నూతన సంవత్సరం కానుకగా ఈ మూవీ నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఈగల్'. రవితేజని పవర్‌ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు కార్తీక్. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ''2024 ఉషోదయం మీకు ఆశీర్వాదాలు, విజయాలతో పాటు మరపురాని జ్ఞాపకాలను ఇస్తుంది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు'' అంటూ రవితేజ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: దేవ్ జాంద్.

పోలీస్ భీమా

గోపీచంద్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'భీమా'. ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ కథానాయికలుగా నటిస్తున్నారు. కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ సినిమా నుంచి ఇంటెన్స్ పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. ఖాకీ దుస్తుల్లో చేతిలో సంకెళ్లు పట్టుకొని సీరియస్ లుక్‌లో ఉన్నారు గోపీచంద్. ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భీమా' రూపొందుతోంది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర పోషిస్తున్నారు. సాంకేతికంగా, నిర్మాణ విలువల పరంగా ఈ సినిమాని భారీ స్థాయిలో రూపొందిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె. గౌడ, సంగీతం: రవి బస్రూర్.



గోపీచంద్

చీకటి యుగంలోకి...

కొత్త సంవత్సరం సందర్భంగా మలయాళ స్టార్ మమ్ముట్టి సరికొత్త లుక్‌లో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. మమ్ముట్టి లీడ్ రోల్‌లో 'భ్రమయుగం' అనే చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని మమ్ముట్టి డిఫరెంట్ లుక్ విడుదలైంది. హారర్ థ్రిల్లర్ జోనర్‌లో కేరళలోని కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి ఘటనల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ పతాకాలపై రామచంద్ర చక్రవర్తి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేరళలోని చీకటి యుగాల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి క్రిస్టో జేవియర్ సంగీతదర్శకుడు. కాగా ఈ చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన నైట్ షిఫ్ట్ స్టూడియోస్ సంగీతప్రపంచంలోకి అడుగుపెడుతూ 'నైట్ షిఫ్ట్ రికార్డ్స్'ని ఆరంభించింది. ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్లో ప్రతిధ్వనించే విభిన్నమైన సౌండ్ ట్రాక్‌ల సేకరణను నిర్వహించడం మా 'నైట్ షిఫ్ట్ రికార్డ్స్' లక్ష్యం. మొదటగా ఈ మ్యూజిక్ లేబుల్ నుంచి 'భ్రమయుగం' సౌండ్ ట్రాక్‌ను రిలీజ్ చేస్తాం'' అన్నారు రామచంద్ర చక్రవర్తి.



మమ్ముట్టి

నాట్య కళాకారిణి గీతాంజలి

అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకుడు. ఈ చిత్రంతో మలయాళ నటుడు రాహుల్ మాధవ్ తెలుగుకి పరిచయం అవుతున్నారు. కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్‌లపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి అంజలి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పాడుబడ్డ భవంతిలో నాట్య కళాకారిణి లుక్‌లో అంజలి కనిపిస్తున్నారు. ''గీతాంజలి'కి సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' రూపొందుతోంది. ఆ సినిమా ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే సీక్వెల్ ఆరంభం అవుతుంది. ఇప్పటివరకు వచ్చిన హారర్ కామెడీ చిత్రాలన్నీ ఒక ఎత్తయితే ఈ చిత్రం వాటిని మించేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. శ్రీనివాస్ రెడ్డి, 'సత్యం' రాజేశ్, 'షకలక' శంకర్, సత్య, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, కెమెరా: సుజాత సిద్ధార్థ్.



అంజలి



హర్ష

ఓ ఉపాధ్యాయుడి కథ

హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన తారాగణంగా కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సుందరం మాస్టర్'. ఆర్.టి. టీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా బ్యానర్స్‌పై రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ చిత్రం అటెండెన్స్ ప్రోమోను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ–''సుందరం అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి చుట్టూ నడిచే కథ ఇది. సోషల్ స్టడీస్ బోధించే సుందరం మిర్యాలమెట్ట అనే మారుమూల పల్లెలో ఇంగ్లిష్ టీచర్‌గా వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. అక్కడికి అన్ని వయసులవారు ఇంగ్లిష్ నేర్చుకోవటానికి విద్యార్థులుగా వస్తారు. వారికి సుందరం ఇంగ్లిష్ ఎలా బోధించాడన్నది ఆసక్తిగా సాగుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: దీపక్ ఎరెగడ.



రకుల్



రకుల్, జాకీ

ఫిబ్రవరిలో పెళ్లి?

జాకీ భగ్నానీ, రకుల్ ప్రీత్ సింగ్ ఫిబ్రవరిలో ఏడడుగులు వేయనున్నారనే వార్త గుప్పుమంది. హీరోయిన్ రకుల్, హీరో–నిర్మాత జాకీ దాదాపు రెండు మూడేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ప్రేమను పెళ్లి వరకూ తీసుకెళ్లాలని ఈ ఇద్దరూ నిర్ణయించుకున్నారట. ఫిబ్రవరి 22న పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారని సమాచారం. గోవాలో డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేస్తున్నారట. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో రకుల్, జాకీల పెళ్లి జరగనుందని భోగట్టా. సోమవారం ఈ పెళ్లి వార్త వైరల్‌గా మారినప్పటికీ రకుల్, జాకీ నుంచి ఎలాంటి స్పందన లేదు.

యువతరం ఆలోచనలతో...

సుహాస్, విరాజ్ అశ్విన్, రుహానీ శర్మ, కార్తీక్ రత్నం ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగ నీతులు'. ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం ప్రమోషనల్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది యూనిట్. ఇందులో భాగంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ మాట్లాడుతూ– ''నేటి తరం ఆలోచనలు, భావోద్వేగాలు ఎలా ఉంటున్నాయి? అనేది ఈ చిత్రంలో మూడు పాత్రల ద్వారా చూపిస్తున్నాం. కొత్తదనంతో పాటు పూర్తి వాణిజ్య అంశాలతో రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 5న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు వెంకటేశ్వరరావు బల్మూరి. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.



కార్తీక్, విరాజ్, రుహానీ, సుహాస్

సాక్షి బిజినెస్
మంగళవారం
2-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
32	11
72,271	21,742

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	15,011	▽	84
డోజోన్స్	37,699	▽	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,773	▲	10
డాక్స్	16,752	▲	50
షాంఘై	2,975	▲	20
నికాయ్	33,644	▽	50

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	63,352
బంగారం (99.5 స్వచ్ఛత)	63,098
వెండి (కేజీ)	73,705

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.68	83.92
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.43	107.96
€	యూరో	ఒకటి	90.99	93.99
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.65	59.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.01	58.37
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పాయింట్‌వారీ	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	పాయింట్‌వారీ	21.77	23.55
¥	చైనా యువాన్	పాయింట్‌వారీ	10.60	12.68

చైనాకు దీటైన పోటీదారుగా ఎదగాలి

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ: సరఫరా వ్యవస్థలో చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కొనగలిగే నమ్మకమైన పోటీదారుగా భారత్ ఎదగడం ప్రపంచానికి ఎంతో అవసరమని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. 2024లో ఇందుకు చక్కని అవకాశాలు ఉన్నాయని, దేశంలోకి పెట్టుబడులు అసాధారణ స్థాయిలో వెల్లువెత్తగలవని నూతన సంవత్సర సందేశంలో ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ఉవ్వెత్తున ఎగుస్తుందనే సంకేతాలే అన్ని వైపుల నుంచి లభిస్తున్నాయని మహీంద్రా పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి బాటలో పురోగమించాలంటే విప్లవాత్మకమైన ఆవిష్కరణలు చేయగలిగే సత్తాను సాధించడం కీలకంగా ఉండగలదని ఆయన చెప్పారు.

97 శాతం రూ. 2,000 నోట్లు తిరిగొచ్చాయ్: ఆర్‌బీఐ



ముంబై: రూ. 2,000 నోట్లకు సంబంధించి దాదాపు 97.38 శాతం నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ సోమవారం వెల్లడించింది. ప్రజల దగ్గర ఇంకా రూ. 9,330 కోట్ల విలువ చేసే నోట్లు ఉన్నాయని వివరించింది. డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) అనంతరం 2016 నవంబర్‌లో ప్రవేశపెట్టిన రూ. 2,000 కరెన్సీ నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
1-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	579-00
వరంగల్	581-00
రిటైల్ ధర	6.40

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.64 లక్షల కోట్లు

డిసెంబర్‌లో 10 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు డిసెంబర్‌లో రూ.1.64 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022 ఇదే నెలతో పోల్చితే ఈ విలువ 10 శాతం అధికం. ఏప్రిల్-డిసెంబర్ 2023 మధ్య జీఎస్‌టీ వసూళ్లు 12 శాతం పెరిగి రూ.14.97 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో వసూళ్లు సగటున 12 శాతం వృద్ధితో రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్ నెలల్లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి. జూలై వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు. ఆగస్టు వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లు కాగా, సెప్టెంబర్‌లో రూ. 1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ రాబడి నమోదయ్యింది. ఇక అక్టోబర్ విషయానికి వస్తే. వసూళ్లు భారీగా రూ.1.72 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలైలో ప్రారంభం తర్వాత ఇవి రెండవ భారీ స్థాయి వసూళ్లు (2023 ఏప్రిల్ తర్వాత). నవంబర్‌లో వసూళ్లు రూ.1.67 లక్షల కోట్లు. ఎకానమీ క్రియాశీలత, పన్నుల ఎగవేతలను అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు, వసూళ్ల వ్యవస్థలో సామర్థ్యం పెంపు, పండుగల డిమాండ్ జీఎస్‌టీ భారీ వసూళ్లకు కారణమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రానున్న నెలల్లో సైతం ఇదే ధోరణి కొనసాగుతుందన్న విశ్వాసాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

అంకెలు కోట్లలో...

మొత్తం ఆదాయం	రూ.1,64,882
ఇందులో సీజీఎస్‌టీ	రూ.30,443
ఎస్‌జీఎస్‌టీ	రూ.37,935
ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ	రూ. 84,255
సెస్	రూ.12,249

కోటక్ మహీంద్రా బ్యాంక్ చీఫ్‌గా వాశ్వాని బాధ్యతలు



న్యూఢిల్లీ: కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎండీ, సీఈవోగా అశోక్ వాశ్వాని సోమవారం (జనవరి 1న) బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రకటించింది. వ్యవస్థాపక డైరెక్టర్ అయిన ఉదయ్ కోటక్ 2023 సెప్టెంబర్ 1 నుంచి తప్పుకోగా, దీపక్ గుప్తా మధ్యంతర ఎండీ, సీఈవోగా సేవలు అందించారు. ఇప్పుడు ఆయన నుంచి బ్యాంక్ ఎండీ, సీఈవో బాధ్యతలను వాశ్వాని స్వీకరించారు. వాశ్వాని నియామక ప్రతిపాదనకు ఆర్‌బీఐ గతేడాది అక్టోబర్‌లో ఆమోదం తెలియజేయడం గమనార్హం. ఉదయ్ కోటక్ మాదిరే వాశ్వాని సైతం సిడెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనమిక్స్ పూర్వ విద్యార్థి.

ప్యాసింజర్ వాహన విక్రయాల రికార్డు

2023లో 41.08 లక్షల అమ్మకాలు



న్యూఢిల్లీ: ఆటో అమ్మకాలు డిసెంబర్‌లో పరిశ్రమ వర్గాల అంచనాలను అందుకోలేనప్పటికీ, 2023లో దేశవ్యాప్తంగా రికార్డు సృష్టించాయి. ప్యాసింజర్ వాహన విక్రయాలు 8.3 శాతం వృద్ధితో రికార్డు స్థాయిలో 41.08 లక్షలుగా నమోదయ్యాయి. మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా 42% నుంచి 49 శాతానికి పెరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023లో మారుతీ సుజుకీ 31% వృద్ధితో 20.66 లక్షల వాహనాలు విక్రయించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాలు 9% పెరిగి 7.65 లక్షలకు చేరాయి. టాటా మోటార్స్ 5.53 లక్షల వాహనాలు విక్రయించింది. టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 46% వృద్ధితో 2.33 లక్షల వాహనాలకు పెరిగాయి.

ఆటో రంగానికి పీఎల్ఐ పొడిగింపు

ఆటో రంగానికి పీఎల్ఐ పథకాన్ని కేంద్రం ఏడాది పొడిగించింది. 2023-24 ఏడాది నుంచి వరుసగా ఐదేళ్ల కాలానికి వర్తించనున్నట్లు పేర్కొంది. ప్రోత్సాహకాలు 2028 మార్చి31 తదుపరి వర్తించవని స్పష్టం చేసింది.

కంపెనీ	డిసెంబర్ 2023	డిసెంబర్ 2022	(%లో)
మారుతీ సుజుకీ	1,37,551	1,39,347	(-)1
హ్యుందాయ్ మోటార్స్	56,450	57,852	(-)2
టాటా మోటార్స్	76,138	72,997	(+)4
ఎంఅండ్ఎం	60,188	56,677	(+)6
హోండా కార్స్	7,902	7,062	(+)12
ఎంజీ మోటార్స్	4,400	3,899	(+)13
టయోటా కిర్లోస్కర్	21,372	17,818	(+)20
బజాజ్ ఆటో	3,26,806	2,81,514	(+)16
టీవీఎస్ మోటార్స్	3,01,898	2,42,012	(+)25
రాయల్ ఎన్‌ఫీల్డ్	63,387	68,400	(-)7
వోల్వో ఐషర్	8,026	7,221	(+)11
ఎస్కార్ట్స్	4,536	5,573	(-)19
మహీంద్రా ట్రాక్టర్స్	19,138	23,243	(-)18

ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై తయారీ తేదీ ముద్రణ తప్పనిసరి

అమల్లోకి కొత్త నిబంధన



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ ఉత్పత్తులు అన్నింటిపై 'తయారీ తేదీ'ని, 'యూనిట్ విక్రయ ధర'ను తప్పనిసరిగా ముద్రించాలన్న నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను వేర్వేరు పరిమాణాల్లో విక్రయిస్తారు కాబట్టి 'యూనిట్ విక్రయ ధర' ఎంతనేది వినియోగదారులకు తెలియాల్సిన అవసరం ఉందని, తద్వారా వారు కొనుగోలు విషయంలో తగు నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్యాకేజ్డ్ ఉత్పత్తులపై తయారీ తేదీని లేదా దిగుమతి చేసుకున్న తేదీని లేదా ప్యాక్ చేసిన తేదీని ముద్రించేందుకు కంపెనీలకు వెసులుబాటు ఉండేది. దాన్ని ప్రస్తుతం మార్చారు. తయారీ తేదీని ముద్రించడం వల్ల సదరు ఉత్పత్తి ఎన్నాళ్ల క్రితం తయారైనదీ వినియోగదారులకు స్పష్టంగా తెలిసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే యూనిట్ ధరను ముద్రించడం వల్ల గ్రాముల లెక్కన ఖరీదు ఎంత ఉంటోందో తెలుసుకోవచ్చు. ఉదాహరణకు 2.5 కేజీల గోధుమ పిండి ప్యాకెట్‌పై గరిష్ఠ చిల్లర ధరతో (ఎంఆర్‌పీ) పాటు కేజీ (యూనిట్) ధర ఎంత అనేది కూడా ముద్రించాల్సి ఉంటుంది. ఒకవేళ కేజీ కన్నా తక్కువ పరిమాణం ఉంటే ఎంఆర్‌పీతో పాటు గ్రాముకి ఇంతని ముద్రించాలి.

కొత్త ఏడాది తొలి రోజు

సరికొత్త రికార్డులు తాకి.. వెనక్కి



- ఇంట్రాడేలో జీవితకాల గరిష్ఠం
- రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ
- స్వల్ప లాభాల ముగింపు

ముంబై: కొత్త ఏడాది తొలి ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీల రికార్డుల జైత్రయాత్ర కొనసాగింది. ఇంధన, సర్వీసెస్, టెలికం షేర్లు రాణించడంతో సోమవారం ఇంట్రాడేలో సెన్సెక్స్, నిఫ్టీ కొత్త సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. అయితే లాభాల స్వీకరణతో తదుపరి వెనక్కి వచ్చాయి. ఉదయం స్వల్ప నష్టంతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 322 పాయింట్లు పెరిగి 72,562 వద్ద, నిఫ్టీ 103 పాయింట్లు బలపడి 21,834 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఆటో, బ్యాంకులు, కన్జూమర్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 32 పాయింట్లు పెరిగి 72,271 వద్ద, నిఫ్టీ 11 పాయింట్ల లాభంతో 21,742 వద్ద నిలిచాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.73%, 0.54% చొప్పున రాణించాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఆసియా, యూరప్ మార్కెట్లు పనిచేయలేదు. అమెరికా మార్కెట్లకూ సెలవు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఆరు పైసలు పతనమై 83.22 వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిసెంబర్‌లో ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో ఆటో షేర్లు నష్టపోయాయి.
- ఎస్‌పీఏ పోర్ట్‌ఫోలియో విక్రయంలో భాగంగా జేసీ ఫ్లవర్స్ ఏఆర్‌సీ నుంచి రూ.150 కోట్లు అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇవ్వడంతో యస్ బ్యాంక్ షేరు ఐదున్నర శాతం పెరిగి రూ. 22.64 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 7% లాభపడి రూ.22.99 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- దక్షిణ మధ్య రైల్వే నుంచి రూ.121 కోట్ల ఆర్డర్ దక్కించుకోవడంతో రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేరు 4.50% లాభపడి రూ.353 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 10% ఎగసి రూ.371 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీపీఎస్సీ- ఏపీలో 21 అసిస్టెంట్ ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో.. ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 21
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(సివిల్/మెకానికల్/కెమికల్/ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.57,100 నుంచి రూ.1,47,760.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 30.01.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.02.2024
» **రాతపరీక్ష తేది:** ఏప్రిల్/మే 2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్, ముంబైలో 291 పోస్టులు

ముంబైలోని ఆదాయపు పన్ను శాఖ, ముంబై రీజియన్‌లో.. వివిధ పోస్టుల కోసం ప్రతిభావంతులైన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 291
» **పోస్టుల వివరాలు:** ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్(ఐటీఐ)-14, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2 (స్టెనో)-18, టాక్స్ అసిస్టెంట్(టీఏ)-119, మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)-137, క్యాంటీన్ అటెండెంట్ (సీఏ)-03.
» **క్రీడలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, అట్యా-పాట్యా, బ్యాడ్మింటన్, బాల్-బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, నెట్ బాల్, పోలో, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, బ్రిడ్జ్, క్యారమ్, చెస్, క్రికెట్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, పన్నెండో తరగతి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత క్రీడలో ప్రతిభావంతులై ఉండాలి.
» **వయసు:**01.01.2023 నాటికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్‌కు 18 నుంచి 30 ఏళ్లు, స్టెనోగ్రాఫర్‌కు 18 నుంచి 27 ఏళ్లు, టాక్స్ అసిస్టెంట్‌కు 18 నుంచి 27 ఏళ్లు, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 18 నుంచి 25 ఏళ్లు, క్యాంటీన్ అటెండెంట్‌కు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు క్యాంటీన్ అటెండెంట్/ఎంటీఎస్‌లకు రూ.18,000 నుంచి రూ.56,900, స్టెనోగ్రాఫర్/ట్యాక్స్ అసిస్టెంట్‌కు రూ.25,500 నుంచి రూ.81,100, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.01.2024
» **వెబ్‌సైట్:** www.incometaxmumbai.gov.in

కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) పీజీ-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)పీజీ-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు పలు ఇతర యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో పీజీలో ప్రవేశాలు లభిస్తాయి.

» **కోర్సుల వివరాలు:** ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎఫ్ఏ, ఎంపీఏ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ ఒకేషనల్, ఎంఎడ్, ఎంఎల్ఐఎస్సీ, ఎంపీఈడీ, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం తదితరాలు.
» **అర్హత:** డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు సీయూఈటీ రాసుకోవచ్చు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. మరికొన్ని కోర్సులకు డిగ్రీలో సంబంధిత కోర్సు చదివినవారై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
» **ఆన్‌లైన్ పరీక్ష:** పరీక్ష కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మొత్తం 75 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి ఒక గంట 45 నిమిషాలు. మూడు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో(లాంగ్వేజ్, ఎంటెక్ హయ్యర్ సైన్సెస్, ఆచార్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో 75 ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.01.2024
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 25.01.2024.
» **దరఖాస్తు సవరణ:** 27.01.2024 నుంచి 29.01.2024 వరకు
» **పరీక్ష కేంద్రం సమాచారం వెల్లడి:** 04.03.2024
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ ప్రారంభం:** 07.03.2024
» **పరీక్ష తేదీలు:** 11.03.2024 నుంచి 28.03.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://pgcuet.samarth.ac.in

పరిశోధన సంస్థలో.. ఆఫీసర్ కొలువు

» సీఎస్ఐఆర్‌లో 444 పోస్ట్‌ల భర్తీకి ప్రకటన
» కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ పరీక్ష ద్వారా ఎంపిక
» పే లెవల్ 7, 8 లతో ప్రారంభ వేతన శ్రేణి
» డిగ్రీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్కారీ కొలువుల నోటిఫికేషన్. గ్రూప్-బి గెజిటెడ్ హోదాలో కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే చక్కటి అవకాశం! దేశంలోనే అత్యున్నతమైన పరిశోధన సంస్థ.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్).. మొత్తం 444 అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందు కోసం కంబైన్డ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఏఎస్ఈ)-2023ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్-సీఏఎస్ఈ నోటిఫికేషన్ వివరాలు, పోస్ట్‌లు, ఎంపిక విధానం తదితర వివరాలు..



మొత్తం 444 పోస్ట్‌లు

సీఎస్ఐఆర్-సీఏఎస్ఈ తాజా నోటిఫికేషన్ ద్వారా.. మొత్తం 444 సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఇందులో సెక్షన్ ఆఫీసర్(జనరల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్)-76 పోస్టులు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(జనరల్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, స్టోర్స్ అండ్ పర్చేజ్) - 368 పోస్టులు ఉన్నాయి. సీఎస్ఐఆర్.. సైన్స్ పరిశోధనల్లో మేటి సంస్థ. ఈ సంస్థ పరిపాలన విభాగాల్లో సెక్షన్ ఆఫీసర్స్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష సీఏఎస్ఈ.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 2024,జనవరి 12 నాటికి 33 ఏళ్లు (ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు) ఉండాలి.

వేతనం

- సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లు.. గ్రూప్-బి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ర్యాంక్ ఉద్యోగాలు. ఈ పోస్ట్‌లకు ప్రారంభ వేతన శ్రేణి పే లెవల్ 7, 8 లలో ఉంటుంది.
- సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు పే లెవల్ 8(రూ.47,600-రూ.1,51,000); అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు పే లెవల్ 7(రూ.44,900-రూ. 1,42,400)తో ప్రారంభ వేతనం అందుతుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్. రాత పరీక్ష రెండు పోస్ట్‌లకు కామన్‌గా ఉంటుంది. ఆ తర్వాత దశలో సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌ల అభ్యర్థులకు మాత్రం 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌ల అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూ ఉండదు. వీరికి 100 మార్కులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

సీఏఎస్ఈ రాత పరీక్ష

- సీఏఎస్ఈ రాత పరీక్షను మూడు పేపర్లుగా 500 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్ 1లో జనరల్ అవేర్‌నెస్(100 ప్రశ్నలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(50 ప్రశ్నలు) 150 మార్కులకు; పేపర్ 2లో జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ అండ్ మెంటల్ ఎబిలిటీ 200 మార్కులకు; పేపర్ 3లో ఇంగ్లిష్/ హిందీ డిస్క్రిప్టివ్ పేపర్ 150 మార్కులకు ఉంటాయి.
- పేపర్-1, పేపర్-2లలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కులు తగ్గిస్తారు.
- పేపర్-3ని డిస్క్రిప్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇంగ్లిష్ లేదా హిందీలో ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్, అప్లికేషన్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది.
- పేపర్-1, 2లలో సాధించిన మార్కుల ఆధారంగా పేపర్-3కి ఎంపిక చేస్తారు.
- సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు సంబంధించి మూడు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌లకు సంబంధించి పేపర్-1, పేపర్-2లలో చూపిన ప్రతిభ ఆధారంగా పేపర్-3కి, అదే విధంగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌ను అర్హత పరీక్షగానే పేర్కొన్నారు. మూడు పేపర్లలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.

జేఎస్ స్థాయికి చేరుకునే అవకాశం

సీఏఎస్ఈలో ప్రతిభ చూపి సెక్షన్ ఆఫీసర్స్‌గా నియమితులైన వారు భవిష్యత్తులో అండర్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్, జాయింట్ సెక్రటరీ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. అదే విధంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్ట్‌కు ఎంపికైన వారు డైరెక్టర్ స్థాయి వరకు చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 12
- **పేపర్-1, 2 పరీక్ష:** 2024 ఫిబ్రవరిలో.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://csir.cbtexamportal.in/,›csir.res.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

భారత చరిత్ర, జాతీయోద్యమం, భారత రాజ్యాంగం, పాలిటీ, గవర్నెన్స్, సోషల్ జస్టిస్, జాతీయ/అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్

యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, ప్రిపొజిషన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సినానిమ్స్, యాంటానిమ్స్, సెంటెన్స్ కరెక్షన్, కామన్ ఎర్రర్స్, పంక్చుయేషన్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ తదితర బేసిక్ గ్రామర్ అంశాలతోపాటు కాంప్రహెన్షన్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవడం, వాటిలో వాక్య నిర్మాణాన్ని అవగాహన చేసుకోవడం, గ్రామర్ యూసేజ్‌లపై దృష్టి సారించడం వంటివి చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫాన్యుమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్-డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

అర్థమెటిక్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్,లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలపై ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా,త్రికోణమితి,ఆల్జీబ్రా,జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్,టైం అండ్ వర్క్,టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ సైన్స్

- ఈ విభాగానికి సంబంధించి ఆరు నుంచి పదో తరగతి వరకు సైన్స్ పాఠ్య పుస్తకాల్లోని అంశాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా వ్యాధులు-చికిత్స, ఔషధాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- ఆర్థిక, సామాజిక అభివృద్ధి అంశాలు, పర్యావరణ సమస్యలు, జీవ వైవిధ్యం, పర్యావరణ మార్పు తదితర అంశాలకు సంబంధించి అవగాహన ఏర్పరచుకోవాలి. వీటితోపాటు.. ఎథిక్స్, ఇంటెగ్రిటీ, ఆప్టిట్యూడ్, డెసిషన్ మేకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను పెంచుకోవాలి. అదే విధంగా మేనేజ్‌మెంట్ సిద్ధాంతాలు, కార్యాచరణ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

డిస్క్రిప్టివ్ టెస్ట్ ఇలా

డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు సంబంధించి రెండు ఎస్సేలు, ఒక ప్రెసిస్ రైటింగ్, ఒక లెటర్ రైటింగ్/అప్లికేషన్ రైటింగ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం అభ్యర్థులు ఎస్‌బీఐ, ఐబీపీఎస్ పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా దిన పత్రికల్లో ఎడిటోరియల్స్ చదవాలి. ఫలితంగా సమకాలీన అంశాలకు సంబంధించిన వ్యాసాలపై పట్టు సాధించొచ్చు.

కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

ఈ పరీక్షలో రాణించేందుకు.. వర్డ్ ప్రాసెసింగ్, స్ప్రెడ్ షీట్స్ జనరేషన్, స్లైడ్స్ జనరేషన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా కీ బోర్డ్ షార్ట్ కట్స్, బేసిక్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన అంశాలు తెలుసుకోవాలి.


వైఎస్సార్ జిల్లా మల్యాలలో పింఛన్ డబ్బును అందిస్తున్న శాప్ రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రారెడ్డి, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలత


విశాఖలోని 43వ వార్డులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరం సమన్వయకర్త కె.కె.రాజు


తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో పింఛన్ అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


పశ్చిమగోదావరి జిల్లా పెదఅమిరం గ్రామంలో సోమవారం వృద్ధులకు పింఛన్ అందిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి


ఒంగోలు ఇందిరాకాలనీలో షేక్ తహీరున్నీసాకు 3 వేల రూపాయల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అస్మా

క్లుప్తంగా...

సమష్టి కృషితో ఆర్టీసీ అభివృద్ధి

ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు



సాక్షి, అమరావతి: సమష్టి కృషితో ప్రజా రవాణా విభాగం(ఆర్టీసీ)ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెంపొందించేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ ఏడాది ఆర్టీసీ బస్‌స్టేషన్లు, డిపోలను ఆధునీకరించేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ.కోటేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఏపీలో స్థూల జీఎస్టీ సేకరణలో 11శాతం వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2023 ఏప్రిల్–డిసెంబర్ మధ్యకాలంలో స్థూల జీఎస్టీ సేకరణ 11శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు రూ.3,545 కోట్లు జీఎస్టీ వసూలైంది. రాష్ట్రంలో 2022 డిసెంబర్‌లో రూ.3,182 కోట్లు జీఎస్టీ సేకరించిన విషయం తెలిసిందే. మొత్తం దేశవ్యాప్తంగా స్థూల జీఎస్టీ సేకరణ 12శాతం వృద్ధిని సాధించి రూ.14.97 లక్షల కోట్లకు చేరుకుంది. గత సంవత్సరం (ఏప్రిల్–డిసెంబర్ 2022) ఇదేకాలంలో రూ.13.40 లక్షల కోట్ల జీఎస్టీ సేకరణ జరిగింది.

టోఫెల్‌లో ప్రతిభ చాటాలి

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 'టోఫెల్' పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ సాధించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సూచించారు. సోమవారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయిలో 'మెంటార్ ఏ స్టూడెంట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు నాలుగేళ్ల తర్వాత తొమ్మిదో తరగతిలో టోఫెల్ జూనియర్ పరీక్షలకు సన్నద్ధమవుతారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ సాధించడంతోపాటు ఇంగ్లిష్‌లో వినడం, మాట్లాడటం వంటి నైపుణ్యాలను పెంపొందించేలా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం విద్యాశాఖలో అత్యున్నత స్థాయి నుంచి ప్రతి అధికారి ప్రతి విద్యార్థికి మెంటార్‌గా బాధ్యత తీసుకుంటామని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రమాణం చేయించారు. 'నేను ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తాను. ప్రతి విద్యార్థిని టోఫెల్ పరీక్షకు సన్నద్ధం చేయిస్తాను. ప్రతిరోజు పిల్లలకు అవసరమైన వీడియోలను ఐఎఫ్‌పీల్లో చూపిస్తాను. స్వతహాగా ట్యాబ్‌లు వినియోగిస్తూ విద్యార్థులతో కూడా వినియోగించేలా చేస్తాను' అని ఉపాధ్యాయులతోను, 'పిల్లలతో కలిసి భోజనం చేస్తాం. ఆ సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని, ఇంటికి దూరంగా ఉన్న పిల్లలతో రోజుకు ఒకసారైనా మాట్లాడాలని' తల్లిదండ్రులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఏఎస్పీడీ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీఈవో సీవీ రేణుక, ఏపీసీ జి.మహేశ్వరరావు, డీవీఈవో కేవీఎస్ కుమార్, ఎంఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు సిటీ సైడ్ ప్రాంతంలో సెల్ఫ్ చెక్‌ఇన్

శంషాబాద్: విమాన ప్రయాణికుల సేవలను మరింత సులభతరం చేసేందుకు జీఎంఆర్ సంస్థ మరో అడుగు వేసింది. ప్రయాణికులు సెల్ఫ్ చెక్ ఇన్ (స్వీయ తనిఖీ)లను పూర్తి చేసుకోడానికి ఎయిర్‌పోర్టులో సిటీ సైడ్ ఏరియా (కారు పార్కింగ్) సమీపంలో ఏర్పాటు చేసింది. దీంతో టెర్మినల్ ఏరియాలో గణనీయంగా ఉండే రద్దీని తగ్గించడంతో పాటు చెక్ ఇన్ ప్రక్రియ మరింత సులభంగా మారనుంది. సోమవారం నుంచి దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

పెంచిన మొత్తంతో అవ్వాతాతల కళ్లల్లో వెల్లివిరిసిన ఆనందం

- ఈ నెలలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాల అందజేత
- లబ్ధిదారుల ఇళ్ల వద్దే రూ.3వేల చొప్పున పింఛన్ పంపిణీ

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరంలోనూ రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ పండుగలా మొదలైంది. తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.మూడు వేల చొప్పున ఈనెల పింఛను డబ్బులు అందుకున్న అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటివరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈ జనవరి ఒకటి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని 8వ తేదీ వరకు మండలాల వారీగా ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసింది. మొత్తంగా ఈ నెలలో 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లను విడుదల చేసింది.

పింఛన్ల పంపిణీలో విప్లవాత్మక మార్పులు..

నిజానికి.. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నా పింఛన్ల మంజూరుకు అప్పటి జన్మభూమి కమిటీ సభ్యులు ఇబ్బందులు పెట్టడాన్ని స్వయంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతల పట్ల మానవత్వాన్ని కనబరుస్తూ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోనే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను పూర్తిగా నిలబెట్టుకుంటూ పెన్షన్ మొత్తాన్ని ఏటేటా పెంచుకుంటూ ఈ జనవరి నుంచి రూ.మూడువేల చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇలా సీఎం జగన్ తానిచ్చిన మాటను అమలుచేసి చూపించడంతో సోమవారం రాష్ట్రంలో పలు మండలాలు, మున్సిపాలిటీల్లో స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎక్కడికక్కడ పెన్షన్ లబ్ధిదారులతో మమేకమవుతూ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. వలంటీర్లు కూడా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను డబ్బులు అందజేశారు.

18 నుంచి ఆరోగ్య గ్రామాల జాతీయ వర్క్‌షాప్

- గ్రామస్థాయిలో ఎస్‌డీజీ గోల్స్ అమలుపై తిరుపతిలో నిర్వహణ
- అన్ని రాష్ట్రాల నుంచి 450 మందికిపైగా ప్రతినిధుల హాజరు

సాక్షి, అమరావతి: ప్రజల జీవన ప్రమాణ పెంపునకు ఉద్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ గోల్స్)ను గ్రామస్థాయిలోనే సమర్థంగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ నుంచి మూడురోజులు తిరుపతిలో హెల్తీ గ్రామ పంచాయతీ (ఆరోగ్య గ్రామాలు) అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనుంది. ప్రపంచస్థాయిలో మనదేశ ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే.. ఇందుకుగాను ప్రభుత్వం చేపట్టే చర్యలు గ్రామస్థాయిలో సమర్థంగా అమలు కావడమే లక్ష్యంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ రెండేళ్ల కిందట దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల స్థాయిలో తొమ్మిది అంశాల ప్రాతిపదికన రాష్ట్రాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం జరుగుతున్న కార్యక్రమాల పరిశీలన చేపట్టింది. ఒక్కో అంశం అమలులో వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఉత్తమ విధానాలను మిగిలిన రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు వీలుగా అంశాల వారీగా జాతీయ వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తోంది. వీటిలో ఒకటైన ఆరోగ్య గ్రామాలు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఈ వర్క్‌షాప్‌ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల కిందటే వినూత్నంగా గ్రామస్థాయిలోనే ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గ్రామ సచివాలయాల స్థాయిలో 10,960 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను కొత్తగా ఏర్పాటు చేసింది. వాటికి మౌలిక వసతులను కల్పిస్తూ 8,299 చోట్ల హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టింది. ఇటీవల ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరుతో ప్రభుత్వ వైద్యబృందాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం స్థాయిలోనే ప్రత్యేక క్యాంపులను నిర్వహించింది. ఈ శిబిరాల్లో రక్తహీనత వంటి సమస్యలతో బాధపడేవారిని రక్త పరీక్షల ద్వారా గుర్తించడంతో పాటు బాధితులకు తగిన వైద్యసదుపాయం అందజేసింది. మరోవైపు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైన చిన్నారులు, గర్భిణుల్లో పోషకలోపాల నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాలపై జాతీయస్థాయిలో మరింత పెద్ద ఎత్తున చర్చకు అవకాశం ఉండేలా.. ఆరోగ్య గ్రామాలు అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. అన్ని అంశాలపై అవగాహన కల్పించనుంది.

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించనున్న ప్రతినిధులు

తిరుపతిలో జరిగే జాతీయ వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్రాల అధికారులు, 450 మందికిపైగా పాల్గొనే అవకాశం ఉందని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చెప్పారు. ఈ అంశంలో ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు వర్క్‌షాప్‌లో చర్చకు వస్తాయని తెలిపారు. వర్క్‌షాప్‌నకు హాజరయ్యే ప్రతినిధులు మన రాష్ట్రంలో అమల్లో ఉన్న కార్యక్రమాలను ఒక గ్రామ పంచాయతీలో పరిశీలిస్తారని చెప్పారు.

వీసాతో పనిలేకుండానే విదేశాలకు రయ్.. రయ్!




విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులు

విశాఖ నుంచి పెరుగుతున్న విమానయాన సర్వీసులు

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మలేషియాకు ఫ్లైట్
- వీసా రహిత ప్రయాణాన్ని ప్రకటించిన మలేషియా
- ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న 'ఎయిర్ ఏషియా'
- ఏప్రిల్ నుంచి థాయ్‌లాండ్‌కు మరో సర్వీస్
- ఇప్పటికే నిరంతర రద్దీతో సింగపూర్ విమానం



సాక్షి, విశాఖపట్నం: 'భారతీయులూ.. వీసా లేకుండా మా దేశాన్ని సందర్శించండి' అంటూ ఇటీవల వివిధ దేశాలు వరుసగా ప్రకటిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ.. ఇంటర్నేషనల్ ట్రిప్స్ కోసం ఎదురుచూస్తున్న వారంతా విమానంలో ప్రయాణించేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు అనుగుణంగా భారతీయులకు ప్రయాణ అవకాశాల్ని మరిన్ని కల్పించేందుకు విమానయాన సంస్థలు సిద్ధమవుతున్నాయి. టైర్–2 సిటీస్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయాలున్న నగరాలపై దృష్టి సారించాయి. వీటిలో విశాఖ ముందువరుసలో ఉంది. ఇప్పటికే విశాఖ నుంచి థాయ్‌లాండ్‌కు విమాన సర్వీసు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన ఎయిర్ ఏషియా సంస్థ.. తాజాగా మలేషియా వెళ్లేందుకు మరో సర్వీసును మొదలు పెట్టేందుకు ముహూర్తం చూసుకుంటోంది. ఈ సర్వీసు ప్రకటనతో విదేశాలకు విమాన సర్వీసులు విశాఖ నుంచి ఒక్కొక్కటిగా పెరుగుతూ వస్తుండటం విశేషం.

వీసాలతో పని లేకుండా..

వీసా ఉంటేనే విదేశాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. చాలా మందికి ఎంట్రీ లేదా టూరిస్ట్ వీసాలు దొరక్క.. తమకు నచ్చిన దేశంలో విహరించే ఆలోచనలను మధ్యలోనే విరమించుకుంటున్నారు. అలాంటి వారందరికీ ఇప్పుడు గోల్డెన్ చాన్స్ వచ్చేసింది. పాస్‌పోర్ట్ ఉంటే చాలు.. టికెట్ బుక్ చేసుకుని కొన్ని దేశాలకు ట్రిప్‌కు వెళ్లి రావొచ్చు. భారతీయ పాస్‌పోర్టు బలమైందిగా మారడమే దీనికి కారణం. ఇటీవల ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) విడుదల చేసిన వీసా ఫ్రీ దేశాల జాబితాలో ప్రపంచ దేశాల్లో భారత్ 83వ స్థానంలో నిలిచింది. ఈ కారణంగా కొన్ని దేశాలు భారతీయుల్ని విహారానికి వీసా లేకుండానే ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ అవకాశాల్ని విమానయాన సంస్థలు సద్వినియోగం చేసుకుంటున్నాయి.

థాయ్‌లాండ్, మలేషియాకు..

ఎయిర్ ఏషియా సంస్థ జైపూర్, గోవా, వారణాసితో పాటు విశాఖ నుంచి వీసా ఫ్రీ దేశాలకు సర్వీసులు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ముఖ్యంగా విశాఖపై ఎయిర్ ఏషియా స్పెషల్ ఫోకస్ పెట్టింది. దక్షిణ భారతదేశంలోని వివిధ నగరాల నుంచి కౌలాలంపూర్‌కు లిమిటెడ్ పీరియడ్‌తో ప్రత్యేక ప్రమోషన్ చార్జీలతో విమాన సర్వీసుల్ని ఎయిర్ ఏషియా ప్రకటించింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి కూడా సర్వీసులు నడపాలని నిర్ణయించింది. సౌత్ ఇండియా నుంచి ఈ ఏడాది ఫస్ట్ క్వార్టర్‌లో మొత్తంగా 69 వీక్లీ సర్వీసులు నడుపుతూ ఏడాదికి 1.5 మిలియన్ సీట్లతో రెండు దేశాల మధ్య సేవలను గణనీయంగా పెంచనున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే మరో వీసా ఫ్రీ ప్రకటించిన థాయ్‌లాండ్‌కు కూడా విశాఖ నుంచి ఏప్రిల్‌లో సర్వీసులు మొదలు పెడుతున్నట్టు ఎయిర్ ఏషియా ప్రకటించింది. ఏప్రిల్ 9 నుంచి మంగళవారం, గురువారం, శనివారం రోజుల్లో సర్వీసులు నడపనున్నట్టు వెల్లడించింది. మరోవైపు.. విశాఖ నుంచి సింగపూర్‌కు స్కూట్ సర్వీస్‌కు ఫుల్ డిమాండ్ ఉంది. ప్రతి రోజూ కనీసం 300 నుంచి 350 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న థాయ్, కౌలాలంపూర్ సర్వీసులతో విశాఖ నుంచి ఏకంగా మూడు విదేశీ సర్వీసులు నడవనున్నాయి. ఫిబ్రవరిలో ఇండిగో సంస్థ కూడా మరో విదేశీ సర్వీసు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఈ సర్వీసుల రాకతో విదేశీ ప్రయాణాలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు గేర్ మార్చినట్టుగా అధికారులు భావిస్తున్నారు.

దూసుకుపోతున్న ఎయిర్ ఏషియా

ఇప్పటివరకూ దాదాపు 60 దేశాలు వీసా ఫ్రీ ప్రకటించాయి. 30 నుంచి 90 రోజుల వరకూ వీసా లేకుండానే భారతీయులు తమ దేశానికి వచ్చి ఆతిథ్యాన్ని ఎంజాయ్ చెయ్యొచ్చని ప్రకటించాయి. తాజాగా తమ దేశ పర్యాటకానికి ఊతమిచ్చేందుకు వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక మాదిరిగానే మలేషియా కూడా భారతీయులకు వీసా ఫ్రీ ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతేడాది డిసెంబర్ 1 నుంచి మలేషియా ఈ అవకాశాన్ని కల్పించింది. ఇలా వీసా ఫ్రీ టూర్‌కు వివిధ దేశాలు అవకాశమిస్తున్న తరుణంలో విమానయాన సంస్థలు తమ సర్వీసుల్ని పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందులో ఎయిర్ ఏషియా సంస్థ అగ్రభాగంలో ఉంది. ఈ సంస్థ టైర్–2 నగరాల్లోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుల్నే టార్గెట్ చేస్తూ కొత్త సర్వీసుల్ని మొదలు పెడుతోంది.

కేరళ నాయర్లూ... రాజస్తాన్ గుజ్జర్లూ చుట్టాలే!

తేల్చిన జన్యుక్రమ విశ్లేషణ.. సీసీఎంబీ పరిశోధనతో వివాదానికి స్వస్తి

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రమైన కేరళలోని నాయర్లు... వాయవ్య దిశలో ఉన్న రాజస్తాన్, దాని పొరుగునే ఉన్న పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాలకు చెందిన గుజ్జర్లు చుట్టాలేనట! ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) తాజా అధ్యయనంలో వెల్లడించింది. నాయర్లతోపాటు కేరళకే చెందిన థియ్యాలు, ఎళవ తెగల ప్రజలు కూడా ఒకప్పుడు దేశ వాయవ్య ప్రాంతానికి చెందిన వారని జన్యుక్రమాల ఆధారంగా నిర్ధారించింది.

వలసలపై భిన్న వాదనలు...

భారతదేశ నైరుతి ప్రాంతం.. అంటే కేరళ, కర్ణాటక, తమిళనాడు దక్షిణ భాగాలు జీవవైవిధ్యానికే కాదు.. జన్యువైవిధ్యానికి కూడా పెట్టింది పేరు. వేల సంవత్సరాలుగా ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఇక్కడకు వలస వచ్చి స్థిరపడ్డారని చరిత్రకారులు చెబుతుంటారు. యూదులు, పార్సీలు, రోమన్ కేథలిక్కులు కొన్ని ఉదాహరణలు మాత్రమే. అయితే ఈ ప్రాంతంలోనే ఉన్నప్పటికీ నాయర్లు, థియ్యాలు, ఎళవ తెగల వారు ఎక్కడి నుంచి వలస వచ్చారన్న విషయంపై భిన్నాభిప్రాయాలు ఉండేవి. చరిత్రకారుల అంచనాల ప్రకారం వారంతా గంగా తీరంలోని అహిఛాత్ర (ఇనుప రాతి యుగం) ప్రాంతం నుంచి వలస వచ్చిన వారని చారిత్రక, లిఖిత దస్తావేజుల సాయంతో వాదిస్తున్నారు. మరోవైపు ఈ వాదనతో మరికొందరు విభేదించేవారు. వారంతా ఇండో–సిథియన్ వర్గం వారని, దేశ వాయవ్య ప్రాంతం నుంచి వలస వచ్చారని పేర్కొనేవారు.

డీఎన్ఏ సేకరణతో...

ఈ నేపథ్యంలో నాయర్లు సహా ఇతరుల వలస ఎలా సాగింది? వారు ఏ ప్రాంతానికి చెందిన వారై ఉండవచ్చో నిర్ధారించేందుకు సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త కుమారస్వామి తంగరాజ్ నేతృత్వంలోని బృందం ప్రయత్నించింది. నాయర్లు, థియ్యాలు, ఎళవ తెగల వంటి భూస్వామ్య, యుద్ధవీరుల తెగలకు చెందిన 213 మంది జన్యుక్రమాలను సేకరించింది. అటు తల్లివైపు నుంచి మాత్రమే అందే మైటోకాండ్రియల్ డీఎన్ఏ గుర్తులు, ఇటు జన్యుక్రమం మొత్తమ్మీద ఉండే ఆటోసోమల్ గుర్తులను (మన మునుపటి తరాల గురించి తెలిపేవి. సెక్స్ క్రోమోజోములు మినహా మిగిలిన 22 క్రోమోజోముల్లో ఈ మార్పులు ఉంటాయి. వారసత్వంతోపాటు జన్యుపరమైన సంబంధాలు, నిర్దిష్ట వ్యాధులు సోకేందుకు ఉన్న అవకాశాల గురించి ఈ మార్పులు సూచిస్తాయి) విశ్లేషించింది. వాటిని యూరేసియా ప్రాంతంలోని పురాతన, ప్రస్తుత తెగల జన్యుక్రమాలతో తంగరాజ్ బృందం పోల్చిచూసింది. కేరళలోని నాయర్లు, థియ్యాలు, ఎళవలతోపాటు కర్ణాటకలోని బంట్స్ (ఐశ్వర్యరాయ్ బంట్ తెగకు చెందిన మహిళ), హొయసళ సామాజిక వర్గ ప్రజలు కూడా జన్యుపరంగా దేశ వాయవ్య ప్రాంత ప్రజలతో దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నారని ఈ పరిశోధన ద్వారా స్పష్టమైంది. ఈ పరిశోధన వివరాలు జినోమ్ బయాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



వారి మధ్య ఎక్కువ జన్యుసంబంధాలు

నాయర్లు, థియ్యా, ఎళవ తెగల ప్రజలకు దేశ వాయవ్య ప్రాంతంలోని కాంభోజ్, గుజ్జర్ తెగల ప్రజలకు మధ్య జన్యుసంబంధాలు ఎక్కువగా ఉన్నట్లు ఈ పరిశోధన స్పష్టం చేసింది. అంతేకాకుండా వారిలో ఇరాన్ ప్రాంత జన్యు వారసత్వం కూడా ఇతరుల కంటే ఎక్కువగా ఉంది. తల్లివైపు నుంచి అందిన జన్యు సమాచారాన్ని విశ్లేషిస్తే పశ్చిమ యూరేసియా ప్రాంత వారసత్వం కనిపిస్తోంది. దీన్నిబట్టి మహిళల నేతృత్వంలో జరిగిన వలసలో వారు భాగమై ఉంటారని చెప్పవచ్చు.

– డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, శాస్త్రవేత్త

గోదావరి తీరం మీదుగా

భారతదేశ దక్షిణ, పశ్చిమ తీర ప్రాంతంలోని వాయవ్య ప్రాంతం నుంచి గోదావరి తీరం ద్వారా కర్ణాటకకు ఆ తరువాత అక్కడి నుంచి మరింత దక్షిణంగా కేరళకు నాయర్లు, ఇతర వర్గాల ప్రజలు వలస వచ్చినట్లు ఈ పరిశోధన ద్వారా తేలింది.

– డాక్టర్ వినయ్ నందికూరి, సీసీఎంబీ డైరెక్టర్

100% ఆక్యుపెన్సీ దాటిన 'వందేభారత్'

విశాఖ–సికింద్రాబాద్, సికింద్రాబాద్–తిరుపతి రైళ్లకు భారీ డిమాండ్ / న్యూఇయర్, సంక్రాంతి నేపథ్యంలో పెరిగిన రద్దీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన వందేభారత్ రైళ్లు అత్యధిక ఆక్యుపెన్సీతో పరుగులు తీస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వేలో గతేడాది ప్రవేశపెట్టిన నాలుగు రైళ్లలో ఆక్యుపెన్సీ వంద శాతం దాటింది. ఈ రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రయాణికుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది.



సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్‌లో 134% ఆక్యుపెన్సీ..

సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను గతేడాది జనవరిలో ప్రవేశపెట్టారు. 16 కోచ్‌లతో ఈ రైలు ప్రారంభమైంది. మొదటి నుంచి ఈ రైలు 100 శాతం ఆక్యుపెన్సీతో స్థిరంగా నడుస్తోంది. గత డిసెంబర్‌లో సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో 134 శాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం విశేషం. ఇక విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే వందేభారత్‌లో ఇది ఏకంగా 143 శాతానికి చేరుకుంది. గత డిసెంబర్ ఆఖరు వారంలో వరుస సెలవులు రావడంతో ఎక్కువ మంది రాకపోకలు సాగించారు. సంక్రాంతి వరకు కూడా ప్రయాణికుల రద్దీ ఇలాగే ఉండవచ్చని అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్‌లో...

గతేడాది ఏప్రిల్లో సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను మొదట 8 కోచ్‌లతో ప్రారంభించారు. ఈ ట్రైన్‌ను ప్రవేశపెట్టినప్పటి నుంచి 100 శాతం ఆక్యుపెన్సీతోనే నడుస్తోంది. ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన లభించడంతో గతేడాది మే 17 నుంచి 16 కోచ్‌లకు పెంచారు. గత డిసెంబర్‌లో సికింద్రాబాద్ నుంచి తిరుపతి వరకు 114 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. అలాగే తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే వందేభారత్‌లో 105 శాతానికి ఆక్యుపెన్సీ చేరుకోవడం గమనార్హం. మరోవైపు గత సెప్టెంబర్‌లో 8 బోగీలతో ప్రవేశపెట్టిన కాచిగూడ–యశ్వంత్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో డిసెంబర్‌లో ఆక్యుపెన్సీ 107 శాతానికి చేరింది. తిరుగు దిశలో యశ్వంత్‌పూర్ నుంచి కాచిగూడ వరకు 110 శాతం వరకు నమోదైంది. అలాగే దక్షిణమధ్య రైల్వే పరిధిలోని విజయవాడ–ఎంజీఆర్ చెన్నై–వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సైతం గత డిసెంబర్‌లో 126 శాతం ఆక్యుపెన్సీ నమోదవగా చెన్నై నుంచి విజయవాడకు వచ్చే ట్రైన్‌లో ఇది 119 శాతం వరకు ఉంది. గత సెప్టెంబర్‌లో 8 కోచ్‌లతో ఈ ట్రైన్‌ను ప్రవేశపెట్టారు. ఈ ట్రైన్ తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తోంది.

ఆకట్టుకుంటున్న సదుపాయాలు...

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏర్పాటు చేసిన సదుపాయాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. తక్కువ సమయంలోనే గమ్యస్థానానికి చేరుకొనే విధంగా రైళ్లను నడుపుతుండటంతో ఎక్కువ మంది వందేభారత్ వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ ట్రైన్‌లో ఏసీ చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఆటోమేటిక్ స్లైడింగ్ డోర్లు, రిక్లైనింగ్ సీట్లు, అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలు కెమెరాలు, డిఫ్యూజ్డ్ ఎల్ఈడీ లైటింగ్, చార్జింగ్ పాయింట్ల వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.